www.jagritiweekly.com

సంపుటి : 76 సంచిక : 19 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ ఫాల్గుణ శుద్ధ నవమి


18-24 మార్చి 2024


వెల : ₹20/-

## శిలాన్యాస్ నవ భారతానికి పునాది



## సాకారమైన పౌరసత్వ సవరణ చట్టం





# కటిక దారిద్ర్యాన్ని నిర్మూలించినట్టే!

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



# శౌర్యప్రతిమ

విదేశీ దురాక్రమణదారులతో, వలసవాదులతో పోరాడి ఈ దేశ ప్రతిష్టను కాపాడిన వారు ఎందరో ఉన్నారు. అలాంటి వారు దేశంలోని అన్ని ప్రాంతాలలోను కనిపిస్తారు. కానీ కొందరి చరిత్రలే వాసికెక్కాయి. ఎందరో వర్తమాన తరాలకు తెలియకుండా అజ్ఞాతంలో ఉండిపోయారు.


**1671** నాటి సరాయ్‌ఘాట్ యుద్ధంలో పోరాడిన లాచిత్ బడ్‌పుకన్ మహావీరుడు. మొగలులతో యుద్ధం చేశాడు. మొగల్ సేనాని ఒకటో రామ్‌సింగ్‌కూ బడ్‌పుకన్‌కూ మధ్య యుద్ధమది. ఆ యుద్ధంలో అహోమ్ రాజ్యాన్ని బడ్‌పుకన్ రక్షించారు. ఇది జరిగిన దాదాపు సంవత్సరం తరువాత **1672** ఏప్రిల్‌లో ఆయన కన్నుమూశారు. గౌహతి నగరాన్ని స్వాధీనం చేసుకోవడానికి మొగలాయిలు **1667**లో చేసిన ప్రయత్నాన్ని కూడా బడ్‌పుకన్ తిప్పికొట్టాడు. అలాంటి మహావీరుని స్మరిస్తూ **125** అడుగుల ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మార్చి తొమ్మిన జొర్హాత్‌లో ఆవిష్కరించారు. దీనికి శౌర్య ప్రతిమ అని పేరు పెట్టారు. రామ్‌వాంజి సుతార్ ఈ ప్రతిమను తయారు చేశారు.



# జాగృతి.. ఒక మేలుకొలుపు.. ఒక వేకువ పిలుపు..

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఐదు సం.రాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

సం. చందా రూ.850/-
http://payit.cc/S18970





## రిజిస్టర్డ్ పార్సిల్ సదుపాయం కోసం...

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను
రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా
అందుకోవడానికి పక్కనున్న
క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/- +
మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ.624/- )

వెల : రూ.1474/-
https://payit.cc/S32796

విడి ప్రతి
రూ.20/-



తక్షణ, చారిత్రక అవసరం
## ఉమ్మడి పౌరస్మృతి
వెల : రూ.20/-
ప్రతులకు:
సాహిత్య నికేతన్
హైదరాబాద్-27
040-27563236
9290127329

Bank A/c details :
Jagriti Prakashan Trust, A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad,
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

వివరాలకు సంప్రదించండి
సర్క్యులేషన్ మేనేజర్ : 040-27561453 / 9959997013

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagritity 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ **040-27561453/9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

దేశంలో అద్దెగర్భాలు పెరుగుతున్నాయా? ఎందువల్ల?

**'జన్మ'**

ధారావాహిక నవలలో చదవండి!

రచన: సంబరాజు లీల (లట్టుపల్లి)

**త్వరలోనే...**

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** | **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ-ఎన్‌డీఏ ప్రభుత్వ దశాబ్దకాల చరిత్రలోనే కాదు, స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే మరొక గొప్ప తేదీ నమోదైంది. మార్చి 11, 2024న పౌరసత్వ (సవరణ) చట్టం 2019 (సీఏఏ) అమలులోకి వచ్చింది. దేశహితం కోసం రాజకీయ సంకల్పం కలిగిన ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయమిది. 2016 నుంచి ఈ అంశం గురించి బీజేపీ-ఎన్‌డీఏ ప్రభుత్వం స్పష్టంగానే ఉంది. 2019 ఎన్నికలలో బీజేపీ దీనినొక అంశంగా చేసుకుంది కూడా. బుజ్జగింపు రుగ్మతతో, మతోన్మాదం తలకెక్కిన పార్టీలు, సంస్థల వీరంగంతోను, మరొక పక్క కొవిడ్ విజృంభణతోను దీని అమలును నిలిపివేయవలసి వచ్చింది. కొంత ఆలస్యం జరిగినా మొత్తానికి కేంద్రం ఈ చట్టాన్ని అమలులోకి తెచ్చింది.

పౌరసత్వ సవరణ బిల్లు, 1955ను సవరించడానికి జూలై 15, 2016న ప్రయత్నాలు ఆరంభమైనాయి. డిసెంబర్ 11,2019న రాజ్యసభ ఇందుకు సంబంధించిన బిల్లుకు ఆమోదం (125-99) తెలిపింది. జనవరి 30, 2020న జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సమావేశంలో నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఒక విషయం జాతి దృష్టికి తీసుకువచ్చారు. 'పాకిస్తాన్‌లో నివసించడానికి ఇష్టపడని హిందువులు, సిక్కులు భారత్‌కు రావచ్చు. ఇక్కడ వారు సాధారణ జీవితం గడపడానికి కేంద్రం అన్ని ఏర్పాట్లు చేయాలి' అన్నారు మహాత్మా గాంధీ. గాంధీజీ మాటలను విపక్షాలు సౌకర్యంగా మరచిపోయి ఉండవచ్చు. కాంగ్రెస్ అయితే కావాలనే విస్మరించి ఉంటుంది కూడా. గాంధీజీ మాటే గుర్తు ఉండి ఉంటే విపక్షాలు ఇంతగా బరితెగించేవి కావు. బీజేపీ తీసుకువచ్చిన సీఏఏ ఆంతర్యం గాంధీజీ ఆశయాన్నే కదా ప్రతిబింబిస్తున్నది! పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్తాన్‌లలో మతపరంగా అణచివేతకు గురి అవుతున్న హిందువులు, సిక్కులు, పార్సీలు, బౌద్ధులు, జైనులు, క్రైస్తవులు భారతదేశానికి వచ్చి పౌరసత్వం తీసుకోవచ్చు. సగౌరవంగా బతకవచ్చు. ఇప్పుడు విపక్షాల అల్లరి అంతా ఇందులో ముస్లింలను ఎందుకు చేర్చరు అనే! ముస్లింలు ఇక్కడికి వేరే పద్ధతిలో రావచ్చు. కానీ ముస్లిం రాజ్యాలలో

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ ఫాల్గుణ శుద్ధ నవమి**

లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
**కటిక దారిద్ర్యాన్ని నిర్మూలించినట్టే!** 6లో



విజయ యాత్ర
**అదిగో శంకరాచార్య పర్వతం!** 20లో



ప్రత్యేక వ్యాసం
**రంగుల కేళీ... హోలీ** 26లో

# జాగృతి

## సంపాదకీయం

ముస్లింలు మతపరమైన అణచివేతను ఎదుర్కొంటారా? తిరుగుబాటు, హక్కుల పోరాటం, లేదా రాజకీయ కారణాలతో వారు ఆ రాజ్యానికి వ్యతిరేకులు కావచ్చు. ఆ పరిధిలో వారు ఏ దేశానికైనా వెళ్లవచ్చు. నిజానికి ఆ మూడు దేశాలలో మతపరంగా వివక్షకు గురి అయి భారతదేశం రావాలని అనుకున్న వారికి 2022 నుంచి పౌరసత్వం ఇచ్చే అధికారాన్ని దాదాపు ముప్పయ్ జిల్లాల కలెక్టర్లకు కేంద్రం ఇచ్చింది. పెళ్లి పందిళ్లలోకి చొరబడి మైనారిటీల వధువులను ఎత్తుకెళ్లిపోయే రాక్షస సంస్కృతి రాజ్యమేలుతున్న పాక్ వంటి చోటు నుంచి

# సీఏఏ- శ్రీరామరక్ష

బయటపడాలనుకుంటున్న హిందువులకు భారతదేశం ఆశ్రయం కల్పించి తీరాలి. అలాగే మిగిలిన ముస్లిమేతర మైనారిటీలు కూడా.

సీఏఏ వ్యతిరేకత పేరుతో భారత్‌లో జరిగిన అల్లర్లు, అంతర్జాతీయంగా జరిగిన దుష్ప్రచారం పరమ నీచమైన చర్యలే. అంతా పథకం ప్రకారం జరిగినవే కూడా. డిసెంబర్ 11, 2019న రాజ్యసభ సీఏఏకు ఆమోదం తెలిపితే డిసెంబర్ 15 కల్లా దేశంలో మంటలు రాజేశారు. అలీఘడ్ ముస్లిం విశ్వవిద్యాలయం, ఢిల్లీలోని జామియా మిలియా విశ్వవిద్యాలయం అల్లర్లతో అట్టుడికి పోయాయి. వాటిని నిరోధించడానికి పోలీసులను పంపవలసి వచ్చింది. మరునాడే షాహీన్‌బాగ్‌లో 'పేద మహిళలు' దీక్ష మొదలు పెట్టారు. తరువాత ఉత్తరప్రదేశ్, కర్ణాటక తదితర ప్రాంతాలలో అల్లర్లు జరిగాయి. మొత్తం 69 మంది చనిపోయారు. ఇందులో నైరుతి ఢిల్లీలో 'ఆప్' కార్పొరేటర్ కనుసన్నలలో జరిగిన మత కల్లోలాలలోనే 42 మంది చనిపోయారు. షాహీన్‌బాగ్ అసలు రూపం తరువాత బయటపడింది. సీఏఏ వస్తే దేశంలో ముస్లింల పౌరసత్వం రద్దు అవుతుందంటూ ఓ పచ్చి అబద్ధాన్ని ముస్లిం గురువులు, ఇతర రాజకీయ పార్టీలు కూడా నిస్సిగ్గుగా దేశమంతటా వినిపించాయి.

విదేశీయులు తరాల తరబడి తిష్ట వేయడానికి ముందుచూపు గల ఏ ప్రభుత్వం అంగీకరించదు. దేశం పట్ల, జనాభా సమతౌల్యం పట్ల సమ్యక్ దృక్పథం కలిగిన ఏ నాయకత్వం ఆ పేరుతో సాగే ఎలాంటి ఆటలను సహించదు కూడా. మధ్యయుగాల దురాక్రమణదారులు ఈ దేశాన్ని ధర్మసత్రంలా భావించడమే దారుణమనుకుంటే, ఇవాళ కొన్ని రాజకీయ పార్టీలు తమ మనుగడ కోసం ఈ దేశం ఇంకా ధర్మసత్రంలానే కొనసాగాలని కోరుకుంటున్నాయి. ఎన్నికల ముందే సీఏఏ అమలు ఎందుకు గుర్తుకు వచ్చిందని కొన్ని పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. 370 స్థానాలతో బీజేపీ తిరిగి ఎన్నిక కావడం, మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం తథ్యమని ప్రతి సర్వే చెబుతుంటే (ఎన్‌డీఏ 400 స్థానాలు సాధించాలని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారు) విపక్షాలు ఇలా ఎందుకు వదరుతున్నాయో అర్థం కాదు. ప్రస్తుతం చాలా దేశాలు జనాభా సమతౌల్యం గురించి గట్టిగా యోచిస్తున్నాయి. ఇప్పుడు మన విపక్షాలు ఏ వర్గాన్ని సీఏఏలో చేర్చనందుకు గోల చేస్తున్నాయో, ఆ వర్గంతోనే ఆ దేశాలు సమగ్రత కోణం నుంచి తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇది గమనించి తీరాలి. సీఏఏ కావచ్చు, 370 అధికరణ రద్దు కావచ్చు. ఇలాంటివే మరే కీలక నిర్ణయమైనా కావచ్చు. మోదీ ప్రభుత్వం దొడ్డిదారిన తీసుకురాలేదు. ఎన్నికల ప్రయోజనాలను అసలే పట్టించుకోలేదు. నిజానికి దేశభద్రత కోసం, సైన్యాన్ని పటిష్టం చేయడానికీ, సరిహద్దులను కట్టడి చేయడానికీ నరేంద్ర మోదీ ఏం చేసినా విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయి భారతీయ విపక్షాలు. వాటికి భారతీయ జనతా పార్టీని విమర్శించడానికీ, భారత్‌ను విమర్శించడానికీ తేడాయే లేదు. అంత అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సీఏఏ ఈ దేశానికి శ్రీరామరక్ష. ★

18 మార్చి 2024, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**జీవ గడియారం**

– స.రామనరసింహం





సాకారమైన పౌరసత్వ సవరణ చట్టం (చర్చ) – 11
ఎన్‌డిఎలోకి టీడీపీ పునః ప్రవేశం (ఆంధ్రప్రదేశ్) – 16
ఘర్షణ వైఖరి అభిమతం కాదు (తెలంగాణ) – 22
సీసా, సారా రెండూ పాతవే! (అంతర్జాతీయం) – 24
శిలాన్యాస్ నవ భారతానికి పునాది (ముఖాముఖీ) – 28
వందేమాతరం ఉద్యమ స్ఫూర్తితో.. (పోరాటం) – 34
భారత టెస్టు క్రికెటర్లకు కాసుల పంట! (క్రీడ) – 43
గమ్మత్తైన ప్రయోగం 'గామి' (సినిమా) – 50



# కటిక దారిద్ర్యాన్ని

**భారతదేశం అధికారికంగా 'కటిక పేదరికాన్ని' (యాబ్సల్యూట్ పావర్టీ)ని జయించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం వెల్లడించింది. విదేశీ యూనివర్సిటీ 'బ్రూక్లిన్ యూనివర్సిటీ' అధ్యయనం చేసి మరీ తమ నివేదికను వెలువరించింది. దీనితో మన వామపక్ష మేధావులు ప్రస్తుతం ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, ఈ సమయంలోనే 2023-24 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో వృద్ధి రేటు 8.4 శాతానికి చేరుకున్నదనే విషయాన్ని వెల్లడించి ప్రభుత్వం మరో షాక్ ఇచ్చి, వామపక్ష మేధావులు, ఉదారవాదుల నోటమాట రాకుండా చేసింది. ఎందుకంటే, ఈ రెండు సాకులు చూపుతూ, మార్క్సిజం ఎంత ముఖ్యమో, ఎందుకు ముఖ్యమో చెప్పుకుంటూ సమాజాలు, ప్రభుత్వాలపై వామపక్షులు తమ ఆధిపత్యాన్ని చెలాయిస్తూ వస్తున్నారు. భారత్‌లో వారికి ఇవి రెండూ గట్టి దెబ్బలేననే విషయం చెప్పనవసరం లేదు.**

ఇందుకు కారణం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలే అన్నది నిర్వివాదం. ఆ విశ్వాసంతోనే తనను మూడవసారి గెలిపిస్తే, భారత్ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోని అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతానని మోదీ హామీ ఇస్తున్నారు. ఐఎంఎఫ్ వంటి సంస్థలు కూడా 2025-2027 మధ్య భారత్ మూడవ స్థానాన్ని ఆక్రమిస్తుందనే జోస్యం చెబుతున్నాయి. ప్రస్తుతం వ్యవస్థాపకతపై దృష్టి పెట్టడమే కాక ప్రభుత్వం ప్రైవేటు రంగానికి కూడా అత్యధిక ప్రాముఖ్యతనిచ్చి, ప్రోత్సాహాన్ని ఇస్తోంది. ఎంఎస్ఎం ఇల స్థాపన, స్టార్టప్‌లకు ప్రోత్సాహం అన్నది మనం ప్రగతి సోపానాలను వేగంగా ఎక్కేందుకే.

ఎవరు అవునన్నా, కాదన్నా భారతదేశ ఆర్థిక ప్రగతి పరుగులు తీస్తోంది. ఒకనాటి 'బంగారు చిలుక' అన్న పేరును తిరిగి సాధించే మార్గంలో శరవేగంతో దూసుకుపోతున్నది. ఒకనాడు మనను పాలించిన బ్రిటిషు వారి ఆర్థిక వ్యవస్థను అధిగమించి, ప్రపంచ అతిపెద్ద ఐదవ ఆర్థికవ్యవస్థగా అవతరించింది. ఈ వేగానికి మరింత ప్రోత్సాహాన్ని ఇస్తూ భారత స్టాక్ ఎక్స్చేంజి నిన్న మొన్నటి వరకూ నాలుగవ అతిపెద్ద స్టాక్ ఎక్స్చేంజిగా ఉన్న హాంగ్‌కాంగ్ స్టాక్ ఎక్స్చేంజిని వెనక్కి నెట్టి ఆ స్థానాన్ని ఆక్రమించింది. ప్రస్తుతం మొత్తం 4.33 ట్రిలియన్ డాలర్ల విలువైన షేర్ల లిస్టింగ్‌తో భారత స్టాక్ ఎక్స్చేంజి తన సామర్థ్యాన్ని చాటుకుంది. ప్రస్తుతం ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులను, ఇతర స్థితిగతులను గమనించినప్పుడు, భవిష్యత్తులో భారతదేశం 5.63 ట్రిలియన్ డాలర్ల విలువైన షేర్లు కలిగిన జపాన్ స్టాక్ మార్కెట్‌ను కూడా అధిగమించి, చైనా మార్కెట్‌ను వెనక్కినెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో మనం కటిక దారిద్ర్యాన్ని జయించామన్నది గొప్ప వార్తేనన్నది నిర్వివాదం.

### భారత్‌లో దారిద్ర్య క్షీణతపై బ్రూక్లిన్ వర్సిటీ నివేదిక

బ్రూక్లిన్ యూనివర్సిటీ 'కటిక పేదరికం'పై వెలువరించిన నివేదిక ప్రకారం, తలసరి దారిద్ర్య నిష్పత్తిలో క్షీణత, గృహ వినియోగంలో పెరుగుదల ద్వారా వారు ఈ భావనకు వచ్చారు. గత దశాబ్ద కాలంలో బలమైన పునఃపంపిణీపై ప్రభుత్వం పెట్టిన విధానపరమైన దృష్టి ఫలితంగానే ఈ సమ్మిళిత వృద్ధి సాధ్యమైందని నివేదిక పేర్కొనడం విశేషం. 'సబ్ కా సాథ్, సబ్ కా విశ్వాస్, సబ్ కా వికాస్' అంటూ నరేంద్ర మోదీ వికసిత భారత్ కోసం ఇచ్చిన, ఇస్తున్న నినాదం ఏ రీతిలో సాకారమవుతున్నదో ఈ నివేదిక చెప్పకనే చెప్తోంది. పదేళ్లలో తొలి అధికారిక సర్వే ఆధారిత దారిద్ర్య అంచనాలను అందిస్తూ భారతదేశం ఇటీవలే 2022-23 సంవత్సరానికి

డి. అరుణ



# నిర్మూలించినట్టే

గాను అధికారిక వినిమయ వ్యయ డేటాను విడుదల చేసింది.

వరల్డ్ డేటా లాబ్స్ రూపొందించిన వరల్డ్ పావర్టీ క్లాక్ (దారిద్ర్య గణన) డేటా ప్రకారం 34,458,941 మంది ప్రస్తుతం కటిక పేదరికంలో జీవిస్తున్నారు. ఇది భారత జనాభాలో 2 శాతం మాత్రమే. ఈ రెండు శాతంలో 32,5-7, 519 మంది (94శాతం) గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు కాగా, 1,941,362 మంది పట్టణ వాసులు (6శాతం). అధిక వృద్ధి, అసమానతలలో క్షీణత కలిసి కటిక దారిద్ర్యాన్ని నిర్మూలించడానికి కారణమయ్యాయి. ఇది ప్రస్తుతం 1.9 డాలర్ల దారిద్ర్య రేఖవద్ద కొనుగోలు శక్తి తుల్యత ఆధారంగా రూపొందించిన నివేదిక. దీని ప్రకారం గ్రామీణ దారిద్ర్యం 2.5శాతం ఉండగా, పట్టణ ప్రాంతంలో 1 శాతానికి వచ్చింది. దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న వారి సంఖ్యను తగ్గించడం ద్వారా ఇతర దేశాలలాగా ప్రస్తుతం భారత్ దారిద్ర్యరేఖను పునర్నిర్వచించి, ప్రస్తుతమున్న కొలమానమైన 1.9 డాలర్ల నుంచి 3.2 డాలర్ల దగ్గర దానిని స్థిరపరచవలసి ఉందని కూడా నివేదిక పేర్కొంది. ఉద్దేశిత లబ్ధిదారులను మెరుగ్గా గుర్తించి, నిజమైన పేదలకు మరింత తోడ్పాటును అందించేందుకు ఉనికిలో ఉన్న సామాజిక సంరక్షణ కార్యక్రమాలను తిరిగి నిర్వచించుకొనేందుకు ఈ కొలమానం అవకాశమిస్తుందని నివేదిక పేర్కొంది.

నివేదిక అంచనాలు దాదాపు మూడొంతుల మంది జనాభాకు ప్రభుత్వం అందచేస్తున్న ఉచిత బియ్యం, గోధుమలను, ప్రభుత్వ విద్య, ఆరోగ్యం వసతులను ఉపయోగించుకోవడాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ప్రపంచ బ్యాంకు వేసిన అంచనాలకన్నా భారతదేశంలో నివేదిక ప్రకారం అత్యంత తక్కువ మంది నిరుపేదలు ఉన్నారు. ప్రభుత్వ నిధులతో విస్తృతమైన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పునఃపంపిణీపై బలమైన దృష్టి పెట్టడం వల్లనే గ్రామీణ ప్రాంతాల వినిమయంలో వృద్ధి సాధ్యమైందని నివేదిక రూపకర్తలు పేర్కొంటున్నారు.

ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాల ఆధారంగా రూపొందించే బహుముఖీయ పేదరికం లేదా దారిద్ర్యం (ఎంపిఐ) నుంచి కూడా ప్రజలు బయటపడినట్టు నివేదిక ఆధారంగా మనకు తెలుస్తుండగా, అసంతృప్తులు మాత్రం ఏ మాత్రం హర్షాన్ని వ్యక్తం చేయడం లేదు. వాస్తవానికి ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ అనే సంస్థ అభివృద్ధి చేసిన ఈ బహుమితీయ పేదరికం కొలమానానికి భారత్ కొత్తగా ప్రసూతి/తల్లి ఆరోగ్యం, బ్యాంక్ అకౌంట్లను కూడా చేర్చింది. జాతీయ ఆరోగ్య మిషన్ కింద అమలవుతున్న ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ యోజన, జన్‌ధన్ ఖాతాలు మన ఆర్థిక వ్యవస్థలో పోషిస్తున్న పాత్రను లోతుగా తరచి చూస్తే తప్ప అర్థం కానిది. యుపిఐ విజయానికి ఈ ఖాతాలే కారణమని అంతర్జాతీయ విత్త సంస్థ (ఐఎంఎఫ్) కూడా కితాబిచ్చింది. అలాగే, ప్రజల గడపకు ఆరోగ్యాన్ని తీసుకువెళ్లేందుకు ఎయిమ్స్ వంటి పెద్ద ఆసుపత్రులే కాదు మారుమూల పల్లెల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి ఆరోగ్య సేవలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గమనించేందుకు ఎవరికీ భూతద్దమేం అక్కర్లేదు.

## మాట తప్పని ప్రధాని

ప్రధాని మోదీ ఏదైనా హామీ ఇస్తే అది సాకారమవుతుందనే విషయం ఈ పదేళ్లలో ప్రజలకు అనుభవంలోకి వచ్చిన విషయమే. అందుకే సామాన్యులు కూడా నేడు 'మోదీ కీ గ్యారెంటీ'పై అత్యంత భరోసాతో ఉన్నారు. మోదీ ప్రధానిగా అధికారం చేపట్టే సమయానికి మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో పదవదిగా ఉంది. మోదీ వచ్చిన పదేళ్లల్లోనే ఐదు మెట్లు ఎక్కించేశారు. ప్రస్తుతం ఎగుమతులు, మౌలికసదుపాయాల కల్పన, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, కార్పొరేట్ రంగంలో పరిశోధన, అభివృద్ధి పై ఎక్కువ దృష్టినీ, పెట్టుబడులను పెట్టాల్సిన అవసరం ఉంది.

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ప్రభావంతో భారత్ కేవలం తన సరిహద్దులలోనే కాక ఆవల కూడా ప్రజల సంక్షేమానికి కూడా దోహదం చేస్తున్నది. ఈ విషయాన్ని మనం కొవిడ్ సమయంలో



గమనించాం. భారతదేశం తన అభివృద్ధి ప్రయాణంలో చేపట్టిన అనేక ఆర్థిక వ్యూహాలు, చొరవలు, విజయాలు ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు అందుకోవడమే కాదు, ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచాయి. ఒక దేశపు బలం, ఆవిష్కరణలు, నిరంతర ఆర్థిక సంస్కరణలు అన్నవి దానిని అంతర్జాతీయ వేదికపై ఎలా నిలుపుతాయో భారత వృద్ధి కథనం వివరిస్తుంది. ఆర్థిక సంవత్సరం 2022-23లో 7.2 శాతం అత్యధిక రేటుతో భారత్ వృద్ధి చెందిందని ప్రపంచ బ్యాంకు కూడా అంగీకరించింది. భారత వృద్ధి రేటు ఉద్భవిస్తున్న మార్కెట్ ఆర్థిక వ్యవస్థలకు రెండింతలు ఉండటమే కాదు, జి20 దేశాలలో రెండవ స్థానంలో ఉంది.

## దూసుకుపోతున్న జీడీపీ వృద్ధి రేటు

ఎవరూ ఊహించని విధంగా ఆర్థిక సంవత్సరం 2023-24 మూడవ త్రైమాసికంలో 8.4 శాతం

జిడిపి వృద్ధిని చూపి, ఆర్థికవేత్తలను సైతం ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఎందుకంటే, ప్రభుత్వ వ్యయం తగ్గడం, పారిశ్రామిక ఉత్పత్తిలో వృద్ధి మందగించడం, మూడవ త్రైమాసికంలో రుతుపవ నాలు అస్థిరంగా ఉండడం వల్ల గత త్రైమాసికాని కన్నా వృద్ధి గణాంకాలు తక్కువగా ఉంటాయని వారంతా అంచనా వేశారు. కాగా, బలమైన నిర్మాణ రంగం, ఉత్పత్తి రంగాల వల్ల నిపుణుల అంచనాలను మించి ఈ వృద్ధి సాధ్యమైందని జాతీయ గణాం కాల కార్యాలయం (ఎన్ఎస్ఒ) వెల్లడించింది. ఉత్పత్తి రంగం మూడవ త్రైమాసికంలో 11.6శాతం విస్తరించగా, నిర్మాణ రంగం 9.5శాతం పెరిగిందని ఎన్ఎస్ఒ వివరించింది. కొన్ని ప్రైవేటు సంస్థలు మూడవ త్రైమాసిక వృద్ధి రేటు గురించి ప్రముఖ ఆర్థికవేత్తల అంచనాలను కోరినప్పుడు వారిచ్చిన



సమాచారం ప్రకారం ఈ రేటు గత త్రైమాసికంలో గణాంకాల మంత్రిత్వ శాఖ ప్రకటించిన 7.6కన్నా తగ్గి 6.64శాతం వద్ద స్థిరపడు తుందని వారు అంచనా వేశారు. '2023-24 త్రైమాసికంలో ఆరోగ్యవంతమైన 8.4శాతం జిడిపి వృద్ధి రేటు భారత ఆర్థిక వ్యవస్థ బలాన్ని, దాని సంభావ్యతను చూపుతుంది. 140మంది కోట్ల భారతీయులు మెరుగైన జీవితాన్ని గడుపుతూ, వికసిత భారత్‌ను సృష్టిం చేందుకు తోడ్పడే వేగవంతమైన ఆర్థికవృద్ధిని సాధించేందుకు మా కృషి కొనసాగు తుంది,' అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్'పై పోస్ట్ చేసి వృద్ధి రేటుపై సానుకూలంగా స్పందించారు. కాగా, బలమైన జిడిపి వృద్ధి ఉన్న ప్పటికీ ప్రైవేటు వినిమయ వృద్ధి 3.6శాతం వద్దే ఉండటం అన్నది ఆందోళన కలిగించే విషయమని కొందరు ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు.

జిడిపి గణాంకాలు బలంగా ఉండి, వృద్ధి అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నా, బాహ్య కారకాలు ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశముందని ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ అప్రమత్తం చేయడం గమనార్హం. కనుక, అనేకమంది అంచనా వేసిన దానికన్నా మెరుగ్గా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందిందంటే, భారత ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక పరివర్తన చోటు చేసుకుంటోందనే విషయాన్ని అది పట్టి చూపుతోందని ఆయన వివరించారు. అటు భౌతిక మౌలిక సదుపా యాలు, ఇటు డిజిటల్ అవస్థాపనలతో పాటు సమ్మిళిత అజెండా భారతీయ కుటుంబాల కొనుగోలు శక్తికి దోహదం చేస్తోందంటూ, ఈ వృద్ధి రేటు వెనుక గల అసలు కారణాలను ఆయన వివరించారు.

కాగా, అన్ని రంగాలలోకి అతి బలహీనంగా ఉన్నది వ్యవసాయ రంగమే. అనుకున్నట్టుగానే భారత వ్యవసాయ రంగం 0.8శాతం కుంచించింది. గత త్రైమాసికంలో దాని వృద్ధి రేటు కూడా 1.6శాతంగా మాత్రమే ఉన్నది. గత ఏడాది ఇదే కాలంలో దీని వృద్ధిరేటు 5.2 శాతాన్ని నమోదు చేసింది. ఈ ఏడాది మాత్రం వర్షాభావం, ఎల్-నినో ప్రభావం వ్యవసాయాన్ని దెబ్బతీశాయి. అయితే, ఎల్‌నినో ప్రభావం తగ్గుతోందని, సాధారణ రుతుపవనాల ఉంటాయని వాతావరణ శాఖ అంచనాలు ఉన్నందున సరైన రబీ పంటలతో పాటుగా, మెరుగైన ఖరీఫ్ నాట్లు ఉంటాయని భావిస్తున్నట్టు ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ చెప్పడం ఆశాజనకంగా అనిపించక మానదు.

**అస్థిర ప్రపంచంలో దృగ్గోచరమవుతున్న వృద్ధి!**

ఒకవైపు ఐరోపా దేశాలు సహా, పాశ్చాత్య దేశాలన్నీ కూడా ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో భారత్ త్రైపాక్షికంలోనైనా సరే అంత వృద్ధి రేటును ప్రదర్శించడం వారందరికీ అసూయ కలిగించే విషయమే. ఈ వృద్ధి గణాంకాలు చూసిన కొందరు ఆర్థికవేత్తలు భారత ఆర్థిక వ్యవస్థ బలమైన ఒరవడిలో ఉన్న విషయాన్ని ఈ అంకెలు ప్రతిఫలిస్తున్నాయంటున్నారు. ముఖ్యంగా ప్రపంచ ఆర్థిక పరిదృశ్యం అత్యంత అస్థిరంగా ఉన్న నేపథ్యంలో ఈ వృద్ధి చోటు చేసుకోవడానికి కారణం పెట్టుబడులు 12.2 శాతం పెరగడమేనని వారంటు న్నారు. అంటే, భారత్ భవిష్యత్తు పై విశ్వాసం పెరిగి, పెట్టుబడులు పెట్టేందుకు వాణిజ్యవేత్తలు ముందుకు వస్తున్నారన్న మాట.

కాగా, మూలధన వ్యయాన్ని పునరుద్ధరిం చడంలో ప్రస్తుత జీడీపీ గణాంకాలు తోడ్పడతాయని, ఇది దీర్ఘకాలిక వృద్ధికి తోడ్పడుతుందని వారంటు న్నారు. వ్యవసాయం మినహా అన్ని రంగాలూ ఆర్థికంగా వృద్ధిని సాధిస్తున్నాయి.

**మోదీకి ముందు- తర్వాత**

నాటి ప్రభుత్వాలు అనుసరించిన సోషలిస్టు విధానాల కారణంగా, భారతదేశం ఎదుగూ బొదుగూలేకుండా జిడిపి వృద్ధి 4శాతాన్ని మించక పోవడంతో, ఇదే హిందూ వృద్ధిరేటు అంటూ మన ఆర్థికాభివృద్ధిని పాశ్చాత్య దేశాలు తక్కువచేసి చూసిన కాలముంది. కానీ, ప్రధానిగా నరేంద్ర మోదీ అధికారాన్ని చేపట్టిన తర్వాత తాను చేపట్టిన విధానాలతో అది అవాస్తవమనే విషయాన్ని రుజువు చేశారు. నిజానికి, 1990ల్లో చేపట్టిన సరళీకృత ఆర్థిక విధానాలతో ఆర్థిక రంగంలో కొంత మెరుగుదల వచ్చినా, యూపీఏ కాలంలో జరిగిన అవినీతి, స్కాంలు ఆ వృద్ధి ఫలాలు సాధారణ ప్రజలకు అందుబాటులోకి రాకుండా అడ్డుపడ్డ విషయం ప్రపంచానికి విదితమే. అయితే, 2014 తర్వాత పెద్ద నోట్ల రద్దు దగ్గర నుంచి ఇడి వంటి సంస్థలకు మరిన్ని అధికారాలిచ్చి అవినీతికి అడ్డుపడడంతో, దేశంలో నేడు ఒక విశ్వాసం వ్యక్తమవుతున్నది. ప్రత్యక్షంగా లబ్ధిదారుల ఖాతాలలోకి నగదును బదిలీ చేయడంతో అక్కడ అవినీతికి ఆస్కారం లేకుండా పోయింది. ఒక్క రూపాయి లబ్ధిదారుకు కేటాయిస్తే, అందులో 15 పైసలు మాత్రమే వారికి చేరుతా యంటూ నాడు రాజీవ్‌గాంధీ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ప్రస్తుత విధానాన్ని చూసినప్పుడు నూటికి నూరు శాతం లబ్ధిదారులకు చేరడం కనిపిస్తుంది. అదే వారి కొనుగోలు శక్తిని పెంచి, మార్కెట్లో విత్తం లభ్య మయ్యేలా చేస్తోంది. ఇదే కొవిడ్ అనంతర పరిస్థితుల్లో కూడా భారతదేశ ఆర్థిక వ్యవస్థ కుంగి పోకుండా తోడ్పడింది. 2022-23వ సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ 7.2శాతం పెరగ్గా, ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు అంచనాలను మించనున్నట్టు కనిపిస్తోంది.

**మూడవ స్థానాన్ని సాధించే పథంలో భారత్**

ఐఎంఎఫ్‌తో పాటు దేశీయ అంచనాలు కూడా

భారత్ అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థ కావాలన్న లక్ష్యాన్ని సాధించే మార్గంలో ఉందని చెప్పడంలో అవాస్తవికత లేదు. మన వాస్తవ పెట్టుబడి రేటు దాదాపు 33శాతం ఉండగా, కరెంట్ అకౌంట్ లోటు తగ్గడమే కాదు, దేశంలోని యువజనాభా కూడా ఇందులో పాత్ర పోషిస్తోందని వారు పేర్కొంటున్నారు. నిజమే, ప్రపంచవ్యాప్తంగా నేడు జనాభా రేట్లు తగ్గిపోయిన, తగ్గిపోతున్న నేపథ్యంలో అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం భారతదేశమే. చైనాలో కూడా వృద్ధుల సంఖ్య పెరిగిపోతున్న క్రమంలో ఆ దేశ ఉత్పాదక శక్తి కూడా తగ్గే అవకాశం ఉంది. ప్రపంచ మంతా రష్యా-ఉక్రెయిన్ కారణంగా ఆర్థిక మాంద్యం లోకి, తిరోగమనంలోకి వెడుతున్న నేపథ్యంలో భారత్ దౌత్యపరమైన కృషి కారణంగా ఆ జారుడుబండ నుంచి జారవలసిన అవసరం రాలేదు. రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయడం ద్వారా, ఇక్కడ ఉత్పత్తి రంగం సహా పలు రంగాలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చేసింది. ఈ సమయంలో రష్యాపై అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షల కారణంగా ఇంధన సరఫరాలు లేక రష్యాకు బదులుగా జర్మనీ సహా పలు ఐరోపా దేశాలు ఆర్థిక మాంద్యాన్ని, తిరోగమనాన్ని చవి చూస్తున్న విషయం మనకు తెలిసిందే. తాజాగా, యునైటెడ్ కింగ్డమ్, జపాన్‌లు ఆర్థిక మాంద్యంలోకి జారుకున్నట్టు బహిరంగంగా ప్రకటించాయి.

జీడీపీ వృద్ధి మాత్రమే కాకుండా, మొత్తం ఆర్థిక రుణభారం సహా పలు కొలమానాలలో అనేక దేశాలకన్నా మెరుగైన పనితీరును భారత్ ఆర్థిక వ్యవస్థ కనబరుస్తోంది. ప్రస్తుతం జీడీపీలో కేవలం 170 శాతం రుణభార నిష్పత్తిని మాత్రమే మనం మోస్తున్నాం. ఇక, జపాన్ 400 శాతం అతిపెద్ద రుణభార నిష్పత్తిని కలిగి ఉండగా, చైనా దాదాపు 300 శాతాన్ని, జర్మనీ 190 శాతాన్ని కలిగి ఉంది. అంత పెద్ద పెద్ద గణాంకాలతో పోల్చినప్పుడు మనం ఎంతో మెరుగ్గా ఉన్నామనే విషయం విదితమవుతుంది.

ప్రస్తుతం ప్రపంచ ఆర్థికవ్యవస్థ మంద గించడంతో బహిర్గత డిమాండ్ పడిపోవడమే కాదు, అంతర్గత వినిమయం కూడా పూర్తిగా కోలుకో లేదన్నది వాస్తవం. మనం 7 నుంచి 8 శాతం వృద్ధిని సాధించేందుకు ఇవే ప్రస్తుతం ఆటంకాలుగా కనిపించాయి. కానీ, మన అంతర్గత వ్యవస్థల పని తీరు కారణంగా అందరి అంచనాలను మించి వృద్ధిని సాధించింది. అయితే, ఇదే వృద్ధి రేటు తదుపరి త్రైమాసికంలో కొనసాగకపోయినప్పటికి కూడా మనం 2027నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగే అవకాశాలున్నా యంటూ జీడీపీ డేటా ఆధారంగా ఎస్‌బిఐ ఎకోరాప్ నివేదిక పేర్కొనడం ఒక శుభ సంకేతమే. ఐఎంఎఫ్ జులై 2023లో ఇచ్చిన సమాచారం ప్రకారం జర్మనీ




ఆర్థిక వ్యవస్థ 2023లో 0.3 శాతం సంకోచించి, 2024లో 1.3 శాతం వృద్ధిని, జపాన్ ఆర్థిక వ్యవస్థ 2023లో 1.4 శాతం వృద్ధిని, 2024లో 1శాతం వృద్ధి సాధిస్తుందని అంచనా వేశారు. కాగా భారతదేశం 2023 ఆర్థిక సంవత్సరంలో 6.1శాతం వృద్ధిని, 2024లో 6.3శాతం వృద్ధిని సాధిస్తుందనే అంచనా. ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. కానీ భారతదేశం తన సనాతన విజ్ఞతను ఉపయోగించి పరుగులు తీస్తోంది.

ప్రాచీన నాగరికత కలిగిన భారత్‌లో సుసంపన్న మైన ఆరోగ్య, సంక్షేమ, ఔషధీయ సంస్కృతి ఉంది. ప్రపంచంలో తొలి సంప్రదాయ ఔషధీయ కేంద్రాన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ స్థాపించడమన్నది సంప్రదాయ వైద్యం, ఔషధాల క్షేత్రంలో ఉన్న సంభావ్యతకు, తోడ్పాటుకు ఇచ్చిన గుర్తింపుగా చూడాలి. నేడు యోగాను, ఆయుర్వేదాన్ని కేవలం భౌతిక ఆరోగ్యమే కాక, ఒత్తిడిని తగ్గించి, మనసు, శరీరానికి మధ్య సమతుల్యతను సాధించి డయాబెటిస్, ఊబకాయం, డిప్రెషన్ వంటి వ్యాధులను తగ్గిస్తాయనే విషయాన్ని ప్రపంచ వ్యాప్తంగా గుర్తించి అందిపుచ్చుకుంటున్నారు. అందుకే ఆయుష్ కింద ఉండే దేశీయ చికిత్సా విధానాల కోసం భారత్ రావాలనుకున్న విదేశీయు లకు భారతదేశం ఆయుష్ వీసాలను అందిస్తోంది. వారు సంప్రదాయ వైద్య చికిత్సల కోసం ఇందుకు దరఖాస్తు చేసుకొని భారత్‌కు రావచ్చు. దీనివల్ల దేశంలో సంప్రదాయ వైద్యవిధానాలకు డిమాండ్ పెరగడమే కాదు, అవి ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తాయి.

**కొవిడ్ స్పందన, విధాన రూపకల్పన**

ప్రపంచాన్ని పీడించిన మహమ్మారి, తాము ఎంతో పురోగతిని సాధించామన్న అహంకారంతో



ఉన్న మానవులకు, దేశాలకూ ముందెన్నడూ ఎదుర్కోని అనేక సవాళ్లను విసిరింది. ఈ సమయంలో భారత్ తన సనాతన వివేకాన్ని, ముందు చూపును ఉపయోగించి స్వతంత్ర విధాన రూపకల్పనను ప్రదర్శించింది. ఒక్క సారిగా ఆర్థిక కార్యకలాపాలన్నీ నిలిచిపోవడంతో పడిపోతున్న డిమాండ్‌ను నిర్వహించడంపై పలు దేశాలు దృష్టి పెట్టాయి. కానీ భారత్ మాత్రం సరఫరాలో ఉండే ఆటంకాలపై, నిలకడలేని ఆర్థిక ఒత్తిళ్లను నివారించ డంపై, ద్రవ్యోల్బణ పెరుగుదలపై దృష్టిపెట్టింది. ఒకరకంగా, ఇతర దేశాలలో చోటు చేసుకుంటున్న పరిణామాల ఆధారంగా తన విధాన కల్పన చేసుకునే యత్నం చేసింది. ఇటువంటి అంశాలను నిర్వహించ గల స్థాయిలో ఆచరణీయ వైఖరిని కలిగి ఉండడమే, విపత్తు వచ్చినప్పుడు భారత్ ఎంత బలంగా ఉండగలదో పట్టి చూపుతుంది.

### సమ్మిళిత వృద్ధికి డిజిటల్ పరివర్తన

మోదీ అధికారంలోకి వచ్చిన అనంతరం సామాజిక ఆర్థిక రంగంలో నిర్మించిన డిజిటల్ పరివర్తన నమూనా అన్నది అందరినీ కలుపుకు పోతూ, అందరికీ మంచి జీవితాన్ని ఇచ్చే దిశగా పయనాన్ని ప్రారంభించింది. మొబైల్ ఫోన్ల సంఖ్య పెరగడం, ఇంటర్నెట్ వ్యాపించడం, మిలియన్ల బ్యాంకు ఖాతాలు తెరవడం, ఆధార్ రూపంలో ప్రత్యేక డిజిటల్ గుర్తింపు, యూపీఐ రూపంలో డిజిటల్ చెల్లింపుల నమూనా అన్నవి డిజిటల్ ఇండియాకు పునాదులు అయ్యాయి. స్థానిక, అంతర్జాతీయ సమాజ సమస్యలను పరిష్కరించేందుకు వీటి ఆధారంగానే నూతన తరం సాంకేతికతలను రూపొందిస్తున్నారు. ఒకరకంగా, నగదు రహిత లావాదేవీలు నిర్వహణకు సౌలభ్యాన్ని కల్పించారు.

### పౌర కేంద్రిత డిజిటల్ విధానం

భారతదేశపు డిజిటల్ పరివర్తనలో పౌర కేంద్రిత విధానం ఒక కీలకాంశం. కేవలం సేవల బట్వాడానే కాకుండా ఒకప్పటి నగదు ఆధారిత, సాంకేతికతను అడ్డుకునే సంస్కృతిని అధిగమించి డిజిటల్ సంస్కృతిని ప్రజలకు అలవాటు చేసేందుకు ప్రభుత్వం సమర్ధవంతంగా చేసిన ప్రయత్నాల వల్ల ఇది సాధ్యమైంది. ముఖ్యంగా, తక్కువ ఖర్చుతో, తేలికగా లెక్కించగలిగే అవకాశం ఉన్నది కావడంతో దీనిని





డిజిటల్ విభజనను అనుభవిస్తూ, వనరుల సమస్యలను ఎదుర్కొంటున్న ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలలో సమర్ధవంతంగా నకలు చేయవచ్చు.

### మహిళల నాయకత్వంలో అభివృద్ధి చొరవలు

మహిళ నేతృత్వంలో అభివృద్ధి ద్వారా భారత్ నూతన గతిలో ప్రయాణాన్ని ప్రారంభించింది. విద్య, ఆర్థికంగా కలుపుకుపోవడం, వ్యవస్థాపకత, నైపుణ్యాల అభివృద్ధి, గృహాలు తదితర విస్తృత అంశాలలో మహిళలపై దృష్టిపెట్టి ప్రభుత్వం అనేక విధానాలను రూపొందించింది. ప్రభుత్వం నిర్వహి స్తున్న వికసిత్ భారత సంకల్ప యాత్ర సందర్భంగా ప్రధాని సంభాషణలు కూడా మహిళల పాత్రపైనే దృష్టి పెట్టాయి

### పర్యావరణ చర్య, సుస్థిరత

అనేక అభివృద్ధి సవాళ్లు ఉన్నప్పటికీ, ముఖ్యంగా పర్యావరణ మార్పుపై పోరాటానికి భారత్ ప్రతిష్ఠాత్మక సుస్థిర లక్ష్యాలను పెట్టుకుంది. కాప్(COP)26లో ప్రారంభించిన లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (LiFE – పర్యావరణం కోసం జీవనశైలి) సుస్థిరమైన జీవనానికి ప్రాధాన్యతనిస్తుంది. దీనిని భారత ఇంధన పరివర్తన వ్యూహంతో ఏకీకృతం చేశారు. తక్కువ ఖర్చుతో పర్యావరణ మార్పును సంపూర్ణంగా పరిష్కరించేందుకు ఈ వ్యూహం విలువైన స్ఫూర్తులను ఇస్తుంది. ఈ నేపథ్యంలోనే సౌర ఇంధనం సహా పలు పర్యావరణ అనుకూల ఇంధనాలైన హైడ్రోజెన్ వంటి పునరావృత ఇంధనాలకు ప్రోత్సాహాన్ని మనం చూడాలి. పునరావృత ఇంధన శాఖ ఈ లక్ష్యాలను సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నది.

అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ (ఐఇఎ) ప్రకారం, ప్రపంచ, జి20 నగటుకన్నా 10శాతం ఇంధన సామర్థ్యాన్ని భారత ఆర్థిక వ్యవస్థ కలిగి ఉంది. వాతావరణ ఉపశమనం, స్థితి స్థాపకతకు ప్రపంచ సహకారం కోసం భారత్ చేస్తున్న కృషి, దాని నాయకత్వానికి ఉదాహరణగా నిలువడమే కాదు, పర్యావరణ సవాళ్లను పరిష్కరించేందుకు ఐక్యం కమ్మని ప్రపంచానికి ఆహ్వానం పలికినట్టుగా కనిపిస్తుంది.

### ప్రపంచ శ్రేయస్సు కోసం విజ్ఞాన భాగస్వామ్యం

భారత్ వృద్ధి కథనం బహుముఖీయమైనది, అది అనుభవాలు, ఉత్తమ ఆచరణలు, సాంస్కృతిక విజ్ఞానపు ప్రపంచ యవనిక. భారతదేశం పరిణామం చెందుతూనే, ప్రపంచానికి దోహదం చేస్తున్నప్పుడు ఇతర దేశాలు దానిని నుంచి నేర్చుకోవడానికి, అందిపుచ్చుకోవడానికి, సహకరించడానికి అత్యంత సంభావ్యత ఉన్నది. భారత వృద్ధి అన్నది ఒక నిరంతర కథనం.

అడుగడుగునా మన పురోగమన పథానికి సంకేతాలు మనకు కనిపిస్తున్నాయి. నిన్న మొన్న గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో నిర్మించి డైమండ్ బోర్స్ అమెరికాలోని పెంటాగన్ కన్నా అతిపెద్ద కట్టడమంటే దేనికి సంకేతం? ఎలాన్ మస్క్ నుంచి బ్లాక్ రాక్ సంస్థ వరకూ భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నా యంటే, వారికి భారత్ వృద్ధి గమనంపై ఉన్న విశ్వాసమే కారణం కాదా? నిన్నటికి నిన్న ప్రపంచ ధనికులలో ఒకరైన ముఖేష్ అంబానీ రెండవ కుమారుడు అమిత్ అంబానీ వివాహానికి ఫేస్‌బుక్ అధినేత జుకర్‌బర్గ్ దగ్గర నుంచి బ్లాక్‌రాక్ సంస్థ అధినేతలు, ప్రతినిధుల వరకు హాజరుకావడం కేవలం ఆ వివాహం ఎలా జరుగుతుందో చూడటానికే అనుకోవడం మన అమాయకత్వమే అవుతుంది. ప్రస్తుతం ఆర్థిక వృద్ధితో దూసుకుపోతున్న భారత్‌లో వారు పచ్చదనాన్ని చూసి ఇక్కడ పెట్టుబడి అవకాశాలను వెతుక్కుంటూ వచ్చారు. ముఖేష్ అంబానీ శ్రీమతి నీతా అంబానీ డిస్నీల్యాండ్‌తో కలిసి ఒక మీడియా వెంచర్‌ను ప్రారంభిస్తున్నట్టు కుమారుడి వివాహ సంబరాలకు ముందే వార్త రావడం కూడా సంకేతమే. ★




# సాకారమైన పౌరసత్వ సవరణ చట్టం

**మాట ఇస్తే భూమ్యాకాశాలు తల్లకిందులైనా దానిని సాకారం చేయడం అన్నది సామాన్యులకు సాధ్యమయ్యే విషయం కాదు. ఎందుకంటే, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనుకున్నప్పుడు ఎన్నో కష్టనష్టాలను, అవాంతరాలను ఎదుర్కొన వలసి వస్తుంది. అంత రిస్కు ఎందుకని, రాజకీయ నాయకులు హామీలు ఇచ్చి మర్చిపోవడమన్నది వారి జన్మహక్కన్నట్టుగా వ్యవహరించడం మనందరికీ అనుభవమే. కానీ, 'మోదీ కీ గ్యారెంటీ' మాత్రం అటువంటిది కాదు. గత ఎన్నికల (2019) సమయంలో సిఎఎ (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ – పౌరసత్వ సవరణ చట్టం)ని అమలులోకి తెస్తామని ఇచ్చిన హామీని 2024 ఎన్నికలకు పూర్వమే హోం మంత్రి చేత నోటిఫికేషన్‌ను జారీ చేయించడం ద్వారా నెరవేర్చేశారు.**

హోంమంత్రి అమిత్‌షా మార్చి 11వ తేదీన దీని అమలుకు సంబంధించిన నిబంధనల నోటిఫికేషన్‌ను జారీ చేసి సునామీని సృష్టించారు. అంతే, దేశంలో పలు పార్టీల నుంచి హాహాకారాలు మొదలయ్యాయి. ఒకవైపు రాజకీయ నాయకులు, పార్టీలు, మరోవైపు దేశంలోని రెండవ అతిపెద్ద జనసంఖ్య కలిగిన వర్గం నుంచి 'ఇది ఘోరం, అన్యాయం' అంటూ పెడబొబ్బలూ మొదలయ్యాయి. కేరళ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, పినరయి విజయన్ వంటి వారు అయితే, తమ రాష్ట్రంలో సీఏఏని అమలు చేయమని ప్రకటించి తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. ఎందుకంటే, పౌరసత్వమనేది దేశానికి సంబంధించింది తప్ప, ప్రాంతీయమైనది కాదు. ఎన్ని రాష్ట్రాలు ఉన్నా మనం భారతీయ పౌరులం తప్ప తెలంగాణ పౌరులం, ఆంధ్ర పౌరులం లేదా యుపి పౌరులం కాదు, ఆ ప్రాంత వాసులం అంతే.

భారతదేశ చరిత్రలో మార్చి నెలకి ప్రత్యేక స్థానముంది. భారతదేశాన్ని విభజించేందుకు నియమించిన లార్డ్ మౌంట్ బ్యాటెన్ 24 మార్చిన వైస్రాయ్‌గా తన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన భారత్ చేరుకోకముందే, విభజన కోసం నాటి తాత్కాలిక ప్రభుత్వాన్ని రాజీనామా చేయమని మౌంట్ బాటెన్ కోరనున్నారంటూ సింగపూర్ నుంచి ప్రచురితమైన 'ఇండియన్ డైలీ మెయిల్' వంటి పత్రికలు పలు ఆంగ్ల పత్రికలు మార్చి 11, 1947న కథనాలను ప్రచురించాయి. సంవత్సరం వేరైనా అదే తారీకున సీఏఏ నిబంధనలు వెలువడడం యాధృచ్ఛికమా? లేక బీజేపీ ప్రభుత్వం కావాలని ఆ పని చేసిందా? అది మన ఊహకి అందని విషయం. ఏది ఏమైనా, 150కి పైగా క్రైస్తవ దేశాలు, 50కి పైగా ఇస్లామిక్ దేశాలు ఉన్న ఈ పృథ్వి మీద హిందువులు మాది అని చెప్పుకునేందుకు ఉన్న ఏకైక దేశం భారతదేశం. ఆ రకంగా చూస్తే, ప్రపంచంలో హిందువులు మైనార్టీలే. వారిపై జరుగుతున్న అరాచకాల నుంచి కాపాడే నైతిక బాధ్యతను ప్రధాని మోదీ నాయకత్వంలోని భారత్ స్వీకరించింది. అంతే తప్ప ఇక్కడ మైనార్టీలుగా చెప్పుకునే ముస్లింల పౌరసత్వాన్ని రద్దు చేసేందుకు కాదు. ఈ విషయాన్ని వారు అంగీకరించి తీరవలసిందే.

ముఖ్యంగా, ఒకనాడు భారత దేశంలో భాగంగా ఉండి, తర్వాత విడిపోయి, చరిత్ర కాలగతిలో అతి యువ దేశాలుగా ఉన్న పాక్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో, ఆఫ్ఘనిస్తాన్‌లో హిందువులపై జరుగుతున్న హింస సాధారణమైంది కాదు. ఒకవైపు భారత దేశంలో మైనార్టీలుగా చెప్పుకునే ఇస్లామిస్టుల సంఖ్య రెట్టింపు అవుతుంటే, ఆ దేశాల్లో మైనార్టీలైన హిందు, బౌద్ధ, పార్సీల సంఖ్య అత్యల్పం అయినట్టు వారు అప్పుడప్పుడు విడుదల చేసే గణాంకాలు చెప్తున్నాయి. హిందువులపై దాడులు చేయడం, వారి ఆడపిల్లలను పిన్నవయస్సులో బలవంతంగా ఎత్తుకువెళ్లి ముల్లాలు, మౌల్వీలు వివాహం చేసుకొని వారి మతం మార్చేయడం, వారి డిమాండ్లను తిరస్కరించిన మైనార్టీలపై 'దైవనింద' అన్న నేరాన్ని మోపి అక్కడి మతోన్మాద మూకలు వారిని హతం చేయడం, అందుకు అక్కడి న్యాయవ్యవస్థలు మద్దతునివ్వడం, అన్నీ ప్రపంచం కళ్లముందు జరుగుతున్నవే. భారత్‌లో ఇస్లామిస్టులకు చీమకుట్టినా వారికేదో అన్యాయం జరిగిపోయిందంటూ ఉద్యమాలు చేసే మానవ హక్కుల కార్యకర్తలు కానీ, వామపక్ష వాదులు కానీ వారి విషయానికి వచ్చేసరికి మూగనోము పట్టేస్తుంటారు. ఈ క్రమంలోనే భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలులోకి తెచ్చి, అమలు చేస్తానని హామీ ఇచ్చింది, దానిని నిలబెట్టుకుంది.

**ఇంతకీ అసలు సీఏఏ ఏమిటి?**

భారతదేశాన్ని విభజించినప్పుడు పాకిస్తాన్‌లో, ఆఫ్ఘానిస్తాన్ తర్వాత ఏర్పడిన బాంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉండిపోయిన, ప్రధానంగా ముస్లిమేతరులు అయిన హిందూ, బౌద్ధ, సిక్కు, పార్సీ, క్రైస్తవులు తొమ్మిది రాష్ట్రాలు అయిన గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, పంజాబ్, మధ్య ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్రలలో నమోదు లేదా నాచురలైజేషన్ (ఇక్కడ ఎక్కువకాలం నివసించడం లేదా జన్మించడం) ద్వారా భారతదేశ పౌరసత్వాన్ని పొందేందుకు 1955 పౌరసత్వ చట్టం ఆమోదిస్తుంది. కాగా, 2019లో పార్లమెంటు ఆమోదించిన ఈ సవరణ చట్టం ప్రకారం డిసెంబర్ 31, 2014 కంటే ముందు పొరుగు దేశాలలో హింసను భరించలేక భారతదేశానికి వలస వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవ మైనార్టీలకు భారత్ పౌరసత్వాన్ని ఇస్తుంది. అర్హులైన వ్యక్తులకు పౌరసత్వం మంజూరు చేసే ప్రక్రియలో పాటించవలసిన నియమాలను నిర్దేశిస్తూ మార్చి 11, 2024న జారీ చేసిన ఈ నోటిఫికేషన్ ఒక కీలకమైన మైలురాయి అని చెప్పవచ్చు.

**ఈశాన్యం, గిరిజన ప్రాంతాల మినహాయింపు**

హెూం మంత్రి అమిత్ షా సీఏఏ నోటిఫికేషన్ జారీ చేసిన మరురోజే, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మిజోరాం, మణిపూర్ సహా



మోదీ, అమిత్ షా

స్వయంప్రతిపత్తి కలిగిన అస్సాం, త్రిపుర, మేఘాలయ మండళ్ల వంటి ఇన్నర్‌లైన్ పర్మిట్ (రక్షిత ప్రాంతాలలో పర్యటించేందుకు భారత పౌరులకు ప్రభుత్వం జారీ చేసే అధికారిక పత్రాలు) అవసర మయ్యే రాష్ట్రాలలో సీఏఏ అమలును మినహాయిస్తు న్నట్టు ప్రకటించారు. స్థానిక తెగల హక్కులను పరిరక్షిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఆయన నిలబెట్టుకున్నారు.

రాజ్యాంగం ఆరవ షెడ్యూల్, దాని అంశాలలో పొందుపరిచిన, ప్రత్యేకంగా ఇన్నర్‌లైన్ పర్మిట్ వంటి వాటి ద్వారా స్థానిక తెగల హక్కుల పరిరక్షణ కింద ఈ మినహాయింపు లభిస్తుంది. ఈ వ్యూహాత్మక చర్య ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక జనాభాను కాపాడటమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య జాతీయ విధానం, ప్రాంతీయ గుర్తింపు మధ్య సమతుల్యతను సాధిస్తుంది.

**గతంలో ఏం జరిగింది**

డిసెంబర్ 2019లో సీఏఏని పార్లమెంటు ఆమోదించిన అనంతరం రాష్ట్రపతి దానిపై ఆమోద ముద్ర వేసిన తర్వాత దేశంలోని వివిధ ప్రాంతాలలో భారీగా హింసాత్మక నిరసనలు చెలరేగిన విషయం మనందరికీ తెలిసిందే. ముఖ్యంగా ఢిల్లీలోని షాహీన్‌బాగ్ ప్రాంతంలో 69 రోజులపాటు ముస్లిం మైనార్టీల పౌరసత్వానికి భంగం కలుగుతుందంటూ మతోన్మాద శక్తుల ప్రేరణతో 'ఆందోళన జీవులు' ఢిల్లీని దిగ్బంధనం చేశాయి. వీరికి జార్జ్ సోరోస్ వంటి భారత విరోధుల నుంచి నిధులు అందాయనే ఆరోపణలు ఉన్నాయి. ఏ అండా లేకుండా సాధారణ జనం మూడు నెలల కాలానికిపైన నిరసన ప్రదర్శనలలో కూర్చోవడం అన్నది సాధ్యం కానిపని. ప్రభుత్వం ఆమోదించిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్ (ఎన్ఆర్‌సి), నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పిఆర్) మూడూ కూడా ముస్లిం వ్యతిరేకమంటూ వారు షాహీన్‌బాగ్ ప్రాంతంలో తమ అడ్డాను ప్రారంభించి, ఢిల్లీ ప్రజలకు చుక్కలు చూపించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలలో సుమారు 100మందికి పైగా వ్యక్తులు మరణించారు.

ఈ చట్టాన్ని అనుమతిస్తే ముస్లింల పౌరసత్వం రద్దవుతుందనే ప్రచారం భారీ స్థాయిలో ఆ సందర్భంగా చేశారు. అందుకు కారణం లేకపోలేదు, సరైన పత్రాలు లేకుండా దేశంలోకి అక్రమంగా చొరబడిన రొహింగ్యాల వంటివారిని వారి దేశాలకు తిప్పి పంపాలన్న ప్రభుత్వ ఆలోచన మన మైనార్టీలకు వెన్నులో వణుకు పుట్టించిందన్న మాట. అందుకే, అక్రమం, సక్రమంతో పని లేకుండా ముస్లింలందరూ బాధితులవుతారనే ప్రచారానికి దేశ వ్యతిరేక శక్తులు పూనుకున్నాయి.

**ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్, సిఎఎలు అంటే ఏమిటి?**

భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన తర్వాత 1951లో తొలిసారి చేపట్టిన జనగణన సందర్భంగా ప్రతి గ్రామంలోని ఆవాసాలను ఒక క్రమపద్ధతిలో చూపుతూ, వాటి పక్కన అందులో నివసించే వారి పేర్లు, సభ్యుల సంఖ్య వేసి తయారు చేసిన పౌరుల జాతీయ రిజిస్టర్ ఎన్ఆర్‌సి. దీనిని కేవలం 1951లో మాత్రమే ప్రచురించారు. కాగా, తర్వాత ఎన్ఆర్‌సి అన్నది ఒక్క అస్సాం రాష్ట్రంలో మాత్రమే అమలవు తున్నది. బంగ్లాదేశ్‌కు సరిహద్దు రాష్ట్రమైన అస్సాంలో నివసిస్తున్న అక్రమ చొరబాటుదారులను గుర్తించి, వారిని వారి దేశానికి తిప్పి పంపేందుకు రూపొం దించి, అమలు చేసిన జాబితా ఇది. కాగా, తర్వాత దీనిని దేశవ్యాప్తంగా అమలు చేయాలన్న వాదనలు వినిపించాయి.

అయితే, 2021 జనాభా లెక్కల తొలి దశలో జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పిఆర్)ను పౌరసత్వ చట్టం, 1955 కింద తాజాపరచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్‌పిఆర్‌ను నమోదు చేసేటప్పుడు ప్రతి కుటుంబం, వ్యక్తి, నివసిస్తున్న ప్రాంతం సహా వివరాలను సేకరించి, ఎన్‌పిఆర్‌ను తాజాపరచాలని భావించారు. కాగా, కొవిడ్-19 మహమ్మారి కారణంగా ఎన్‌పిఆర్‌ను తాజా పరచడం, తత్సంబంధిత క్షేత్ర కార్యకలాపాలను వాయిదా వేయడం జరిగింది. ఈ ప్రక్రియే పలు రాష్ట్రాలలో అక్రమంగా చొరబడిన రొహింగ్యాలు, ఇతర ముస్లిం జనాభాకు గొంతులో పచ్చి వెలక్కాయ అయింది. అందుకే, దీనికి వ్యతిరేకంగా నిరసనలు ప్రారంభ మయ్యాయి. నిన్న మొన్న మణిపూర్‌లో జరిగిన అల్లర్లు, ప్రస్తుతం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అక్రమ చొరబాటుదార్లను తిరిగి బర్మా పంపిస్తున్న తీరు, సరిహద్దులలో కంచెలు వేయడాలు వంటివన్నీ కూడా అది చొరబాటుదారుల అడ్డా అయిందనే విషయాన్ని పట్టి చూపుతున్నాయి.


**దరఖాస్తుకు ఆన్‌లైన్ పోర్టల్ సిద్ధం**

సీఏఏ చట్టాన్ని హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను జారీ చేయడం ద్వారా అమలులోకి తీసుకువచ్చినప్పుడు, అర్హులైన వ్యక్తులు భారతీయ పౌరసత్వం పొందేందుకు ఇది వీలు కల్పిస్తుందని, హోం శాఖ అధికారులు పేర్కొన్నారు. "నిబంధనలు సిద్ధం చేశాం, మొత్తం ప్రక్రియ కోసం ఇప్పటికే ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేశాం, దీనిని డిజిటల్‌గా నిర్వహిస్తాం. దరఖాస్తు దారులు ఎటువంటి ధృవీకరణ పత్రాలు లేకుండా భారతదేశంలోకి ప్రవేశించిన సంవత్సరాన్ని వెల్లడిస్తే చాలు. దరఖాస్తుదారుల నుంచి ఎటువంటి అదనపు డాక్యుమెంటేషన్ అవసరం లేదు," అంటూ వారు వివరించారు.

గత డిసెంబర్ 27వ తేదీనే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సీఏఏను నిలుపుదల చేయలేమని, ఇది దేశన్యాయమని స్పష్టం చేశారు. ఈ విషయంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దేశప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు కూడా ఆయన చేశారు. కాగా, గత రెండేళ్లలో పౌరసత్వ చట్టం 1955 కింద, ఆఫ్ఘనిస్తాన్, బాంగ్లాదేశ్, పాకిస్తాన్ నుంచి వచ్చే ముస్లిమేతరులకు తొమ్మిది రాష్ట్రాలలో భారత పౌరసత్వాన్ని ఇచ్చేందుకు 30మంది జిల్లా మేజిస్ట్రేట్‌లు, హోం కార్యదర్శులకు అధికారం ఇచ్చారు. అయితే, రాజకీయంగా సున్నిత ప్రాంతాలైన అస్సాం, పశ్చిమ బెంగాల్ జిల్లాలోని అధికారులకు పౌరసత్వాన్ని మంజూరు చేసే అధికారం ఇవ్వకపోవడం గమనార్హం.

సార్వత్రిక ఎన్నికలు జరుగబోయే ముందు నోటిఫికేషన్‌ను జారీ చేయడం ద్వారా అక్రమ చొరబాటుదారులు ఒకప్పటిలా బయటకు వచ్చి నిర్భయంగా ఓటు వేసే పరిస్థితి రానివ్వకుండా ఉండేందుకు చేసిన ప్రయత్నంలా కనిపిస్తోంది. ఏది ఏమైనప్పటికీ, సరిహద్దు రాష్ట్రాల ఓటింగ్ తీరును బట్టి దీని ప్రభావం ఎంత ఉందో చెప్పవచ్చు. ★

జాగృతి డెస్క్



# 'ప్రజా న్యాయమూర్తి' నిర్ణయం

**ఆయనను కొద్దికాలం క్రితం వరకు 'ప్రజాన్యాయమూర్తి' అని గౌరవంగా పిలిచేవారు. ఆయనే కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ. ఇప్పుడు హఠాత్తుగా గంగోపాధ్యాయ తన పదవికి రాజీనామా చేసి క్రియాశీలక రాజకీయాలలోకి వచ్చారు. తన రాజీనామాను ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు, కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టీఎస్ శివజ్ఞానంకు కూడా పంపించారు. ఈ సంవత్సరం ఆగస్ట్‌లోనే పదవీ విరమణ చేయనున్న ఈ న్యాయమూర్తి ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక పశ్చిమ బెంగాల్ ప్రస్తుత రాజకీయ పరిస్థితులే కారణం. తృణమూల్ కాంగ్రెస్ అరాచకం మొత్తంగా అన్ని వ్యవస్థలను నాశనం చేసినట్టే న్యాయ వ్యవస్థను కూడా దిగజార్చడం కూడా గంగోపాధ్యాయ తీవ్ర నిర్ణయానికి వెనుక ఉన్న మరొక బలమైన కారణం. తృణమూల్ కాంగ్రెస్‌తో తలపడినట్టే సుప్రీంకోర్టుతో గంగోపాధ్యాయ సంఘర్షించ వలసిన పరిస్థితులు రావడం కూడా ఒక కారణం. ఇలాంటి ఘర్షణ చరిత్రలో మొదటిసారి కావచ్చు.**

మార్చి 5న గంగోపాధ్యాయ న్యాయమూర్తి పదవికి రాజీనామా చేశారు. తరువాత విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తన అభిప్రాయాలను ఎలాంటి శషభిషలు లేకుండానే వెల్లడించారు. తృణమూల్ కాంగ్రెస్‌తో తలపడగల సత్తా ఉన్న ఒకే ఒక్క జాతీయ పార్టీ బీజేపీయేనని ఆయన అన్నారు. తనను బీజేపీ, తానూ బీజేపీని సంప్రతించుకుంటూనే ఉన్నామని కూడా ఆయన చెప్పారు.

తాను గడచిన రెండేళ్లుగా రాష్ట్ర విద్యాశాఖలో జరిగిన అవకతవకల కేసులను చూస్తున్నానని, అక్కడ అంతులేని అవినీతి జరిగిందని ఆయన వెల్లడించారు. అవి బయటపడినందువల్ల ప్రభుత్వంలోని పెద్ద పెద్ద వ్యక్తులు విచారణలో ఉన్నారు, లేదంటే జైలులో ఉన్నారని ఆయన చెప్పారు. ఇప్పుడు కార్మికశాఖలో జరిగిన అవకతవకలు తన విచారణ పరిధిలోకి వచ్చాయని అక్కడ జరిగిన అవకతవకలు కూడా తక్కువ కాదని ఆయన చెప్పారు. ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ వంటి విషయాలలో ఎన్నో అక్రమాలు జరిగాయని తేలింది. మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వ్యవహార సరళిని ఆయన ఏనాడూ సహించలేదు. ఆ ప్రభుత్వం సీబీఐ నీ, కేంద్ర దర్యాప్తు సంస్థలనీ అసలు రాష్ట్రంలోకే అనుమతించబోనని ప్రకటిస్తే, జస్టిస్ గంగోపాధ్యాయ వాటితోనే దర్యాప్తు జరిపించాలని ఆదేశాలు ఇచ్చేవారు. ఆ పార్టీ నాయకుల అరాచకత్వం, ఫలితంగా రాష్ట్రంలో ఏర్పడిన అవాంఛనీయ వాతావరణం గురించి గంగోపాధ్యాయ గతంలోను చాలాసార్లు విమర్శలు కురిపించారు. 'తృణమూల్ కాంగ్రెస్ ఏలుబడిలో బెంగాల్ దొంగలరాజ్యంగా మారిపోయిందని నేను గతంలో అన్నాను. కాబట్టి ఆ పార్టీలో ఎప్పటికీ చేరను. తాను మత విశ్వాసాలు కలవాడిని కాబట్టి సీపీఎంలో చేరలేను' అని కూడా వెల్లడించారు. జైరామ్ రమేశ్ వంటి సామర్థ్యం ఉన్న నేతలను కూడా పక్కన పెట్టి వంశ పారంపర్య పాలన విధానం అనుసరించే కాంగ్రెస్ అంటే తనకు సరిపడదని కూడా తేల్చారు. ప్రధాని నరేంద్ర మోదీ మంచి వ్యక్తి అని, గొప్పగా కష్టించే తత్త్వం కల మనిషి అని, దేశానికి చేతనైనంత మేలు చేద్దామన్న ఆశయం ఉన్నవారని వ్యాఖ్యానించారు గంగోపాధ్యాయ. నిజానికి మార్చి నెల ఆరంభంలోనే ఆయన న్యాయమూర్తి పదవి నుంచి వైదొలగుతున్న సంగతిని, ప్రధాన స్రవంతి రాజకీయాలలోకి వస్తానని ఒక బెంగాలీ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు.

2022 నుంచి జస్టిస్ గంగోపాధ్యాయ తన తీర్పులతో వార్తలలోని వ్యక్తిగానే ఉన్నారు. ఆ క్రమంలోనే 'ప్రజా న్యాయమూర్తి' అని ప్రజలు

నీరాజనాలను అందుకున్నారు. అవన్నీ అధికార తృణమూల్ మంత్రులు, మంత్రిత్వ శాఖల అవినీతి వ్యవహారాల మీద వెలువరించిన తీర్పులే. బెంగాల్ పాఠశాలల నియామకాల అవినీతిపై ఆయన ఇచ్చిన తీర్పు మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని కల్లోల పరిచింది. అసలు టీఎంసీ అవినీతి వ్యవహారాలతో న్యాయ వ్యవస్థ పరిధిలో పోరాడుతున్న ఏకైక యోధుడన్న ఖ్యాతి కూడా వచ్చింది. దీనితో వెంటనే ఆయన మీద టీఎంసీ ద్వేషిగానూ, బీజేపీ అనుకూలునిగానూ ముద్ర పడిపోయింది. పదవికి రాజీనామా చేయడానికి వారం ముందు నుంచి ఆయన సెలవులో ఉన్నారు. తాను బీజేపీలో చేరతానని ఆయన చెప్పడంతోనే గంగోపాధ్యాయ మీద బురద చల్లే వ్యవహారం మొదలయింది. కలకత్తా లా జర్నల్ సంయుక్త సంపాదకుడు, కలకత్తా హైకోర్టు న్యాయవాది ఇంతియాజ్ అఖ్తర్ వెంటనే విషం చిమ్మారు. ‘బీజేపీ తానూ పరస్పరం సంప్రతింపులలో ఉన్నామని ఆయన చెప్పడమంటేనే ఇద్దరి మధ్య ఇచ్చిపుచ్చుకునే వ్యవహారం ఉందని అర్థం’ అని ఇంతియాజ్ భాష్యం చెప్పారు. మమతా బెనర్జీ అరాచకాలు, టీఎంసీ రక్తపాతం అన్నీ వదిలేసి రాజ్యాంగ ప్రకారం ప్రమాణం చేసిన గంగోపాధ్యాయ ఇలా బీజేపీతో ‘టచ్’లో ఉండడం ఏం సబబు అంటూ ఇంతియాజ్ సుద్దులు కూడా మాట్లాడారు. ఇంకా ఈ బాపతు బీజేపీ వ్యతిరేక నల్లకోట్లన్నీ యథాశక్తి గంగోపాధ్యాయ మీద బురద చల్లే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.

గంగోపాధ్యాయను 2018లో కలకత్తా హైకోర్టులో అదనపు జడ్జిగా నియమించారు. 2020 నుంచి శాశ్వత ప్రాతిపదికను విధులు నిర్వహిస్తున్నారు. బెంగాల్ వైద్య కళాశాలలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరపవచ్చునని గంగోపాధ్యాయతో ఏర్పడిన ఏక న్యాయమూర్తి


**తాను బీజేపీలో చేరుతున్నానని గంగోపాధ్యాయ మార్చి 7న తేల్చి చెప్పారు. ఆయన టీఎంసీ మీద గట్టి ఆరోపణలే చేశారు. నేను ఏ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలో త్వరలోనే పార్టీ తెలియ చేస్తుందని కూడా ఆయన వెల్లడించారు. న్యాయమూర్తిపై దాడికి దిగడం దారుణమని ఆయన టీఎంసీని విమర్శించారు. ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రతి సందర్భంలోను తన మీద దాడికి దిగారని కూడా ఆరోపించారు.**

ధర్మాసనం తీర్పు చెప్పింది. దీని మీదనే సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రతికూలంగా స్పందించింది. అయినా గంగోపాధ్యాయ సుప్రీం కోర్టును పరిగణనలోనికి తీసుకోలేదు. నిజానికి గంగోపాధ్యాయ తీర్పుల విషయంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం అదే మొదటిసారి. సెప్టెంబర్ 2022లో గంగోపాధ్యాయ ఒక బెంగాలీ వార్తా చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇలాంటి ఇంటర్వ్యూలు ఇవ్వడం న్యాయమూర్తులకు సబబు కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ కూడా అభిప్రాయపడ్డారు. అదే ఇంటర్వ్యూలో తన పట్ల గంగోపాధ్యాయ వ్యతిరేక భావనను వ్యక్తం చేశారని టీఎంసీ నాయకుడు, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అభిషేక్ మీద చేసిన వ్యాఖ్యలు బెంగాల్ పాఠశాలలో నియమకాల అవకతవకలకు సంబంధించినవే. తరువాత ఈ కేసు నుంచి సుప్రీంకోర్టు గంగోపాధ్యాయను తప్పించింది. ఆ ఘర్షణ ఇంకాస్త ముందుకు వెళ్లింది.

ముందున్న పదవీ విరమణ తీసుకుని న్యాయమూర్తులు రాజకీయాలలో ప్రవేశించడం గంగోపాధ్యాయతోనే మొదలుకాలేదు. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలంలో వీఆర్ కృష్ణయ్యర్ మద్రాస్, కేరళలలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన ఈఎంఎస్ నంబూద్రి మంత్రివర్గంలో సభ్యుడు కూడా. తరువాత 1968లో ఆయనను కేరళ హైకోర్టులో, 1973లో సుప్రీంకోర్టులోను న్యాయమూర్తిగా నియమించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బహరుల్ ఇస్లాం లోక్‌సభకు పోటీ చేయడానికి 1983లో పదవికి రాజీనామా చేశారు. తరువాత రాజ్యసభకు వెళ్లారు. జస్టిస్ గుమన్ మాల్ లోధా కొద్దికాలం జనసంఘ్ రాజస్థాన్ అధ్యక్షునిగా పనిచేసిన తరువాత ఆ రాష్ట్ర హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. ఇలాంటి ఉదాహరణలు ఇంకా ఉన్నాయి. జస్టిస్ కేఎస్ హెగ్డే, జస్టిస్ రంజన్ గొగొయ్ కూడా అలా చట్టసభలకు వెళ్లినవారే. అయినా గంగోపాధ్యాయ మీద కొందరు బురద చల్లడం విచిత్రమే. ఆయన బీజేపీని ఎంచుకోవడమే ఇందుకు కారణం కావచ్చు. కానీ మిగిలిన న్యాయమూర్తులకీ, గంగోపాధ్యాయకు మధ్య చాలా తేడా ఉంది. ఆయన ఒక గూండా రాజ్యంతో తలపడ్డారు.


తాను బీజేపీలో చేరుతున్నానని గంగోపాధ్యాయ మార్చి 7న తేల్చి చెప్పారు. ఆయన టీఎంసీ మీద గట్టి ఆరోపణలే చేశారు. నేను ఏ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలో త్వరలోనే పార్టీ తెలియ చేస్తుందని కూడా ఆయన వెల్లడించారు. న్యాయ మూర్తిపై దాడికి దిగడం దారుణమని ఆయన టీఎంసీని విమర్శించారు. ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రతి సందర్భంలోను తన మీద దాడికి దిగారని కూడా ఆరోపించారు. ఒక న్యాయమూర్తి గురించి అలాంటి విషయాలు మాట్లాకూడదని కూడా వాళ్లకి తెలియదని అన్నారు. వాళ్ల అక్రమాలు వరసగా బయటకు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆ పార్టీ న్యాయమూర్తి మీద దాడికి దిగడం ఒక ఫ్యాషన్‌గా మార్చుకుందని గంగోపాధ్యాయ అన్నారు. ఆ పార్టీ లోపల లోపలే కునారిల్లిపోతున్నదని, అది ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని కూడా ఆయన జోస్యం చెప్పారు.

సందేశ్‌ఖాలీ ఘోరకలి నేపథ్యంలో కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ శివజ్ఞానం చేసిన వ్యాఖ్యలు గమనించాలి. ఆ ఉదంతంలో ప్రధాన నిందితుడు షాజహాన్ అరెస్టయి నప్పుడు, అతడి న్యాయవాదితో జస్టిస్ శివజ్ఞానం అన్నమాటలు నిజానికి టీఎంసీ ప్రభుత్వ అరాచకానికి నిజంగా అద్దం పట్టేవే. షాజహాన్ మీకు పదేళ్ల పాటు ఊపిరిసలపనంత పని ఇస్తాడు అన్నారు న్యాయ వాదితో జస్టిస్ శివజ్ఞానం. కాబట్టి ప్రధాన న్యాయమూర్తి మీద కూడా టీఎంసీ కక్ష కట్టడానికి ఎంతో సమయం పట్టకపోవచ్చు. ★



జాగృతి డెస్క్

'అన్నీ ఉన్న ఆకు అణిగిమణిగి ఉంటుంది; ఏమీ లేని ఆకు ఎగిరెగిరి పడుతుంది' అన్న నానుడిని విననివారుండరు. చదువు, డబ్బు, సంస్కారంతో పాటు పరోపకారం కూడా మనిషికి అబ్బితే, వారిని అసాధారణ వ్యక్తులుగా మనం చెప్పుకోక తప్పదు. సరిగ్గా అటువంటి వారే 'పద్మభూషణ్' సుధామూర్తి. ఏడు గౌరవ డాక్టరేట్లు ఆమె స్వంతం. ఒకపక్కన ప్రపంచంలోనే అతిపెద్ద ఐటి కంపెనీలలో ఒకటైన ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడైన భర్త, మనను పాలించిన యూకేకే ప్రధానమంత్రి అయిన అల్లుడూ ఉన్నప్పటికీ ఆమె మాత్రం సగటు మధ్య తరగతి గృహిణిలా, మన పక్కింటి మహిళలా అనిపిస్తారు. ఎంతో సంప్రదాయంగా కనిపించినప్పటికీ, ఏటికి ఎదురీదగల వ్యక్తిత్వం ఉన్న మహిళ ఆమె. ఎప్పుడూ భర్త నారాయణ మూర్తి చాటున ఉండే వారు. కాగా, ఇటీవలే భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమెను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజ్యసభకు నామినేట్ చేయడంతో ఆమె మరోసారి వార్తలలోకెక్కారు.



సుధామూర్తి

# వినయ 'సుధ'

ఇంతకు ముందు, అత్యంత సాధారణ వ్యక్తిని తానంటూ ఒక టీవీ షోలో సుధామూర్తి చెప్పినప్పుడు అనేకమంది దానికి ప్రతికూలంగా స్పందించడంతో ఆమె వార్తలలోకెక్కారు. నిజానికి, సుధామూర్తి ఏమీ బంగారు చెంచాతో పుట్టలేదు. ఆమె కూడా ఒక సాధారణ మధ్య తరగతి ఇంటి నుంచి వచ్చిన వ్యక్తే. అయితే, ఆమె పుట్టినింట్లో తండ్రి సహా కుటుంబ సభ్యులు పురోగమనశీల ఆలోచనలు గలవారు కావడంతో ఆమె ఇంజినీరింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేయగలిగింది. తను ఆడపిల్లననే వివక్షను తల్లిదండ్రులు ఎప్పుడూ చూపించలేదని, అదే తనకు బలమని ఆమె చెప్తుంటారు. తనపై తన నాయనమ్మ ప్రభావం కూడా చాలా ఉందని, ఆ కాలంలోనే ఆమె ఆధునిక భావాలు కలిగిన మనిషిగా తమ పెంపకంపై ప్రభావాన్ని చూపిందని ఆమె చెప్తుంటారు.

ఏమైనప్పటికీ, సంప్రదాయ, ఆధునికతల సమ్మేళనమైన ఆమె మూర్తి ట్రస్టు చైర్మన్‌గా అనేక స్వచ్ఛంద కార్యక్రమాలను చేపడుతుంటారు. ఆమె రచయిత కూడా. ముఖ్యంగా పిల్లలకు వినయాన్ని, వివేకాన్ని బోధించే విధంగా కథలు రాస్తుంటారు. అపారమైన ఉద్యోగ, వ్యాపార అనుభవమే కాక మన సంప్రదాయం పట్ల గౌరవం కలిగిన వ్యక్తి అయిన సుధామూర్తిని రాజ్యసభకు నామినేట్ చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షాన్ని వ్యక్తం చేశారు. సమాజసేవ, పరోపకారం, విద్య వంటి భిన్న రంగాలకు ఆమె చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని, రాజ్యసభలో ఆమె ఉనికి 'నారీ శక్తి'కి బలమైన ఉదాహరణగా నిలుస్తుందంటూ ప్రధాని ఎక్స్‌పై చేసిన పోస్టులో కొనియాడారు.

ఉత్తర కర్ణాటకలోని హవేరీ జిల్లాలోని షిగ్గాంవ్‌లో జన్మించిన సుధామూర్తి బివిబి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నుంచి ఇంజినీరింగ్‌ను పూర్తి చేశారు. అన్ని అంశాలలోనూ ఆమె తొలి ర్యాంకును సాధించి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ నుంచి స్వర్ణ పతకాన్ని పంపారు. అనంతరం ఆమె ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి ఎంఇ ని డిస్టింక్షన్‌తో పూర్తి చేశారు. అనంతరం, ఆమె టెల్కోలో (నేడు టాటా మోటార్స్) లో ఇంజినీరుగా తన జీవితాన్ని ప్రారంభించారు. నేడు ఆమె ఇన్ఫోసిస్ ఫౌండెషన్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు.


ఆమె అటు ఇంగ్లీషులోనూ, ఇటు మాతృభాష కన్నడలోనూ కూడా పుస్తకాలను రచించారు. నవలలు, నాన్-ఫిక్షన్, పిల్లల పుస్తకాలు, ట్రావెలాగ్‌లు, సాంకేతికత పుస్తకాలు, జ్ఞాపకాలు సహా 200 శీర్షికలతో పాటు 30 పుస్తకాలు రచించారు. ఆమె పుస్తకాలను ప్రధాన భారతీయ భాషలన్నింటిలోకి అనూదితమై, దేశవ్యాప్తంగా సుమారు 26 లక్షల కాపీలు అమ్ముడయ్యాయి.

ఆమె అనేక సామాజిక సమస్యలపై పోరాటం చేయడమే కాదు, సామాజిక అవగాహనకు ప్రముఖ గొంతుకగా ఆమె విదేశాలలో విస్తృతంగా పర్యటించారు. గేట్స్ ఫౌండేషన్ వంటి సంస్థలు చేపట్టిన ప్రజారోగ్య సంరక్షణ చొరవల్లో ఆమె చురుకుగా పాలుపంచుకోవడమే కాదు, అనేక అనాథాశ్రమాలను ఏర్పాటు చేసి ఎంతోమంది పిల్లలకు ఆశ్రయాన్ని కల్పించారు. అంతేనా? ఆమె గ్రామీణాభివృద్ధి పట్ల కూడా ఆసక్తిని ప్రదర్శించి, అందుకోసం కృషి చేస్తున్నారు. కర్ణాటక ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ సౌకర్యాల కల్పనకు పోరాడారు. కేవలం దేశంలోనే కాదు, విదేశాలలో కూడా ఆమె భారతీయ సంస్కృతిని వ్యాప్తి చేసేందుకు కృషి చేశారు. అందులో భాగంగానే, హార్వర్డ్ యూనివర్సిటీలో మూర్తీ క్లాసికల్ లైబ్రరీ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారు.

ఆమె చేస్తున్న సమాజ సేవను గుర్తించిన ప్రభుత్వం 2006లో ఆమెకు 'పద్మశ్రీ'ని ప్రదానం చేయగా, 2023లో 'పద్మభూషణ్' ఇచ్చి సత్కరించింది. ఈ అత్యున్నత గౌరవాన్ని పొందిన అతితక్కువమంది వ్యక్తులలో ఆమె ఒకరయ్యారు. సమాజ సేవ మాత్రమే కాదు, సాహితీరంగంలో కూడా ఆమె సాధించిన విజయాలు తక్కువ కాదు. ఆర్‌కె నారాయణ్ అవార్డ్ ఫర్ లిటరేచర్, కన్నడ సాహిత్యంలో అత్యుత్తమ సాహిత్యానికి ఇచ్చే అత్తిమబ్బే అవార్డును 2011లో పొందారు. ఇక, 2018లో క్రాస్‌వర్డ్ బుక్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఆమె పొందారు. సాహిత్యంపై ఆమె వేసిన ముద్రకు ఇంతకన్నా ఉదాహరణల అవసరం ఉండదేమో.

అత్యంత సాధారణంగా కనిపించే సుధామూర్తి, ఆస్తుల విలువ సుమారు రూ.5,600 కోట్లు మాత్రమేనట!


(రాజ్యసభకు నామినేట్ అయిన సందర్భంగా)



# ఎన్డీఏలో

**నేషనల్ డెమొక్రటిక్ ఎలయన్స్ (ఎన్డీఏ)లో తెలుగుదేశం పార్టీ అధికారికంగా చేరింది. జనసేన ఇప్పటికే ఎన్డీఏతో కలిసి ఉంది. టీడీపీ కూడా కలవడంతో ఇప్పుడు బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీలతో ఎన్డీఏ పటిష్టంగా ఉంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ మూడు పార్టీలు కలసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వైసీపీని ఎదుర్కోవడం బీజేపీ వల్లనే సాధ్యమౌతుందని తెలుగుదేశం భావించింది. దాంతో వారే ముందుకు వచ్చి కూటమిలో చేరతామని అభ్యర్థించారు. ఈ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేసి గెలవాలని నిర్ణయించుకున్న బీజేపీ పెద్ద మనసుతో ఆలోచించి తెలుగుదేశాన్ని ఎన్డీఏలోకి ఆహ్వానించింది.**

1998లో లోక్‌సభ ఎన్నికల తర్వాత టీడీపీ ఎన్డీఏ కూటమిలో తొలిసారిగా చేరింది. వాజ్‌పేయి ప్రభుత్వంలో ఆ పార్టీ ఎంపీ జీఎంసీ బాలయోగి లోక్‌సభ స్పీకర్ అయ్యారు. 1999 ఎన్నికల్లో ఇరుపార్టీలు కలిసి పోటీచేసి ఘనవిజయం సాధించాయి. 2004 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో రెండు పార్టీలు ఓడిపోయాయి. తర్వాత టీడీపీ ఎన్డీఏ వైదొలిగింది. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. ఆ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ తమ ప్రధాని అభ్యర్థిగా మోదీని రంగంలోకి దింపింది. ఆయనకు ప్రజాదరణ బాగా పెరగడంతో దానిని తమ విజయానికి అనుకూలంగా మార్చుకోవాలని తెలుగుదేశం భావించి తిరిగి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో చేరి గెలిచింది. అప్పుడే కొత్తగా ఆవిర్భవించిన జనసేన కూడా ఈ కూటమికి మద్దతు పలికింది. కేంద్రప్రభుత్వంలో తెలుగుదేశం, రాష్ట్ర ప్రభుత్వంలో బీజేపీ భాగస్వాములుగా చేరాయి. అయితే తెలుగుదేశం పాలనా వైఫల్యాలు, అవినీతిపై ప్రధాన ప్రతిపక్షం నుంచి ఒత్తిడి రావడంతో చంద్రబాబునాయుడు ప్రత్యేక హోదాపేరుతో సమస్యను పక్కదారి పట్టించారు. ఆర్థిక సంఘం సూచనల మేరకు ప్రత్యేక హోదా ఏ రాష్ట్రానికి ఇవ్వడం వీలుకాదని, దానికి బదులుగా ప్రత్యేక నిధులు ఇస్తామన్న కేంద్రప్రభుత్వ హామీకి చంద్రబాబు ఒప్పుకున్నారు.




**వల్లూరు జయప్రకాష్ నారాయణ**
చైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ

కాని వైసీపీ నుంచి వచ్చే ఒత్తిడిని తట్టుకోలేక కేంద్రప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వలేదంటూ 2018 మార్చిలో ఎన్డీఏ నుంచి వైదొలిగారు. 2019 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ జనసేనలు వేర్వేరుగా పోటీచేశాయి. బీజేపీ అండలేని టీడీపీ ఘోరంగా ఓడిపోయింది. జనసేనది కూడా అదే పరిస్థితి. బీజేపీ తిరిగి కేంద్రంలో అధికారం చేపట్టింది. జనసేన కూడా 2020 జనవరి 16న తిరిగి ఎన్డీఏ చేరింది.

**రాష్ట్రంలో వైసీపీ ప్రజావ్యతిరేక పాలన**

ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ విధానం ఉగ్రవాదం, అవినీతి, సహజ వనరులను దోచుకోవడంగానే కనిపించింది. 'రాష్ట్ర విభజనతో ఆంధ్రలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభం ఏర్పడితే దానిని పరిష్కరిస్తారని జనం నాడు ఎన్డీఏ కూటమిని ఎన్నుకున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలనలో వైఫల్యం చెందారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు నరకాన్ని చూపింది. విలువైన ఇసుక, ఖనిజాలు వంటి సహజ వనరులను దోపిడీ చేసింది. సంపూర్ణ మద్య నిషేధం అమలు చేసిన తర్వాతే తిరిగి ఎన్నికలకు (2024) వెళతామని చెప్పిన వైసీపీ ఆ హామీని బుట్టదాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వమే మద్యం దుకాణాలు చేపట్టింది. గతంలో ఉన్న మద్యం తయారీ యజమానులను బెదిరించి డిస్టిలరీలను స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం నుంచి సరైన సమాధానం లేదు. పైగా దుకాణాల్లో నాసిరకం మద్యాన్ని రెండింతల ధరలకు అమ్ముతోంది. ఇందులో విశేషం ఏంటంటే మద్యాన్ని నగదు రూపంలోనే కొనుగోలు చేయవలసి వస్తోంది. అమ్మకాల్లో 30 శాతం లాభాలు నేరుగా తాడేపల్లి ప్యాలెస్‌కే చేరుతున్నాయనే బీజేపీ ఆరోపణలపై ప్రభుత్వం నుంచి స్పందనే లేదు. ఇక తమ జేబులు నిండడం కోసం నూతన పాలసీ తయారీ పేరుతో ఇసుక సరఫరాను ఉద్దేశ్యపూర్వకంగా నిలిపివేసి బ్లాక్ మార్కెట్‌లో అమ్మినట్లు వచ్చిన ఆరోపణలపైనా ప్రభుత్వం స్పందించలేదు. నూతన పాలసీ పేరుతో ఇసుకను జేపీ వెంచర్స్ అనే సంస్థకు రెండేళ్ల కాలానికి కాంట్రాక్టుకు అప్పగించడం, ఆ సంస్థ చాటున వైసీపీ నాయకులు అక్రమంగా ఇసుకను తోడేసి అమ్మేసుకోవడం, దీనిపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ భారీ జరిమానా విధించడం తెలిసిందే కరెంట్ ఛార్జీలను ఆరుసార్లు పెంచారు. భారీగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను అదుపుచేయలేదు. దానికి తోడు పన్నులు భారీగా పెంచారు. భూకబ్జాలు పెరిగాయి. రాజధాని అమరావతిని కాదని, వికేంద్రీకరణ పేరుతో 3 రాజధానులను తెరపైకి తెచ్చి రైతులకు అన్యాయం చేశారు. కనీసం ఒక్క రాజధానిని నిర్మించలేదు. మౌలికసదుపాయాలను నిర్లక్ష్యం చేశారు. ఒక్క ప్రాజెక్టును పూర్తిచేయలేదు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి నిర్లక్ష్యం చేశారు. అభివృద్ధిని అటకెక్కించారు. విద్య, వైద్యంపేరుతో మాయచేస్తున్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేశారు. వ్యాపారవేత్తలను, పారిశ్రామిక వేత్తలను బెదిరించడం, వారు పారి పోయేలా చేయడం... ఎర్రచందనం అక్రమ రవాణా, 30 వేలకు పైగా మహిళల ఆచూకీ లేకపోవడం, దళితులపై



# కి టీడీపీ పునఃప్రవేశం


అత్యధిక స్థాయిలో అఘాయిత్యాలు, దేవాలయాల ధ్వంసం, టీటీడీని ఏటీఎంగా మార్చడం... ప్రతిపక్ష నేతలకు, కేడర్‌కు బెదిరింపులు, భౌతిక దాడులు, న్యాయవ్యవస్థపై దాడులు, ఎన్నికల పోలింగ్‌కు దొంగ ఐడీలు తయారీ ఇలా ప్రభుత్వ అవినీతి, వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలకు లెక్కేలేదు.


**బీజేపీ వైపు ప్రజల చూపు**

మరోవైపు ప్రధాని మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోంది. అభివృద్ధి నల్లేరుపై నడకలా సోగుతోంది. మోదీ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగింది. యువత, మహిళలు, రైతులు, పేదలు.. అన్ని వర్గాలు మోదీ పట్ల ఆకర్షితులయ్యారు. దేశ ఆర్థికాభివృద్ధికే కాకుండా వివిధ రంగాల్లో సమగ్రాభివృద్ధికి కేంద్ర సర్కారు ప్రాధాన్యమిచ్చింది. కరోనా సమయంలో దేశ ప్రజలను ఆదుకోడానికి ప్రధాని మోదీ విశేష కృషి చేశారు. 9 నెలల్లోనే వాక్సిన్ కనిపెట్టేలా శాస్త్రజ్ఞులను ప్రోత్సహించారు. తీవ్ర సంక్షోభాల మధ్యకూడా భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతూ, ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. బీజేపీ పాలనలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. దుర్బల ఆర్థిక పరిస్థితుల నుంచి ప్రపంచంలో మొదటి అయిదు బలమైన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఎదిగింది. ఎగుమతులు, ఎఫ్‌ఐలు గణనీయంగా పెరిగాయి. ప్రపంచంలోని బలమైన బ్యాంకింగ్ వ్యవస్థల్లో ఒకటిగా భారత్ మారింది. మొబైల్ ఫోన్ల తయారీ 5 రెట్లు పెరిగింది. రక్షణ రంగ ఉత్పత్తుల విలువ రూ. లక్ష కోట్లు దాటింది. మరో పెద్ద సంస్కరణ– డిజిటల్ ఇండియా సృష్టి. ఇది వ్యాపార లావాదేవీలను చాలా సులభతరం చేసింది.

దేశంలో మునుపెన్నడూ లేనివిధంగా మౌలిక వసతుల కల్పన జరుగుతోంది. గ్రామాల్లో దాదాపు 4 లక్షల కిలోమీటర్ల మేర కొత్త రోడ్లు నిర్మించారు. విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 149కి పెరిగింది. 'వన్ నేషన్, వన్ పవర్ గ్రిడ్'తో విద్యుత్తు వ్యవస్థ మెరుగుపడింది. 25 వేల కిలోమీటర్లకుపైగా రైలు మార్గాల నిర్మాణం జరిగింది. 100% రైల్వేలైన్ల విద్యుదీకరణకు దగ్గరగా ఉన్నాం. గతంలో రూ.2 లక్షల ఆదాయంపై పన్ను విధించేవారు. నేడు రూ.7 లక్షల వరకు పన్నులేదు. దీనివల్ల గత పదేళ్లలో పన్ను చెల్లింపుదారులకు సుమారు రూ.2.5 లక్షల కోట్లు ఆదా అయింది.

ఆయుష్మాన్ యోజనతో ఉచిత వైద్యం వల్ల పౌరులకు రూ.3.5 లక్షల కోట్లు మిగిలింది. మందుల ధరలను తగ్గించడంవల్ల ఏటా దాదాపు రూ.27 వేల కోట్లు ఆదా అవుతున్నాయి. పేదలకు చౌక రేషన్‌కోసం ప్రభుత్వం దశాబ్ద కాలంలో దాదాపు రూ.20 లక్షల కోట్లు ఖర్చు చేసింది. బీజేపీ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి, సుపారిపాల నతో రాష్ట్ర ప్రజలు కూడా మోదీ పట్ల ఆకర్షితులయ్యారు. బీజేపీ నాయకులు వైసీపీ చేస్తున్న అరాచకాలపై తీవ్ర పోరాటం చేశారు. ఈ నేపథ్యంలో ఒంటరిగానే పోటీచేసి అధికారంలోకి రావాలని బీజేపీ నిర్ణయించుకుంది. అదే సమయంలో మోదీ నాయకత్వాన్ని అంగీకరించి బీజేపీతోనే తాము రాష్ట్రంలో అధికారంలోకి రాగలమని భావించిన టీడీపీ తిరిగి ఎన్డీఏలోకి వస్తామని అభ్యర్థించింది. దాంతో బీజేపీ అంగీకరించి రాష్ట్రంలో కూటమిగా లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో కలిసిమ పోటీ చేయాలని నిర్ణయించుకుంది. ★








# రామరాజ్యం

"నా విష్ణుః పృథివీపతిః" అని ప్రాచీన భారతీయుల విశ్వాసం. విష్ణువు అంశం లేనిదే పృథివీపతిత్వం రాదు. త్రిమూర్తులలో విష్ణువు జగద్రక్షకుడు. విష్ణువులోని వరణీయములైన గుణాలన్నీ రాజులో ఉండాలని భారతీయులు ఆదర్శం. శ్రీరామచంద్రుడు ఆదర్శప్రాయుడయిన రాజు. ఆయన గుణాలను క్లుప్తంగా మనం చూస్తే రాజు లేక నాయకుడికి ఉండవలసిన గుణజాతము మనకు అవగతమవుతుంది.

రామునకు యౌవరాజ్య పట్టాభిషేకం చేయడానికి ప్రజలంతా తమ సమ్మతిని, ప్రమోదాన్ని ప్రకటించారు. ప్రజలందరు తన పుత్రుడి గుణ గణాలను కీర్తింపగా వినవలెనని ఆశించిన దశరథుడు 'నే నెంతయో ధర్మయుతంగా రాజ్యం పాలించుచుండగా మీరంతా నా పుత్రుని పట్టాభిషేకాన్ని ఏల కోరుతున్నారు' అని ప్రశ్నించాడు. అప్పుడు ప్రజలు శ్రీరాముని గుణాలెన్నింటినో ప్రస్తుతించారు.

రాముడు ధర్మం తెలిసినవాడు. సత్యసంధుడు, మంచి శీలం కలవాడు. అసూయ ఎరుగడు. ఓర్పుగలవాడు. ప్రియభాషణుడు. ఇతరులను ఓదార్చుడంలోనూ సమర్థుడే. పొందిన ఉపకారాన్ని విస్మరించడు. మృదువైన, స్థిరమైన చిత్తం గలవాడు. వేదవిదులగు బ్రాహ్మణులను సేవించు స్వభావం గలవాడు. పౌరులను తన ఆప్తులవలె కుశలమా? అని అడుగుతాడు. పౌరులు సుఖంగా ఉన్నప్పుడు, పుత్రుల సౌఖ్యాన్ని చూసిన తండ్రివలె సంతోషిస్తాడు. ప్రజలకు బాధలు కలిగినపుడు శ్రీరాముడెక్కువగా దుఃఖిస్తాడు, నవ్వుతూనే మాట్లాడతాడు. ఎల్లప్పుడు ధర్మాన్నే ఆశ్రయిస్తాడు. ప్రజలను పాలించడంలో మెలకువలు గ్రహించినవాడు. రాగద్వేషాలకు వశుడు కానేకాడు. శ్రీరాముడు అన్ని విద్యలలో పరిపూర్ణ ప్రజ్ఞుడు. ధనుర్వేద నిష్ణాతుడు. ద్విజుల నుండి ధర్మాధర్మ విచారణ నైపుణ్య శిక్షణ పొందినాడు. ఆయన కోపం కానీ అనుగ్రహం కానీ వ్యర్థములు గావు.

"అన్నిటికంటేను విచిత్రమైన విషయమొకటి ఉంది. దేశంలోని స్త్రీలు, వృద్ధులు, తరుణులు సాయం ప్రాతఃస్సమయాల పట్ల శ్రద్ధ కలవారై భక్తితో దేవతారాధనాతత్పరత్వాన్ని ఆయనకు బలం, ఆరోగ్యం, ఆయువు కలగాలని ప్రార్థిస్తారు. 'ఎపుడైన ఎవరైన ఉపకారమొకటి చేసినా, దానిని శ్రీరాముడు మరువడు. వందలాది ఉపకారములు చేసి వారిని స్మరింపనే స్మరింపడు. ఇదే ఆత్మవంతుని లక్షణం.

"శ్రీరామునకు కులోచిత ధర్మ నిర్వహణలో శ్రద్ధ ఎక్కువ. తన దోషాలను, పరుల దోషాలను తెలుసుకోగలవాడు. ధనాదాయాలను పెంపు చేసే ఉపాయం తెలిసినవాడు. ధన వ్యయంలో జాగరూకత గలవాడు." వీటన్నిటిలో మనం ముఖ్యంగా గుర్తింపదగినవి...జితేంద్రియత్వం, వృద్ధసేవ, సత్యాదాత్మ గుణాలు, ప్రజాపాలన తత్త్వజ్ఞత.

పైన వర్ణితములైన భావాలకు ప్రమాణాలైన అయోధ్యకాండ ద్వితీయ సర్గలో "ధర్మజ్ఞస్సత్యసంధశ్చ శీలవా ననమాయకః క్షాన్తః సాన్త్వయుతః శ్లక్షణం కృతజ్ఞో విజితేన్ద్రియః" ఆదిగా గల శ్లోకాలను పరికింపవచ్చు. ఇంత ఎందుకు? శ్రీరాముడు పరిపూర్ణ మానవుడు – నృపతి, పతి, పిత, భ్రాత, మిత్రుడు, పుత్రుడు, క్షత్రియుడు, సంపూర్ణ మానువుడునూ..

ఈ గుణాలుగల రాజు భరతదేశమునకు లభించిననాడు తప్పక రామరాజ్యం సిద్ధిస్తుంది. లేనినాడు రామరాజ్యం నేతిబీరకాయయే. రామరాజ్యం పేరును ఉచ్చరించేవారు, ముఖ్యంగా పదవీ ప్రియులగు నాయకులును, వారి అనుచరులును పై లక్షణాలను మననం చేసి ఆచరణలో పెడతారని ఆశిస్తున్నాం.


**– భాగవతుల కుటుంబరావు**

**'జాగృతి' 10.7.1949 సంచిక నుంచి**

ఆధ్యాత్మికం

సప్త చిరంజీవులు

# పిత్రాజ్ఞ పాలకుడు భార్గవుడు



దశావతారాలలో ఆరవది పరశురామావతరం. శ్రీమహావిష్ణువు దాల్చిన పరాక్రమవంతుడైన మానవ అవతారం. జమదగ్ని రేణుకాదేవి దంపతులు ఐదుగురు పుత్రులలో ఆఖరివాడు. ధర్మానికి హాని కలిగినప్పుడు దుష్ట సంహారానికి, ధర్మరక్షణకు తనను తాను సృష్టించుకుంటానన్న శ్రీహరి, ఆ మాట ప్రకారం అవతరించాడు. శ్రీమహావిష్ణువు ఏకకాలంలో రెండు అవతారాలు (భృగురాముడు, దరరథ రాముడు) దాల్చి, పరస్పరం ఎదురెదురు నిలిచిన అరుదైన సందర్భం. రామచంద్రుని ఆజ్ఞతో మహేంద్రగిరికి వెళ్లి తపమాచరించాడని ప్రతీతి. ఎంతటి పరాక్రమవంతుడో అంతటి మృదుస్వభావి.

బలి చక్రవర్తి పాలన వరకు అణిగిమణిగి ఉన్న రాజులు ఆ తర్వాత క్రమంగా దర్పం ప్రదర్శించ సాగారు. 'రాజ్యం వీర భోజ్యం'లా పరిస్థితి మారి పోయింది. ప్రజలు తల్లడిల్లుతున్నారు. రాజుల ఆరాచకాలు బాధ కలిగిస్తున్నాయని భూదేవి గోవు రూపంలో విష్ణువుకు మొరపెట్టుకోగా, భృగు రాముడిగా (జమదగ్ని వంశం)అవతరించి క్షత్రియహారం చేస్తానని హామీ ఇచ్చినట్లు బ్రహ్మాండ పురాణం పేర్కొంటోంది. పరశురాముడు తండ్రి వద్దనే విద్యను అభ్యసించాడు. ధనుర్విద్యా భ్యాసం కోసం శివుడి కోసం తపస్సుకు దిగాడు. ఆ

# నాటి నాగరికతకు ప్రతిరూపం 'ద్వారక'

16




మన దేశంలో సింధు నాగరికతకు చెందిన అతి పురాతన అవశేషాలన్నీ దేశ విభజనలో పాకిస్తాన్‌కి సంక్రమించాయి. దానితో సింధు నాగరికతను పరిశీలించే మన చరిత్ర పరిశోధకులకు అవరోధం ఏర్పడింది. అటువంటి పరిస్థితిలో మన పరిశోధనలకు నూతనాధ్యాయాన్ని రూపొందిచారు శ్రీ ఎన్.ఆర్. రావు. ఆయన 1954లో సింధు నాగరికతకు చెందిన 'లోథల్' ఓడరేవును కనుగొన్నారు. దీనితో సింధు సంస్కృతికి సంబంధించిన ఎంతో విలువైన సమాచారం మనకు లభించింది. ఆయన అన్వేషణ అంతటితో ఆగిపోలేదు.

ప్రపంచ వ్యాప్తంగా ఎందరో పరిశోధకులు, భాషావేత్తలు ఎన్నో రకాలుగా ప్రయత్నించి విఫలమైన సింధు లిపిని చదివి అందరిచే 'శభాష్' అనిపించుకున్న మేధావి రావు. ఆయన కృషినీ, ఆసక్తినీ గుర్తించిన మన ప్రభుత్వం ఆయనకు కొత్త బాధ్యత అప్పగించింది. దేశంలోని విలువైన చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, పునర్‌నిర్మాణ కార్యక్రమాలు ఆయన పర్యవేక్షణలో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా తాజ్ మహల్ 'ఆగ్రాకోట', ఫతేపూర్ సిక్రీ, ఖజురహో, మహాబలిపురం, అజంతాపూర్, తిరుచూర్‌లోని దేవాలయాలు ఇంకా ఎన్నో కొత్తవి రూపు దిద్దుకుంటున్నాయి రావు అధ్వర్యములో.

ప్రస్తుతం రావుగారు తలపెట్టిన కొత్త పథకం లక్ష్యం 'ద్వారకానగరం'. మహాభారత కథాసూత్రధారి శ్రీకృష్ణుని పట్టణం. హిందువుల సంస్కృతిలో ఒక భాగమైన శ్రీకృష్ణుడు నివసించిన పుణ్యస్థలం ద్వారకానగరం గురించి తెలియని భారతీయుడు ఉండడు. ద్వారకానగరం ప్రస్తావన మహాభారతం లోనే కాక, చందోగ్యోపనిషత్తు, హరివంశం వంటి గ్రంథాలలో కూడా కనిపిస్తుంది.

శ్రీకృష్ణుడు, గోవులను కాచుకొని జీవించే యాదవులను, అమాయకులైన పల్లీయులను, కరవు కాటకాల ప్రభావంతో వలసవచ్చిన అనాగరికులను చేర్చి వారిని నాగరీకులుగా తీర్చిదిద్ది, వారికి ఉపాధి కల్పించే పథకం రూపొందించే యోజన చేసాడు. ఆ పథకం ఫలితమే ద్వారకా రేవుపట్టణ నిర్మాణం.

ఈ రేవు పట్టణం వలన భారతదేశాన్ని గొప్ప వ్యాపార కేంద్రంగా మలచటమేకాక, శత్రువులకు అభేద్యమైన కోటగా ఉపయోగపడేలా నిర్మితమమైంది ద్వారక.

ఇన్ని హంగులు ఉండే స్థలం మహోదధి (అరేబియా సముద్రం) తీరంలోని ఒక చిన్నద్వీపం శ్రీకృష్ణునికి అనువైన స్థలంగా కనిపించింది. ఆ ద్వీపంపై పూర్వం రైవతుడనే రాజు (బలరాముని మామగారు) పాలనలో 'కౌశస్థలి' అనే శిథిల నగరం ఉండేది. ఆ నగరానికి మార్పులు, చేర్పులు చేసి ద్వారకగా రూపొందించారు.

భారత కథలో వర్ణితమైన ఈ పట్టణ నిర్మాణం ఏ సంవత్సరాల్లో జరిగిందో మనకు తెలియకపోయినా వైనం మాత్రం భారతంలోని 'మౌసలపర్వం'లో స్పష్టంగా ఉంది. కురుక్షేత్ర యుద్ధానంతరం శ్రీకృష్ణుడు అవతారం చాలించగానే ఈ ద్వీపం మునిగిపోయిందని, ఈ ప్రళయం గురించి శ్రీకృష్ణుని వంటివారికి ముందుగానే తెలిసినట్లుగా పేర్కొని ఉంది. శ్రీకృష్ణుని ఆదేశం ప్రకారం ద్వారకావాసులను అర్జునుడు నగరం నుంచి ఖాళీ చేయిస్తాడు. ఆ వెంటనే సూర్యోదయం అవుతుండగా ద్వారక మెల్లమెల్లగా సముద్రంలో కలిసిపోతుంది.

ద్వారక ఉండేదని ఊహిస్తున్న ప్రాంతంలో ఈ మధ్య జరిపిన పరిశోధనల్లో అక్కడ ఒక గొప్ప రేవుపట్టణం ఉండేదనటానికి దాఖలాలు కనిపించాయి.

ఆ ప్రాంతంలో దొరికిన ఎన్నో వస్తువులు, కట్టడ శిథిలాలు ఎంతో చరిత్రను చెప్పాయి. ఈ వస్తువు 'రేడియోకార్బన్' పద్ధతి ద్వారా క్రీ.పూ. 1400 నాటిదని నిర్ణయించారు. అంటే ఈ సాక్ష్యాధారాలను బట్టి ఈ పట్టణం క్రీ.పూ. 1400-1500 ప్రాంతాలలో ముంపునకు గురయినట్లు అనకోవచ్చు. అంతేకాదు. భారతయుద్ధం కూడా అదేకాలంలో జరిగినట్లు స్పష్టమవుతున్నది.

ఈ సూత్రం ఆధారంగా జరిపిన పరిశోధనల్లో ఎన్నో ఆశ్చర్యకరమైన విషయాలు బయటపడ్డాయి.

– తురగా అనూరాధ

'జాగృతి' 26-05-1986 నుంచి


సమయంలో, దానవుల దాడులనుంచి తమను కాపాడాలని దేవతలు శివుడిని వేడుకోగా, దానవులపై సమరానికి వెళ్లవలసిందిగా ఆయనను ఆదేశించాడు. 'దేవా! నీవెరుగనది ఉన్నదా? శక్తిసంపన్నులైన దానవులను నేను ఎలా గెలవగలను' అని ప్రశ్నించడంతో, పరమేష్టి తనలోని తేజస్సును ఆయనలో ప్రవేశపెట్టి వరాలతో పాటు ఆయుధాలు ప్రసాదించాడు. వాటిలో 'పరశువు'(గండ్రగొడ్డలి) ఒకటి. భృగు వంశీయుడై భృగురాముడిగా వ్యవహారంలో ఉన్న ఆయన నాటి నుంచి 'పరశురాముడి'గా విఖ్యాతుడయ్యాడు. పరశురాముడు పితృవాక్య పరిపాలకుడు. తండ్రి ఆజ్ఞను నెవవేర్చడమే కర్తవ్యంగా భావించాడు. తల్లి రేణుకను శంకించిన తండ్రి ఆమెను వధించాలని ఇచ్చిన ఆజ్ఞను అన్నలు పాటించపోయినా, ఆయన అమలు చేశాడు. ఒకనాడు నీటి కోసం నదికి వెళ్లిన రేణుకాదేవి, అక్కడ చిత్రరథుడు అనే గంధర్వుడు అప్సర కన్యలతో ఆచరిస్తున్న జలక్రీడలను మైమరచి చూస్తూ సకాలంలో ఆశ్రమానికి చేరలేదు. దానిని దివ్యదృష్టితో గమనించిన జమదగ్ని, భార్య నిగ్రహం కోల్పోయిందంటూ ఆగ్రహించాడు. ఆమె తలను ఖండించాలని ఆదేశించాడు. మాతృహత్యకు నిరాకరించిన నలుగురు పుత్రులను శపించాడు. తన ఆజ్ఞ పాటించిన పరశురాముడికి వరం అనుగ్రహించదలచగా, తల్లిని బతికించాలని, సోదరులను శాపవిమక్తులను చేయాలని కోరాడు. ఆయన వినయ విధేయతలు, తల్లి, అన్నలపై గల అప్యాయతానురాగాలకు మెచ్చి, కుమారుడి అభీష్టాన్ని తీర్చడంతో పాటు 'నీవు కారణజన్ముడివి, చిరంజీవివి' అని ఆశీర్వదించాడు.


– రామచంద్ర రామానుజ

## వివేకానంద సూక్తిశతి

Don't say we are weak; we can do anything and Everything. We all have the same glorious soul let us believe in it.

దుర్బలులమనుకొని దుఃఖించబోకండి!
సకల కార్యములును సాధ్యపడును
దివ్యశక్తులున్న దివ్యాత్ములముగదా
వినుడి స్వామి సద్వివేకవాణి!!





బండిరాజుల శంకర్

# కశ్మీరీల హృదయాలను



ఒక ప్రాంత అభివృద్ధికీ, అక్కడ ఉండే శాంతిభద్రతలకీ అవినాభావ సంబంధం ఉంటుంది. ప్రజలందరికీ సమానమైన హక్కులు, స్వేచ్ఛ కూడా ఆ ప్రాంతాన్ని వెనుకబాటుతనం నుంచి తప్పించే మార్గాలే అవుతాయి. శాంతి భద్రతలు, హక్కులు, స్వేచ్ఛ వీటన్నిటినీ నిలబెట్టడం కూడా అభివృద్ధిని నిర్దేశిస్తాయి. కశ్మీర్‌లో 370 అధికరణం చేసినది ఇదే. కశ్మీరీలకు స్వేచ్ఛ వచ్చింది. శాంతిభద్రతలు నెలకొన్నాయి. దాదాపు మూడు దశాబ్దాల రక్తదాహం నుంచి పాక్ ప్రేరేపిత ముస్లిం మతోన్మాదులు వెంటనే బుద్ధి తెచ్చుకుంటారని ఎవరూ చెప్పడం లేదు. చెదురుమదురు సంఘటనలు జరుగుతున్నాయి. కానీ 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పటికీ ఇప్పటికీ తేడా ఎవరైనా గమనించవచ్చు. ఈ విషయాన్ని ఫిబ్రవరి 7న భారత ప్రధాని నరేంద్ర మోదీ తన ఉపన్యాసంలో కూడా

**‘కొన్ని క్షణాల క్రితం నేను శ్రీనగర్ చేరుకోగానే దూరంగా ఉన్న శంకరాచార్య పర్వతాన్ని దర్శించే అవకాశం లభించింది’**

మార్చి 7న జమ్ముకశ్మీర్ పర్యటన కోసం శ్రీనగర్ చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ తన ఎక్స్ ఖాతాలో చేసిన వ్యాఖ్య ఇది. ప్రపంచ ప్రఖ్యాత సుందర దాల్ సరస్సుకు దక్షిణ భాగాన ఉన్న శంకరాచార్య పర్వతం లేదా శ్రీపర్వత దర్శనం అంటే ఒక మహోన్నత చరిత్రను స్మరించుకోవడమే. ఆ చరిత్ర భగవత్పాదులు, ఆది శంకరుల జీవితంతో, తాత్త్వికతతో ముడిపడి ఉన్న చరిత్ర. మోదీ తన వ్యాఖ్యతో మనను కూడా ఆ చరిత్రతో కరచాలనం చేయించారు. ప్రధాని రాక కోసం శ్రీపర్వతానికి దగ్గరగానే హెలీప్యాడ్ నిర్మించారు. రూ. 5,000 కోట్లతో తలపెట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించడానికీ, ‘వికసిత్ భారత్, వికసిత్ జమ్ముకశ్మీర్ కార్యక్రమంలో పాల్గొనడానికీ ప్రధాని అక్కడికి చేరుకున్నారు. ఇవన్నీ కాకుండా ఈ యాత్రకు మరొక విశేషమైన ప్రాముఖ్యం ఉంది. అది– 2019లో 370 అధికరణాన్ని రద్దు చేసిన తరువాత ప్రధాని మోదీ కశ్మీర్ వెళ్లడం ఇదే మొదటిసారి.

హెలికాప్టర్ నుంచి దిగగానే ప్రధాని దూరంగా కనిపిస్తున్న శ్రీపర్వతానికి చేతులు జోడించి నమస్కరించారు. అందుకు సంబంధించిన ఫోటోలను పోస్ట్ చేశారు. శంకరాచార్య పర్వతానికే గోపాద్రి, సంధిమాన పర్వతం, సులేమాన్ పర్వతం, తఖ్త్ ఇ సులామాన్ అనే పేర్లు కూడా ఉన్నాయి. ఇక్కడే కశ్మీర్‌లోనే పురాతనమైనది అనదగ్గ శివాలయం ఉంది. శివరాత్రి ముందురోజు ప్రధాని ఆ పర్వతాన్ని దర్శించుకున్నారు.

‘సంప్రదాయం ప్రకారం చూసినా, రూపురేఖలను బట్టయినా శంకరాచార్య ఆలయం కశ్మీర్‌లోనే పురాతనమైనది.’ అని అలెగ్జాండర్ కన్నింగ్‌హ్యామ్ 1848లోనే రాశాడు. కశ్మీర్ ఆలయాల శిల్పకళా వైభవం గురించి ఆయన రాసిన పుస్తకంలో ఈ అంశం పేర్కొన్నారు. ఈ ఆలయం కశ్మీర్‌లోనే ఎంతో పవిత్రమైనదిగా కూడా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ శివరాత్రిని హెరత్ పేరుతో ఘనంగా నిర్వహిస్తారు. పండుగలు, పర్వదినాలకు ఈ పర్వతం మీదకు విశేషంగా భక్తులు సుదూర ప్రాంతాల నుంచి కూడా వస్తారు.

8వ శతాబ్దానికి చెందిన తత్త్వవేత్త, అద్వైత సిద్ధాంతకర్త ఆది శంకరుల పేరుతోనే ఈ పర్వతం ప్రసిద్ధిగాంచిందని స్థానిక చరిత్రలు చెబుతున్నాయి. అప్పుడే ఆయన కశ్మీర్‌ను సందర్శించారు. హిందూధర్మాన్ని పునఃప్రతిష్ఠించడానికి శంకరులు భారతావని అంతటా పర్యటించిన సంగతి తెలిసిందే. అప్పటికే శాఖోపశాఖలుగా విడిపోయి ఉన్న అన్ని హిందూ జీవన విధానాలను, ఆలోచనలను ఆయన ఏకం చేశారు. నాటి నుంచి శ్రీపర్వతం అంటే ఆదిశంకరుల ఆలోచనలకు, బోధనలకు కేంద్రంగా

# గెలుచుకున్నాం!

వెల్లడించారు. 370 అధికరణం రద్దు తరువాత ప్రధాని మోదీ తొలిసారి అక్కడ పర్యటించారు. బక్షి మైదానంలో ఏర్పాటు చేసిన వికసిత భారత్, వికసిత కశ్మీర్ అనే అంశంతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

కశ్మీర్‌ను కేవలం ఒక భూభాగంగా మాత్రమే అధికార బీజేపీ చూడడం లేదు. జమ్ముకశ్మీర్‌ను పూర్తిగా భారత్‌లో విలీనం చేయాలని జనసంఘ్ నుంచి జాతీయవాదులు ఒక విధానంగా చూస్తున్నారు. ఆ సిద్ధాంతం నుంచి వచ్చారు కాబట్టి నరేంద్ర మోదీ కూడా జమ్ముకశ్మీర్ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. భారతదేశానికి కశ్మీర్ అంటే ఒక జ్ఞానకేంద్రం. శిరస్సు వంటిది. కశ్మీర్ తలెత్తుకుని నిలబడిందీ అంటే దేశం మొత్తం పురోగతిలో ఉందని అర్థమని మోదీ చెప్పారు. చలో ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రవాస భారతీయులు కూడా కుటుంబానికి ఐదుగురు వంతున కశ్మీర్ యాత్రకు పంపించాలని ఆయన మనవి చేశారు.

అభివృద్ధికీ, శాంతిభద్రతలకీ 370 అధికరణం అడ్డంకిగా నిలిచింది. చాలా చిత్రంగా బడుగు బలహీన వర్గాలకు, వాల్మీకులు వంటి నిమ్న కులాల వారి అభివృద్ధిని కూడా ఆ అధికరణం అడ్డుకుంటూనే ఉంది. మార్చి ఏడో తేదీన ప్రధాని రూ.5,000 కోట్ల రూపాయలతో పూర్తి చేసిన పథకాలను జాతికి అంకితం చేశారు. కొత్తగా ప్రభుత్వ కొలువులు సాధించిన వేయి మందికి నియామక పత్రాలు అందించారు.

370 అధికరణం గురించి కాంగ్రెస్ పార్టీ దశాబ్దాల పాటు దేశాన్ని మోసం చేసిందని అంటూ మోదీ చేసిన ఆరోపణ సత్యమే. కశ్మీరీల మనసు గెలవాలన్న తన ఆశయం నెరవేరిందని మోదీ ప్రకటిస్తే, తాము అధికారంలోకి వస్తే మళ్లీ 370 అధికరణాన్ని ప్రవేశపెడతామని రాహుల్ ప్రకటించడం అత్యంత హేయమే. 1948 నుంచి ఈ అధికరణంతో దేశాన్ని పెడతోవ పట్టించిన కాంగ్రెస్ ఇప్పటికీ అదే పనిలో ఉందని అర్థమవుతుంది. రాళ్లు రువ్వే యువకులు, సరిహద్దుల నుంచి కశ్మీర్‌లోయలోకి చొరబడి రక్తపాతం సృష్టించే మతోన్మాదులు, ప్రత్యేక ప్రతిపత్తి చట్టం పేరుతో లబ్ధి పొందుతున్న కుటుంబాలు అక్కడ రాజ్యమేలాయి. ఇప్పుడు వాటి ప్రాబల్యం పోయింది. రాజ్యాంగంలో కూడా 370 అధికరణం తాత్కాలిక ప్రాతిపదికపైననే పొందు పరిచారు. ఈ విషయం తెలిసి కూడా చాలా మంది బీజేపీయేతర నాయకులు దేశ ప్రజలను మోసగించారు. ఒకవైపు ఆ అధికరణాన్ని తొలగిస్తే మొత్తం భారత్ భస్మీపటలం అయిపోతుందని బెదిరించారు. ఇంకొకటి, దానిని తొలిగించడం కశ్మీరీలకు అన్యాయం చేయడమేనని బ్లాక్‌మెయిలింగ్ చేశారు. రెండూ తప్పని మోదీ ప్రభుత్వం రుజువు చేసింది. మోదీ సభకు విశేషంగా జనం హాజరయ్యారు. మోదీ చెప్పినట్టు ఆయన కశ్మీరీల హృదయాలను గెలుచుకున్నారు. ఆ సభకు వచ్చిన వారు మోదీ గురించి జాతీయ మీడియా ఎదుట వ్యక్తం చేసిన అభిప్రాయాలే ఇందుకు నిదర్శనం. ★

# అదిగో శంకరాచార్య పర్వతం!

నిలిచి ఉంది. పర్వతం మీద ఉన్న అద్భుత ఆలయాన్ని జలోకా నిర్మించాడని కన్నింగ్‌హామ్ చెబుతాడు. మౌర్య చక్రవర్తి అశోకుని కుమారుడే జలోకా. ఈ పర్వతం గురించిన లిఖిత పూర్వక ఆధారం 12వ శతాబ్దానికి చెందిన కల్హణుడి 'రాజతరంగిణి'లో కనిపిస్తుంది. ఆయన ఈ పర్వతాన్ని గోపాద్రి, గోప పర్వతం అని పేర్కొన్నాడు. గోపాదిత్య (క్రీస్తుపూర్వం 426-365) ఈ పర్వతాన్ని ఆలయం నిర్మించుకోవడానికి బ్రాహ్మణులకు దానమిచ్చాడు. ఆయన పండితులకు ఇచ్చిన భూములే తరువాత గోప అగ్రహారాలుగా ప్రసిద్ధిగాంచాయి. ఈ వివరాలు కూడా కల్హణుడు అందించినవే.

ఈ ఆలయ నిర్మాణం గురించి కొన్ని గాథలు ఉన్నాయి. మొదట ఈ ఆలయం శివుని రూపమైన జయస్థేశ్వరుని కోసం గోపాదిత్య నిర్మించాడని ఒక గాథ. తరువాత ఈ ఆలయాన్ని పలుసార్లు జీర్ణోద్ధరణ చేసినట్టు తెలుస్తున్నది. అలా జీర్ణోద్ధరణ చేపట్టిన వారిలో 8వ శతాబ్దానికి చెందిన లలితాదిత్య ఒకరు. సమీప గతంలోని గులాబ్ సింగ్ (డోగ్రా రాజవంశీకుడు) ఆ ఆలయంలోని దుర్గానాగ్ ఆలయాన్ని పునర్ నిర్మించాడు.

ఈ ఆలయానికి మైసూరు సంస్థానంతో కూడా బంధం ఉంది. వడయార్ రాజవంశీకుడు నాలుగో కృష్ణరాజ్‌వడయార్ ఆ ఆలయాన్ని అభివృద్ధి చేయించాడు. దీనికి విద్యుత్ సౌకర్యం కల్పించినవారు ఆయనేనని పండిట్ ఆనంద్ కౌల్ తన గ్రంథం 'ఆర్కియలాజికల్ రిమెయిన్స్ ఇన్ కశ్మీర్' (1935) లో ప్రస్తావించారు.

ప్రముఖ చరిత్రకారుడు, 'ఇండియా ఆఫ్టర్ గాంధీ: ది హిస్టరీ ఆఫ్ ది వరల్డ్స్ లార్జెస్ట్ డెమోక్రసి'లో విస్తుపోయే ఒక అంశం ప్రస్తావించారు. అది- కశ్మీర్‌కు మొదటి ప్రధానిగా ఎన్నికయిన షేక్ అబ్దుల్లా శంకరాచార్య పర్వతం మీది ఆలయం గురించి చేసిన ప్రస్తావన (షేక్ అబ్దుల్లా స్వతంత్ర భారత చరిత్రలో అత్యంత వివాదాస్పద కశ్మీరీ నాయకుడు. విధ్వంసకుడు కూడా). ఆ వ్యాఖ్య మద్రాస్ నుంచి వెలువడిన 'స్వతంత్ర' పత్రిక కోసం రాసిన కాలమ్‌లోనిది. ఇందులో షేక్ అబ్దుల్లా ఉత్తర దక్షిణ భారతాల ఐక్యతను ఆకాంక్షించాడు. ఆ పర్వతాన్ని ఉత్తర భారతాన్నీ దక్షిణ భారత సాగరతీరాన్నీ ఏకం చేసేదిగా పేర్కొన్నాడట.

ద్వారకా పీఠం శంకరాచార్యులు 1961లో ఈ పర్వతం మీద ఆదిశంకరుల గౌరవార్థం ఒక ప్రతిమను ప్రతిష్ఠించారు. ఈ ఆలయం ప్రస్తుతం భారత వస్తు శాఖ అధీనంలో ఉన్న ప్రముఖ రక్షిత చరిత్రాత్మక స్థలం.

శ్రీపర్వతాన్ని, దాల్ సరస్సును, జీలం నదిని ఏకకాలంలో దర్శించవచ్చు. భారతదేశానికి ప్రత్యేకమైన భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా భావిస్తూనే ప్రధాని ఎక్స్‌లో తన వ్యాఖ్యలు, ఫోటోలు ఉంచారు. సాంస్కృతికంగా, చారిత్రకంగా ఉన్న గొప్పతనాన్ని జాతికి గుర్తు చేసే ఒక ప్రయత్నం కూడా. ★



తెలంగాణ ప్రభుత్వం.. ప్రధానంగా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత కేంద్రంతో వ్యవహరించే తీరు మారిపోయింది. గడిచిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఒకరకంగా కేంద్రం సహకారం రాష్ట్రానికి ఆవశ్యకమన్న తీరులో కాంగ్రెస్ సర్కారు వ్యవహారశైలి ఉంటోంది. కేంద్ర ప్రభుత్వంతో ఏమాత్రం ఘర్షణ అవసరం లేదని, సుహృద్భావ సంబంధాలు నెలకొల్పాలన్న ఉద్దేశ్యం ప్రతిసారీ కనిపిస్తోంది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిశారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలు పటిష్టంగా ఉండేందుకు అవసరమైన స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. వాస్తవానికి తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రంతో సంబంధాల పరిస్థితి ఒకలా ఉండేది. అదే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి భిన్నంగా మారిపోయింది. ఈ అంశం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# ఘర్షణ వైఖరి

గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సీఎం కేసీఆర్ వ్యవహరించిన తీరు తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. ప్రధానమంత్రిగానీ, కేంద్రమంత్రులు గానీ రాష్ట్రంలో పర్యటించిన సమయంలో కనీస ప్రొటోకాల్ కూడా పాటించని తీరు వివాదాస్పదం కూడా అయ్యింది. ఇవ్వాల్సిన గౌరవం కూడా ఇవ్వకుండా ఒకరకంగా అవమానాల పాలు చేసిన తీరుపైనా చర్చ జరిగింది. అయినా.. కేంద్ర ప్రభుత్వం గానీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ గానీ.. ఆ అంశాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదు. తెలంగాణ అభివృద్ధి విషయంలో ఏ మాత్రం చిన్నచూపు చూసిన ఆనవాళ్లు ఎప్పుడూ కనిపించలేదు. అయితే, అధికారిక కార్యక్రమాల్లో మాత్రం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్న దూరాన్ని కేసీఆర్ మరింతగా భూతద్దంలో కనిపించేలా వ్యవహరించారు. కానీ, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ పరిస్థితి మారిపోయింది.

కేంద్రం, రాష్ట్రం మధ్య పూర్తి స్నేహపూర్వక వాతావరణం నెలకొంది. ఆ ప్రభావం ఇటీవలి కాలంగా జరుగుతున్న కార్యక్రమాలకు నిదర్శనంగా నిలుస్తోంది. అభివృద్ధి కార్యక్రమాల వేగం కూడా పెరిగింది. ప్రగతి బాట కూడా పరుగులు పెడుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటున్న ప్రతీ అధికారిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా హాజరవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై సుహృద్భావ ప్రసంగం చేస్తున్నారు. కేంద్రం మన్ననలు చూరగొంటున్నారు. ఫలితంగా తెలంగాణ రాష్ట్రానికి కూడా కేంద్రం నుంచి ఆదరణ పెరిగిపోయింది. కానీ, గత బీఆర్ఎస్ సర్కారులో మాత్రం కేసీఆర్ ఓ రకంగా అహంభావ తీరును చూపించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే అధికారిక కార్యక్రమాలలో కూడా పాల్గొనకుండా తన నిరంకుశత్వాన్ని చూపించారన్న చర్చ ప్రతిసారీ జరిగింది. ఇప్పుడు తెలంగాణలో మార్పు మొదలైందని, అది స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు కూడా చెబుతున్నారు.

రాజకీయ చతురతను, పరిణతిని చూపిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై రాజకీయాలకతీతంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన పరిణామం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రధాని నరేంద్రమోదీని పెద్దన్నయ్యగా సంబోధించారు రేవంత్‌రెడ్డి. ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన అధికారిక కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే గుజరాత్‌మోడల్‌ను అనుసరించాలని,'పెద్దన్నయ్య' మోదీ బాటలో పయనిస్తామని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే ప్రధానమంత్రి అండదండలు, కేంద్ర ప్రభుత్వం సహకారం తప్పనిసరిగా అవసరమన్న రేవంత్‌రెడ్డి.. అందుకే కేంద్ర ప్రభుత్వంతో తాము ఘర్షణపూర్వక వాతావరణాన్ని సృష్టించుకోలేమన్నారు. కేంద్రంపై పోరాడబోనని చెప్పారు. ఆదిలాబాద్‌లో 56,000 కోట్ల కంటే ఎక్కువ విలువైన 30 అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు.

"ప్రధానిగా నరేంద్ర మోదీ.. రాష్ట్రాలకు పెద్దన్న లాంటివారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుంది. కేంద్రంతో మేం ఘర్షణ పడబోం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణాత్మక వైఖరి ఉంటే అంతిమంగా ప్రజలకే నష్టం కలిగిస్తుంది. కేంద్రంతో ఘర్షణ పడితే అభివృద్ధిలో రాష్ట్రం వెనుకబడుతుంది. రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఎలాంటి భేషజాలు లేకుండా ప్రధాని, కేంద్ర మంత్రులను కలిశాం. రాజకీయాలు ఎన్నికల వరకే. ఆ తరువాత , కేంద్రంతో ఘర్షణ పడితే అభివృద్ధిలో రాష్ట్రం వెనుకబడుతుందన్న రేవంత్.. అందుకే రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఎలాంటి భేషజాలు లేకుండా ప్రధాని, కేంద్ర మంత్రులను కలిశామన్నారు.ఎన్నికల వరకే రాజకీయాలు. ఆ తరువాత విజ్ఞులైన ప్రజాప్రతినిధులు అభివృద్ధి కృషి చేయాల్సి ఉంటుంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత తొలిసారిగా రాష్ట్రానికి వచ్చినందుకు ప్రధానికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారి పట్ల తమ ప్రభుత్వం గౌరవప్రదంగా వ్యవహరిస్తుందని, ముున్ముందు కూడా కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగానే ఉంటుందని స్పష్టం చేశారు. "ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఎన్‌టీపీసీ ద్వారా పదేళ్లలో 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయాల్సి ఉండగా గత ప్రభుత్వ విధానాలతో కేవలం 1,600 మెగావాట్లకే పరిమితమైంది. మిగిలిన 2,400 మెగావాట్ల విద్యుదుత్పత్తికి మా ప్రభుత్వం



# అభిమతం కాదు

సుజాత గోపగోని, 6302164068

అన్ని విధాలుగా సహకరిస్తుంది" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రాంతంలో వెలుగులు ప్రసరించనున్నాయన్నారు.

హైదరాబాద్‌లోని కంటోన్మెంట్ ఏరియాలో రక్షణ శాఖకు చెందిన 190 ఎకరాల విలువైన స్థలాన్ని స్కైవేల కోసం ఇప్పించినందుకు, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు విషయంలో సానుకూలంగా స్పందించినందుకు ప్రధానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసీ వీరులు రాంజీ గోండ్, కుమురం భీం జన్మించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గత పాలకుల నిరాదరణతో అన్ని విధాలుగా వెనకబడిందని, తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు 180 ఎకరాల భూసేకరణకు మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించేలా ఓ మాట చెప్పాలని ప్రధానిని కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణమైతే ఆదిలాబాద్ జిల్లాలో 1.50 లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందని చెప్పారు. సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం సహకరించాలని కోరారు.

ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై సరసన హైదరాబాద్‌ను నిలిపేందుకు కూడా మీ మద్దతు కావాలని, సబర్మతి నదిని ప్రక్షాళన చేసినట్లుగా మూసీ అభివృద్ధికి సహకరించాలని ప్రధానిని రేవంత్ అభ్యర్థించారు. హైదరాబాద్ మెట్రోలైన్ విస్తరణకు దోహదపడాలని కోరారు.

పెద్దపల్లిలో ఎన్టీపీసీకి చెందిన 800 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. అల్ట్రా-సూపర్‌క్రిటికల్ టెక్నాలజీపై ఆధారపడి పని చేసే ఈ ప్రాజెక్టు తెలంగాణకు 85 శాతం విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. దేశంలోని అన్ని ఎన్టీపీసీ పవర్ స్టేషన్లలో కంటే ఇది దాదాపు 42 శాతం అత్యధిక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

**రాష్ట్ర ప్రగతికి సహకరిస్తా: ప్రధాని**

తెలంగాణ ప్రజల అభివృద్ధి కలను సాకారం చేసేందుకు కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనేక రాష్ట్రాలోని రూ. 56 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు అభివృద్ధిలో కొత్త అధ్యాయాన్ని లిఖించగలవని అన్నారు. ప్రస్తుత త్రైమాసికంలో 8.4 శాతం వృద్ధిని సాధించడం ద్వారా ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన ఏకైక దేశం భారత్ అన్నారు.

> తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే ప్రధానమంత్రి అండదండలు, కేంద్ర ప్రభుత్వం సహకారం తప్పనిసరిగా అవసర మన్న రేవంత్‌రెడ్డి.. అందుకే కేంద్ర ప్రభుత్వంతో తాము ఘర్షణపూర్వక వాతావరణాన్ని సృష్టించుకోలే మన్నారు. కేంద్రంపై పోరాడబోనని చెప్పారు. ఆదిలాబాద్‌లో 56,000 కోట్ల కంటే ఎక్కువ విలువైన 30 అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు.

ఈ వేగంతో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ధీమా వ్యక్తంచేశారు.

**మోదీ పెద్దన్న ఎలా?:బీఆర్ఎస్**

తమ పాలన కంటే మెరుగైన పరిస్థితి కనిపించడంలేదని బీఆర్ఎస్ పార్టీ వ్యాఖ్యానించింది. రేవంత్ సర్కార్ కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతను కొనసాగించడంపై బీఆర్ఎస్ నేతలు ప్రతిస్పందిస్తూ, ప్రధాని మోదీ 'పెద్దన్న' ఎలా అవుతారంటూ విమర్శల వర్షం మొదలెట్టారు. వాటికి రేవంత్ దీటుగా సమాధానం చెబుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌లా తాము మోదీ చెవిలో ఏమీ చెప్పలేదంటూ చురకలంటించారు. రాష్ట్రానికి కావాల్సిన విషయాలను మైక్‌లోనే చెప్పానని. మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన చెప్పారు. పదేళ్లలో కేసీఆర్ వందేళ్ల విధ్వంస చేశారని మండిపడ్డారు. ఆ విధ్వంసాన్ని వంద రోజుల్లో సరిదిద్దే పనిలో ఉన్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తెలిసి.. సమాచారాన్ని ధ్వంసం చేశారని, దీనిపై లీగల్ గా చర్యలు ఉంటాయని సీఎం రేవంత్ హెచ్చరించారు.

వంద రోజుల తమ పనితనంపై వచ్చే ఎన్నికల్లో తీర్పునివ్వండి అని అన్నారు. తమ పాలన మీద తమకు విశ్వాసం ఉందన్నారు. పారదర్శక పాలన అందిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌కు ప్రజలు పొలిటికల్ పనిష్మెంట్ ఇచ్చారన్నారు. విచారణ లేకుండా ఎవరికీ శిక్ష వేయలేం కదా అన్నారు. మేడిగడ్డ మరమ్మతుల గురించి కేసీఆర్, హరీశ్ రావుల వాదనలో వసలేదని ంవంత్ వ్యాఖ్యానించారు. తమ దొంగతనం కప్పిపుచ్చుకునేందుకు మరమ్మతులు చేయాలని తమ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. 'కేటీఆర్, కేసీఆర్, హరీశ్ రావులే మేడిగడ్డ దొంగలు. ఆ దొంగల సలహాలు తీసుకుని మరమ్మతులు చేపట్టాలా?' అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. మేడిగడ్డకు మరమ్మతులు అవసరమని నేషనల్ డ్యామ్స్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇస్తే అమలు చేస్తామన్నారు. కేసీఆర్ చదివింది కేవలం బీఏనే.. కానీ, పార్లమెంట్ ఎన్నికల్లో పీజీ చేసినట్లు సమాచారం ఇచ్చారని రేవంత్ సంచలన ఆరోపణలు చేశారు.

మొత్తానికి తెలంగాణ సమాజం గత కొన్నేళ్లలో చూడని పరిణామాలు చూస్తోంది. రాజకీయంగా, ప్రగతి, సంక్షేమ పథకాల పరంగా కూడా మార్పు కనిపిస్తోందన్న చర్చ జరుగుతోంది. రాజకీయాలు వేరు, రాజకీయ పార్టీలు వేరు.. ప్రభుత్వాలను నడిపించడం వేరు అన్న స్పష్టత అందరిలోనూ వస్తున్నట్లు కనిపిస్తోంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# సీసా, సారా రెండూ

**పాకిస్తాన్‌కు కొత్త అధ్యక్షుడు వచ్చారు. అసీఫ్ అలీ జర్దారీ మరొకసారి ఆ పదవిని చేపట్టారు. షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కూడా కొలువు తీరింది. రెండోసారి అధ్యక్షునిగా, ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన జర్దారీ, షెహబాజ్ భారత్ పట్ల ఎలాంటి వైఖరిని ప్రదర్శించనున్నారు? రెండు దేశాల సంబంధాల్లో సానుకూలమైన మార్పులకు అవకాశం కలుగుతుందా? సరిహద్దుల్లో అలజడి తగ్గి ప్రశాంతత నెలకొంటుందా? ఇవి ఇప్పుడు అందరిలో మెదులుతున్న ప్రశ్నలు. పాక్‌లో నాయకత్వం మార్పు పాత సీసాలో కొత్త సారా అన్న చందంగానో, లేదా కొత్త సీసాలో పాత సారా అన్నట్టో ఏ మాత్రం లేదు. సీసా, సారా రెండూ కూడా పాతవే. అందుకే భారత్-పాక్ సంబంధాలలో వెంటనే పెనుమార్పు సంభవిస్తుందని ఎవరూ భావించడం లేదు.**

భారత్‌తో సయోధ్యగా ఉండాలన్న వైఖరిని ప్రదర్శిస్తే తమకు ముదుతుందన్న నమ్మకంతోనే అక్కడి నాయకత్వం ఉందని వెంటనే తేలిపోయింది. ప్రమాణ స్వీకారం చేసిన షెహబాజ్ షరీఫ్, తొలి ప్రసంగంలోనే కశ్మీర్ అంశాన్ని లేవనెత్తి భారత్‌పై విషం చిమ్మారు. భారత ప్రభుత్వ అధీనంలో ఉన్న కశ్మీర్ భూభాగాన్ని గాజాతో పోలుస్తూ, రెండు ప్రాంతాలు స్వేచ్ఛ పొందాలన్నారు. పాకిస్తానీయులు, కశ్మీరులు స్వేచ్ఛను పొందేందుకు పాకిస్తాన్ నేషనల్ అసెంబ్లీ తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. పొరుగుదేశాలతో పాటు అన్ని ప్రధాన దేశాలతో సంబంధాలను మెరుగుపరుచుకుంటామని అంటూనే జమ్ముకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని భారత్ రద్దు చేసినా, పాక్ తన వైఖరిని మార్చుకోదని స్పష్టం చేశారు.

2030 నాటికల్లా పాకిస్తాన్ ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తానని, జీ-20లో సభ్యత్వం పొందుతామని హామీ ఇచ్చారు. కశ్మీర్‌లో జీ 20 కార్యక్రమం నిర్వహించరాదని, పాకిస్తాన్, చైనాలు గత ఏడాది ఆందోళనలు చేశాయి. ఈ దేశాలు లేకుండానే భారత్ విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసింది.

ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని తరచూ విమర్శలు చేసే గత ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో పోలిస్తే, షరీఫ్ కుటుంబం భారత్ పట్ల సానుకూల వైఖరినే ప్రదర్శిస్తాంటుంది. షెహబాజ్ ప్రమాణస్వీకారం చేసిన మరుసటి రోజే ప్రధాని నరేంద్రమోదీ సోషల్ మీడియాలో ఆయనకు అభినందనలు తెలిపారు. షెహబాజ్ సోదరుడు, మూడుసార్లు ప్రధానిగా పనిచేసిన నవాజ్ షరీఫ్ 2014లో నరేంద్రమోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకునే చర్యల్లో భాగంగా ప్రధాని మోదీ డిసెంబర్ 2015లో పాక్‌ను సందర్శించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. లాహోర్‌లో షరీఫ్ మనవరాలి వివాహానికి హాజరయ్యారు.

మోదీ మొదటి దఫా పాలనలో రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడిన వాతావరణం కనిపించింది. 2019లో భారత ప్రభుత్వం జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించటంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. భారత్ తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పాక్ అసమంజసమైన డిమాండ్ చేసింది. ఆగస్టు 2019కి ముందున్న స్థితిలో భారత్ ఉంటే తప్ప రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడే అవకాశం లేదని... ఇప్పటికిప్పుడు భారత్-పాక్ సంబంధాల్లో వచ్చి పడే పెద్ద మార్పు ఏదీ ఉండదని దౌత్యరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. 'మోదీ వైఖరి స్పష్టంగా ఉంది. పరిస్థితులు స్థిరంగా ఉండాలని కోరుతూనే ఆయన అభినందనలు పంపారు. అంతకు మించి ఇతర అంశాలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు" అంటున్నారు. తీవ్రవాదానికి సంబంధించి పాక్ నుంచి తగిన హామీ లభిస్తుందని మాత్రం భారత్ ఎదురుచూస్తోంది. పంజాబ్, కశ్మీర్ ప్రాంతంలో డ్రోన్ల రూపంలో తలెత్తుతున్న సమస్యల నేపథ్యంలో 'తక్కువ స్థాయి తీవ్రవాదం' భారత్ కోరుకుంటోంది. తీవ్రవాదం పట్ల భారత్ అనుసరిస్తున్న 'జీరో టోలరెన్స్' విధానం కారణంగా 2015 తర్వాత పాక్‌తో ఎటువంటి ద్వైపాక్షిక చర్చలకు భారత్ ఆసక్తిచూపలేదు. పైగా ఆ దేశం తీవ్రవాద కార్యకలాపాల వల్ల సార్క్‌ను పునరుద్ధరించే అవకాశం లేదని విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు కూడా. షెహబాజ్‌ను తన సోదరునితో పోలిస్తే భారత్ విషయంలో కఠిన వైఖరి తీసుకుంటారనే అభిప్రాయాలున్నాయి. ఈ రెండు దేశాలకు ప్రస్తుతం పొరుగు దేశం అంత ప్రాధాన్యమైనది కాదని దౌత్యరంగ నిపుణులు వ్యాఖ్యానించారు. భారత ప్రభుత్వం సాధారణ ఎన్నికల హడావిడిలో ఉంది. ఈ సమయంలో పాక్‌తో సంబంధాల అంశానికి అంత ప్రాధాన్యం లేదు. అలాగే పాకిస్తాన్‌కు కూడా. ఇమ్రాన్ ఖాన్, ఆఫ్ఘనిస్తాన్, యూఎస్-చైనా సంబంధాలు వంటి కీలక అంశాలు ముందున్నాయి. దాంతో రెండూ కూడా పొరుగు దేశాలతో సంబంధాలను మెరుగుపరచుకోవాలనే ఆలోచనలో లేవని వారు అభిప్రాయ పడుతున్నారు.




అసీఫ్ అలీ జర్దారీ

పాక్ 24వ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన షెహబాజ్ షరీఫ్ తండ్రి మహమ్మద్ షరీఫ్ వ్యాపారవేత్త. సోదరుడు నవాజ్ షరీఫ్ మూడుసార్లు పాక్ ప్రధానిగా పనిచేశారు. 1951 సెప్టెంబరు 23వ తేదీన జన్మించారు. 1947 విభజన సమయంలో షెహబాజ్ కుటుంబం భారత్‌లోని అమృత్‌సర్ నుంచి

# పాతవే!

లాహోర్ కి తరలింది. అక్కడి కళాశాలలో బీఏ చదువుకున్నారు. అనంతరం తన కుటుంబ వ్యాపార సంస్థలోకి ప్రవేశించారు. ఇత్తే ఫాక్ గ్రూపు పంచదార, స్టీలు, టెక్స్ టైల్ వ్యాపారాలను చేస్తుంది. జుల్ఫికర్ అలీ భుట్టో అధ్యక్షునిగా ఉన్న కాలంలో కంపెనీని నేషనలైజ్ చేశారు. దీనితో షరీఫ్ కుటుంబం తీవ్రంగా దెబ్బతింది. ఆపై షరీఫ్ కుటుంబం రాజకీయాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవటానికి సిద్ధమపడింది. 1977లో జియాఉల్ హుక్ హయాంలో కంపెనీ వారి చేతికి తిరిగొచ్చింది. 1988లోషెహబాద్



షెహబాజ్ షరీఫ్

రాజకీయ జీవితం ప్రారంభించారు. 1990లో నేషనల్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 93లో ప్రతిపక్ష నేతగా ఎన్నికయ్యారు. 2013 నుంచి 18 వరకూ పంజాబ్ ప్రావిన్స్ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. 2017లో నవాజ్ షరీఫ్‌పై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేయటంతో పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్ (పీఎంఎల్–ఎన్) పార్టీ పగ్గాలు చేపట్టారు. ఓ వైపు రాజకీయ అనుభవం, మరో వైపు వ్యాపారంలో రాణించటంతో లాహోర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి అధ్యక్షునిగా ఎన్నికై ఏడాది పాటు పనిచేశారు. 2018 నుంచి 22 వరకూ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. పాక్ రాజకీయ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబరు 2020లో షరీఫ్ ప్రతిపక్షాలన్నింటిని ఒక గొడుగు కిందకు తెచ్చారు. అన్న నవాజ్ షరీఫ్ తరపున ట్రబుల్ షూటర్ గా పనిచేశారు. జర్దారీ, అతని కుమారుడు బిల్వాల్ భుట్టో జర్దారీ, ఇతర చిన్న పార్టీలతో కలిపి పాకిస్తాన్ డెమోక్రటిక్ మువ్ మెంటు (పీడీఎం) ఏర్పాటు చేశారు. 2022 వరకూ ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వాన్ని కూల్చటానికి పీడీఎం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అనంతరం పరిణామాల్లో ఇమ్రాన్‌కు సైన్యానికి మధ్య పెరిగిన దూరం కారణంగా ప్రభుత్వం కుప్పకూలటంతో తొలిసారి షెహబాజ్ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. నేతలలో ఎవరికి ఎంత అనుభవం ఉన్నా అంతిమంగా పాక్ భవిష్యత్తును నిర్ణయించేది సైన్యమే.

పాకిస్తాన్‌లో సైన్యాధ్యక్షులు అత్యంత శక్తిమంతులుగా కనిపిస్తారు. ప్రజలు ఎన్నుకున్న ప్రధానిని ఉత్సవ విగ్రహాలుగా మారుస్తారు. కుట్రలు, కుహకాలతో పదవీచ్యుతులను చేయటం రివాజు. ఇప్పటి దాకా ఏ ఒక్క ప్రజాప్రభుత్వం కూడా తన ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తిచేయలేదంటే పరిస్థితిని సులభంగా అర్థం చేసుకోవచ్చు. కానీ సైన్యాధ్యక్షులు మాత్రం ఒకటి కంటే ఎక్కువసార్లు పదవిని అనుభవించిన సందర్భాలున్నాయి. ముగ్గురు సైన్యాధ్యక్షులు ఎనిమిదేళ్ల పాటు పాలించారు. ఇది గతం. వర్తమానంలోకి వస్తే, అత్యంత ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఈ నెల 8వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. స్వతంత్ర అభ్యర్థులు 101 సీట్లను గెలుచుకుంటే, ఇందులో 93 చోట్ల గెలుపొందిన వారు ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పీటీఐ మద్దతుదారులే. నిజానికి పాక్ ప్రజల దృష్టిలో ఇమ్రాన్ హీరో కాదు. అతని పాలనలో పాక్ అన్ని రకాలుగా దెబ్బతింది. ఆర్థిక సంక్షోభం తరుముతున్నా, ఐఎంఎఫ్‌ని సంప్రదించటానికి సిద్ధపడలేదు. ఇంధనం, నిత్యావసర ధరలు పెరుగుతున్నా, ద్రవ్యోల్బణం అధికం అవుతున్నా కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సైన్యాధ్యక్షుడి నియామకాన్ని బహిరంగంగా వ్యతిరేకించి వాళ్లకు శత్రువుగా మారారు. మరి ఇప్పుడు వచ్చిన ఫలితాలు దేనికి సంకేతం? ప్రజల దృష్టిలో ఇమ్రాన్ ఇమేజ్ పెరిగిందా? ఇమ్రాన్‌కి వ్యతిరేకంగా సైన్యం అనుసరించిన అణచివేత చర్యలకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారా? అన్న అభిప్రాయం కలుగుతుంది.

మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ (పీటీఐ)ని బలహీన పరిచేందుకు సైన్యం సర్వశక్తులు ఒడ్డింది. అవిశ్వాస తీర్మానం ద్వారా పదవీచ్యుతుడయిన ఇమ్రాన్‌ను వివిధ అవినీతి ఆరోపణలపైన జైలుపాలు చేసింది. సరిగ్గా ఎన్నికలకు ముందు మూడు కేసుల్లో 14, 10, 7 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఎన్నికలకు ఉమ్మడి గుర్తుపై పోటీ చేయటానికి అవకాశం లేకుండా చేయటంతో పీటీఐ మద్దతుదారులంతా స్వతంత్రులుగా రంగంలోకి దిగారు. 2018 ఎన్నికల్లో సైన్యానికి ప్రియుడు ఇమ్రాన్ రంగంలోకి దిగాడు. ఇప్పుడు నవాజ్ షరీఫ్‌ను అధికారపీఠం మీద



డాక్టర్ పార్థసారథి చిరువోలు

కూర్చోబెట్టటానికి ఆయన మీద ఉన్న కేసులన్నింటిని తొలగించింది.

రాజకీయ, ఆర్థిక, భద్రతాపరమైన అస్థిరత నెలకొన్న వాతావరణంలో పాక్ ఎన్నికలు సాగాయి. రెండో స్థానంలో నిలిచిన పాకిస్తాన్ ముస్లిం లీగ్(నవాజ్) 75 సీట్లను, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ 54 సీట్లను, ఎంక్యూఎం పాకిస్తాన్ 17 సీట్లను గెలుపొందాయి. 265 స్థానాలున్న పాక్ పార్లమెంటులో అధికారం చేపట్టటానికి ఏ పార్టీఅయినా 133 స్థానాలు గెలుచుకోవాలి. ఏ పార్టీకి మెజార్టీ రాని నేపథ్యంలో షెహబాజ్ షరీఫ్ నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటయింది. ఇందులో నవాజ్ పార్టీ, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ, ఎంక్యూఎమ్ తోపాటు ఇతర చిన్న పార్టీలు ఉన్నాయి.

ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు ఓటమి పాలయ్యేలా రిగ్గింగు చేపట్టామని రావల్పిండి కమిషనర్ రియాఖత్ అలీ బహిరంగంగా ప్రకటించటం సంచలనమైంది. ఓ అభ్యర్థి, తన గెలుపు రిగ్గింగ్ వల్లనే అని సంచలనాత్మక ప్రకటన చేశారు. ఇమ్రాన్ పార్టీపై పై నిషేధం విధించటంతో స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలోకి దిగిన వారిలో నయీమ్ ఉర్ రహ్మాన్ ఒకరు. తనకు 26వేల ఓట్లు వచ్చాయని, తనతో పోటీ పడిన సైఫ్ భారీకి 31వేల ఓట్లు వచ్చాయని, కానీ తర్వాత సైఫ్‌కి 11వేల ఓట్లు వచ్చినట్టు ప్రకటించారని పేర్కొన్నారు. రెహ్మాన్ ఆరోపణలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది. రిగ్గింగ్ ఆరోపణలపై వచ్చిన పిటీషన్‌ను పాక్ సుప్రీంకోర్టు కొట్టేసింది.

ఓ వైపు ఇమ్రాన్ ఖాన్ .. మరో వైపు దేశం ఆర్థిక సంక్షోభం... మూడో వైపు ఎనిమిది పార్టీల సంకీర్ణ ప్రభుత్వంతో సవాళ్లు.. వీటన్నింటి మధ్య షెహబాజ్ ఏ మేరకు నెగ్గుకొస్తారు? సైన్యం కరుణాకటాక్షాలు ఆయనపై ఎంత మేరకు ఉంటాయి అనేది వేచిచూడాలి. షెహబాజ్‌కుగల పరిమితులపైన భారత్ కు స్పష్టత ఉంది. తన భాగస్వామ్య పక్షాలను సంతృప్తి పరిచేందుకే భారత్‌ను లక్ష్యంగా చేసుకుని దురుసు వ్యాఖ్యలు చేశారనే అభిప్రాయంతో ప్రస్తుతం ఉంది. అలాగాకుండా మాటల మంటలు రాజేస్తూ కయ్యానికి కాలుదువ్వుతున్న పాక్‌పైన భారత్ వైఖరి తెలియాలంటే సార్వత్రిక ఎన్నికలు ముగిసేవరకూ ఆగవలసిందే.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**




దుష్టశక్తులపై సాధించిన విజయాలకు సంకేతంగా హోలీ పండుగను జరుపుకుంటారు. ఫాల్గుణ, చైత్ర మాసాల సంధికాలంలో వచ్చే ఈ పండుగ గురించి భవిష్య, నారద పురాణాలతో పాటు గాథాసప్తశతి, మాళవికాగ్నిమిత్రం, నాగావళి లాంటి గ్రంథాలు పేర్కొన్నాయి.దుష్ట సంహారం,వసంత రుతువు ఆగమనం నేపథ్యంలో ఆనంద చిహ్నంగా రంగులుచల్లుకుంటూ, మధుర పదార్థాలు పంచుకొంటూ ఆరగిస్తుంటారు ఫాల్గుణ పూర్ణిమ నాటి ఈ పండుగను వసంతోత్సవం, కాముడిపున్నమి, మదనోత్సవంగా ప్రాచీన గ్రంథాలు పేర్కొంటున్నాయి. వేదకాలంలో ఉగాది ఈ పున్నమి నాడే ప్రారంభమయ్యేదని చెబుతారు. అప్పట్లో నాలుగు మాసాలను ఒక రుతువుగా పరిగణించేవారట. ఆ నాలుగు నెలలను చాతుర్మాస్యం అంటారు అలాంటి మూడు మాసాలలో మొదటిది ఫాల్గుణ పున్నమి అని పెద్దలు చెబుతారు. ఇది హిందువుల పండగే అయినా సర్వ మతస్థులు ఉత్సాహంగా పాల్గొంటారు. పంజాబ్‌లో హిందువులు, సిక్కులు కలిసిపోయి హోలీ ఆడతారు.

# రంగుల కేళీ

హోలీ పండుగను యుగయుగాలుగా జరుపుకుంటున్నట్లు 'ధర్మసింధువు'లాంటి స్మృతి గ్రంథాలు చెబుతున్నాయి. తూర్పు, ఉత్తర భారత ప్రాంతాలలో ఈ రోజే వసంత రుతువు మొదలవు తుంది. వసంత రుతువు ఆగమనానికి సంకేతం హోలీ పున్నమి. రాలే ఆకులు రాలుతూ, వచ్చే ఆకులు వచ్చే వేళ, ప్రకృతిలో వ్యక్తమయ్యే నవచైతన్యానికి సంకేతంగా ఈ పండుగను భావిస్తారు. ఆధునిక కాలంలో సామాజిక సమైక్యత, సమష్టి భావనకు ప్రతీకగా నిలిచినట్లే, ఈ పండుగకు పురాణ నేపథ్యమూ ఉంది. ముఖ్యంగా, ప్రహ్లాద చరిత్ర, పూతన వధ, కాముని దహనం ఈ పండుగతో ముడిపడి ఉన్నాయని పురాణాలు చెబుతున్నాయి. హోలీ గురించి అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. ముఖ్యంగా దీని నేపథ్యాన్ని పరిశీలిస్తే శ్రీకృష్ణుడి ప్రస్తావన కనిపిస్తుంది. ఆయన గోపీగోపికలతో ఈ పండుగ ఆడాడని పురాణోక్తి. ఆయన పూతనను చంపిన సందర్భాన్ని పురస్కరించుకొని జరుపుకునే ఉత్సవంగా చెబుతారు. రక్కసి గండం నుంచి బయటపడిన ఆయనను ప్రేపల్లె మహిళలు ఊయలలో వేసి వేడుక జరుపుకోవడంతో 'డోలోత్సవం' అనే పేరు వచ్చిందని చెబుతారు. నాటి నుంచి ఆయనకు ఈ ఉత్సవం నిర్వహించి, బొబ్బట్లు నివేదిస్తారు. శ్రీకృష్ణుడితో ముడిపడిన మరో కథ ప్రకారం, 'రాధ అంత తెల్లగా ఉంటే, తాను ఇంత నల్లగా ఎందుకున్నాను' అని తల్లి యశోద వద్ద మారాం చేయగా, దాంతో ఆమె రాధ ముఖానికి రంగు పులిమి తనయుడిని ఓదార్చిందిదట ఆ కథనం ప్రకారమే, కృష్ణుడు పుట్టి పెరిగిన మధుర, బృందావనంలో ఈ పండుగను పదహారు రోజుల పాటు జరుపుకుంటారు. అయిదవ నాడు అంటే ఫాల్గుణ బహుళ పంచమి నాడు ఈ పండుగ ముగింపు సూచనగా రంగులతో 'రంగ పంచమి'ని ఘనంగా నిర్వహిస్తారు. శ్రీకృష్ణుడు మేధాసురుడు అనే రాక్షసుని సంహరించినందుకు గుర్తుగా బెంగాల్‌లో ఈ పండుగను పాటిస్తారు. పెద్ద గడ్డిబొమ్మను తయారుచేసి దహనం చేస్తారు. దీనికి దక్షిణ భారత్‌లోని కామదహన గాథ తరహాలో పోలికలు ఉంటాయి. మహారాష్ట్ర, కర్ణాటకలో భక్ష్యాలను (పోలీలు) హోలికాగ్నిలో వేసే ఆచారం ఉంది.

శ్రీకృష్ణుడు అనుసరించిన ఈ పండుగ అంతరార్థాన్ని ఆధ్యాత్మిక పరంగా విశ్లేషిస్తే.. జ్ఞానరూపమనే గులాంలతో, విజ్ఞాన (యోగ) రూపమనే కుంకుమ రంగులతో భక్తుల మనస్సులను శుద్ధి పరచి, పవిత్రులుగా చేసే యోచనతోనే ఆయన హోలీ ఆడదాని అంటారు. హస్తిన ధర్మరాజు ఏలుబడిలో ఉన్న కాలంలో ప్లేగు వ్యాధి సంభవించగా, అందుకు కారణం అడిగిన ధర్మజునితో శ్రీకృష్ణుడు, 'ఇది హోలిక అనే బ్రహ్మ రాక్షసి చర్య. అది నిద్రిస్తున్న ప్రజలను పొట్టన పెట్టుకుంటుంది' అంటూ దానిని ఎదుర్కొనేందుకు కొన్ని ప్రక్రియలు ఉపదేశించాడట. హోలీ మంటలు వేసుకోవడం అందులో ఒకటి.



ప్రహ్లాద చరిత్ర ప్రకారం, శ్రీ మహావిష్ణువుకు ఆగర్భ శత్రువైన హిరణ్య కశిపుడు, తన కుమారుడి విష్ణుభక్తిని సహించలేదు. కుమారుడిని హరి నామ స్మరణ నుంచి మళ్లించేందుకు నయనాభయానా చెప్పి చూశాడు. కఠిన దండనలు విధించాడు. కడుపుతీపిని పక్కనపెట్టి, అనుచరులతో చంపించేందుకూ యత్నించాడు. అందులో భాగంగానే తన సోదరి హోలిక ఒడిలో ప్రహ్లాదుని కూర్చోపెట్టి నిప్పు అంటించారు. హోలిక కాలి బూడిదకాగా బాల ప్రహ్లాదుడు భగవత్సహాయంతో సజీవంగా ఉన్నాడు. ఈ సంఘటన ఫాల్గుణ పూర్ణిమ నాడే జరిగింది. అలా ప్రహ్లాదుడు తనకు ఎదురైన ఎన్నో అవంతరాలను అధిగమించి, ముక్తి సోపాన మార్గంలో పురోగమించి లక్ష్య సిద్ధిని పొందాడు. హోలిక దహనమైన ఫాల్గుణ పౌర్ణమినే

శ్రీమహావిష్ణువుకు ఆగర్భ శత్రువైన హిరణ్య కశిపుడు, తన కుమారుడి విష్ణుభక్తిని సహించలేదు. కఠిన దండనలు విధించాడు. అందులో భాగంగానే తన సోదరి హోలిక ఒడిలో ప్రహ్లాదుని కూర్చోపెట్టి నిప్పు అంటించారు. హోలిక కాలి బూడిదకాగా బాల ప్రహ్లాదుడు భగవత్సహాయంతో సజీవంగా ఉన్నాడు. ఈ సంఘటన ఫాల్గుణ పూర్ణిమ నాడే జరిగింది.



# ... హోలీ

'ప్రహ్లాద పౌర్ణమి' అంటారు. రాక్షసి పీడ వదలినందుకు సంతోషంతో ప్రజలు రంగునీళ్లు (వసంతాలు) చిమ్ముకుంటూ వేడుక జరుపుకున్నారట. కృతయుగంలో 'దుందు' అనే రాక్షసి అంతం కావడంతో ప్రజలు ఆనందంగా పండుగ జరుపు కున్నారని, అది ఆనవాయితీగా మారిందని 'చండీతంత్రం' పేర్కొంటోంది.

లోకకంటకుడు తారకాసుర వధకు కుమార స్వామి జననం అనివార్యం (శివుడిని తపస్సుతో మెప్పించిన ఆ దానవుడు శివ తనయుడి వల్ల తప్ప ఇతరుల చేతిలో మరణం లేనట్లు వరం పొందాడు). అందుకు తపస్సులో ఉన్న శివుడిని చలింపచేయాలి. దానికి బ్రహ్మదేవుడు, సోదరతుల్యుడు మన్మథుని నియోగించాడు. మదనుడి



చేష్టలకు ఆగ్రహించిన ముక్కంటి ఫాలనేత్రం తెరవడంతో అతను బుగ్గి అయ్యాడు. పతి ప్రాణభిక్ష కోసం రతిదేవి విలపించగా, పునర్జీవితుడి చేశాడు శివుడు. అయితే అతను రతిదేవికి మాత్రమే కనిపిస్తూ, లోకుల హృదయాలలో ఉంటాడని వరమిచ్చాడు. ఈ సంఘటన ఫాల్గుణ పౌర్ణమి నాడు జరిగింది కనుక 'కాముని పున్నమి'; 'కామదహనోత్సం'గా ప్రాచుర్యం లోకి వచ్చింది. కాముని పున్నమి నాడు తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో పశువుల కాపరులు తమలో ఒకరికి ఎలుగుబంటి వేషం వేసి ఇళ్ల ముందు ఆడిస్తూ పాటలతో భిక్షాటన చేసేవారని తెలుస్తోంది. తమిళులు ఈ పండుగను 'కామక్ పండగై' అని, కన్నడిగులు 'కామనహబ్బ' అని వ్యవహరిస్తారు.

మన్మథునికి అనంగుడు (శరీరంలేనివాడు) అనీ మరోపేరు. ఆ రోజున కొన్ని ప్రాంతాలలో 'అనంగ వ్రతం' జరుపుకుంటారు. మీనాక్షీదేవి ఘోరతపస్సు చేసి సుందరేశ్వరుడిని పరిణయ మాడిందీ ఫాల్గుణ పౌర్ణమి నాడే. దీనిని 'కల్యాణ పౌర్ణమి'గా వ్యవహరిస్తారు. ఆ రోజున ఆదిదంపతులకు పూజాదికాలు నిర్వహించి 'హోలికా మిశ్రమం' (మామిడిపూత, వేపచిగుళ్లు, తేనె మిశ్రమం) నైవేద్యంగా సమర్పిస్తారు. పొలాల్లోని ధాన్యం, దినుసులను సేకరించి, వాటికి ఆవుపాలు జోడించి పాయసం తయారు చేస్తారు.

పండుగ నాటి వరకు మనోవైషమ్యాలు ఉన్నా, ఆ రోజు పరస్పరం రంగులు చల్లుకుంటూ 'గతం గతః' అనేలా మరచిపోవాలన్నది మరో అంతరార్థం. ఈ రంగుల పండుగా అంతర్జాతీయంగా వర్ణాలు విరజిమ్ముతోంది. అమెరికా, బ్రిటన్, కెనడా తదితర దేశాలలోని ప్రవాస భారతీయులతో పాటు ఆయా దేశస్థులను రంగులు చిమ్ముకునే పండుగ అలరిస్తోంది. ముఖ్యంగా దేవవిదేశాలలోని ఆలయాల వద్ద ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారు.

హోలీ నాడు జనావాస కూడళ్లలో పెద్ద మంటలు (భోగి మంటల మాదిరి) వేసి అగ్నికి ప్రదక్షిణ చేసి ఆ భస్మాన్ని నుదుటన ధరిస్తారు. కొన్ని ప్రాంతాలలో దీనిని 'ధూళి వందన్'గా వ్యవహరిస్తూ, దీనివల్ల ప్రతికూలశక్తులు దూరమై, సానుకూల శక్తులు సమకూరుతాయిని విశ్వాసం. జ్ఞానవిజ్ఞాన రూపములనే రంగులు మోక్షసాధనకు చక్కని మార్గాలు అని శ్రీకృష్ణ పరమాత్మ ఉపదేశించాడు. గీతాజ్ఞానమనే రంగులలో మానవులు తమ ఆత్మలను పరమాత్మంలో విలీనానికి ప్రయత్నించాలని

ఈ పండుగ నాటి వరకు మనోవైషమ్యాలు ఉన్నా, ఆ రోజు పరస్పరం రంగులు చల్లుకుంటూ 'గతం గతః' అనేలా మరచిపోవాలన్నది మరో అంతరార్థం.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి


ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు... కానీ వర్తమానంలో అలాంటి ఆధ్యాత్మక కోణానికి భిన్నంగా, కేవలం వేడుక కోసమే ఈ పండుగను జరుపుకుంటున్నారనే వ్యాఖ్యానాలు ఉన్నాయి. రంగులు చల్లుకోవడం, మద్యపానం, వేళాకోళాలు శ్రుతిమించి మాటలు ముదరడం, ఒక్కొక్కసారికి అవి ఘర్షణకు దారి తీసే సంఘటనల గురించి అక్కడక్కడ వింటూనే ఉన్నాం.

ఇక రుతువు మారే క్రమంలో చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేలా ఈ రంగులు దోహదపడతాయని పూర్వికులు భావించేవారు. అందుకు తగినట్లే సంప్రదాయబద్ధంగా వేపగింజలు, కుంకుమ, పసుపు తదితర ప్రకృతి సిద్ధ, ఆయుర్వేద



పదార్థాలతో రంగులు తయారు చేసేవారు. కాలక్రమంలో వాటి స్థానంలో పూర్తిగా రసాయనాలతో నిండిన రంగులు వాడకంలోకి వచ్చాయి. వీటిని చల్లుకోవడంలో ఆనందం, వినోదం మాట ఎలా ఉన్నా ఆరోగ్యపరంగా నష్టం వాటిల్లుతోందని. వాతావరణం కలుషితమవుతోందని నిపుణులు అంటున్నారు. ఈ రంగులలోని రసాయనాల కారణంగా చర్మవ్యాధులు, అంధత్వం, మూత్ర పిండాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సంప్రదాయకంగా వస్తున్న పండుగలను జరుపుకో వలసిందే. అదే సమయంలో పూర్వీకులు రూపొందించిన నియమాలను పాటించడం ద్వారా ఆరోగ్యాలను, పర్యావరణాన్ని కాపాడిన వారమవుతాం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



జనవరి 22,2024- భారత నాగరికత చరిత్రలో చిరస్మరణీయమైన, స్ఫూర్తిదాయకమైన రోజు. ఐదు వందల ఏళ్ల పోరాటం తరువాత అయోధ్యలో నిర్మించుకున్న భవ్య రామమందిరంలో బాలక్‌రామ్‌ను హిందూ సమాజం ప్రతిష్ఠించుకుంది. హిందువుల ఆత్మ గౌరవానికి ప్రతీకగా ఇవాళ నిలిచి ఉన్న ఆ మందిర నిర్మాణానికి నవంబర్ 9, 1989న శిలాన్యాసం (పునాదిలో తొలి ఇటుకను ప్రతిష్ఠించడం) జరిగింది. అంతటి అదృష్టం కలిగిన వ్యక్తి కామేశ్వర్ చౌపాల్. ఆయన విశ్వహిందూ పరిషత్ పూర్తి సమయం కార్యకర్త. బిహార్‌లోని మిథిలాంచల్ ప్రాంతం వారు. షెడ్యూల్డు కులానికి చెందిన వ్యక్తి. రామమందిరానికి ఆయన చేతుల మీదుగానే పునాదిరాయి పడింది. శిలాన్యాస్ జరిపేనాటికి 'బాబరీ మసీదు'గా పిలుస్తున్న కట్టడం కూలలేదు. అయినా శ్రీరాముడు జన్మించిన ఆ స్థలంలో భవ్య మందిర నిర్మాణం జరుగుతుందన్న విశ్వాసం పరిపూర్ణంగా ఉండేది. అందుకే పునాది వేశారు. ఆ మహత్కార్యానికి ఒక బడుగు బలహీన వర్గానికి చెందిన శ్రద్ధాళువు అయిన వ్యక్తితో శిలాన్యాసం జరిపించే సాహసం విశ్వహిందూ పరిషత్ చేసింది. 35 సంవత్సరాల తర్వాత అక్కడ రామ మందిర నిర్మాణం జరిగింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ బాలరాముని మూర్తికి ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. ప్రపంచం మొత్తం వీక్షించిన ఆ ప్రతిష్ఠకు గర్భగుడిలో ప్రవేశించిన ఆ కొద్దిమందిలో కామేశ్వర్ చౌపాల్ ఒకరు. ఆయన శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టులో సభ్యుడు కూడా. పుణే నుండి వెలువడే ఆంగ్ల మాసపత్రిక 'అన్‌హర్డ్ వాయిసెస్' (**Unheard Voices**) ప్రతినిధి ఈ జనవరి 22న జరిగిన ప్రాణప్రతిష్ఠకు ముందు కామేశ్వర్ చౌపాల్‌ను కలుసుకున్నారు. ఎన్నో ఆసక్తికర విషయాలు ప్రస్తావనకు వచ్చాయి. ఆ పత్రిక జనవరి సంచికలో వెలువడిన ఆ ముఖాముఖి తెలుగు అనువాదంలోని కొన్ని భాగాలు జాగృతి పాఠకుల కోసం.

# శిలాన్యాస్ నవ భా

**నవంబర్ 9, 1989 నాటి శిలాన్యాసం నవభారత ఆవిష్కరణకు నాందియని అంటున్నారు. మీరేమంటారు?**

వ్యక్తిగతంగా అది నా జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేని రోజు. నా కులం వారికీ, సమాజంలోని ఇతర జనసమూహాల వారికీ మధ్య అప్పటికి కూడా అంతరాలూ, అగాథాలూ ఉన్నాయి. అయినా మహాత్ములైన సాధుసంత్‌లు శిలాన్యాస్‌కు నన్ను ఎంపిక చేసి, నా చేతి మీదుగా ఆ పని చేయించారు. మా కులానికి గౌరవాన్ని ఆపాదించారు. ఇది శిలగా పడివున్న అహల్యలో శ్రీరామచంద్ర ప్రభువు మళ్లీ చేతనను తెచ్చిన సందర్భం వంటిది. ఇది గొప్ప సామాజిక చైతన్యానికి నాందియని, దానితో ఒక బలమైన సందేశం సమాజానికి చేరుతుందని గ్రహించాను. 'మధ్యయుగాల నాడు సమాజ జీవితంలోకి చొచ్చుకువచ్చిన కురీతులకు వ్యతిరేకంగా ఒక స్పష్టమైన వైఖరిని హిందూ సమాజం తీసుకోలేదు' అనే అభిప్రాయం బలంగా ఉంది. దేశం నలుమూలల నుండి వచ్చిన వేలాదిమంది ధర్మాచార్యులు పాల్గొన్న ధర్మసంసద్‌లో దళితులకు చెందిన వ్యక్తి ద్వారా శిలాన్యాసం జరిపించడానికి తీసుకున్న నిర్ణయం స్తబ్దంగా పడివున్న సమాజంలో నూతన చైతన్యాన్ని తేవడానికి, సమాజంలో అగాథాలను పూడ్చడానికి ఉపకరిస్తుందని తేటతెల్లమైంది. అది వెంటనే రుజువైంది కూడా. ఆ నిర్ణయం కారణంగా నేను ఉన్న విద్యార్థి వసతిగృహం నుండే డజను మంది సమాజసేవకు ఉద్యుక్తులై వచ్చారు. నాతోసహా వారంతా ఇప్పటికీ పనిచేస్తు న్నారు. హిందూ సమాజంలో వివక్ష, భేదభావాలూ లేవని సాధుసంత్‌లు ప్రకటించాలని డా॥బాబాసాహెబ్ అంబేద్కర్ ఆకాంక్షించారు. విశ్వహిందూ పరిషత్ తీసుకున్న ఇలాంటి నిర్ణయాన్ని ఆనాడే ప్రకటించి ఉంటే, దురదృష్టకరమైన ఎన్నో ఘటనలు జరిగేవి కావు. హిందువులలో ఎవరూ తక్కువవారు కాదని (మమ మంత్ర స్వమానతా) ధర్మసంసద్ ప్రకటించింది. సాధుసంతులు దానిని ఘోషించారు. హిందవః సోదరాస్సర్వే (హిందువులందరూ సమానులే) అన్న సందేశం ఇప్పుడు వేగంగా వ్యాపిస్తున్నది. నిజాయితీతో కూడిన ఈ ప్రయత్నాలలో నుండి వేల సంవత్సరాల ఘర్షణల ఫలితంగా సమాజంలో ఏర్పడిన పగుళ్లను సరిచేసుకుంటూ దృఢమైన సమాజాన్ని రూపొందించుకోగలం.

**శిలాన్యాస్ అవకాశం వచ్చినప్పుడు మీ కుటుంబం, బంధువులు, స్నేహితులు ఎలా స్పందించారు?**

నా స్నేహితులు ఎప్పుడూ సానుకూలమే. కానీ సమాజం కూడా సానుకూలంగా స్పందించడమే కొత్త అనుభవం. సమాజంలోని సంపన్నులు, పలుకుబడి గలవారు, విద్యావంతులు మాకు దూరంగా ఉండేవారు. అది మాకు దుర్భరంగా ఉండేది. శిలాన్యాస్ తరువాత నేను ఇంటికి చేరాక మా గ్రామానికి చెందిన ముఖియా బలదేవ్ ఝా తన ఇంటికి పిలిచారు. 'పెద్దవారు పిలిచారు, కాబట్టి వెళ్లాల'ని మా నాన్న సూచించారు. వారు నన్ను ఎలా

# రతానికి పునాది

## తొలి ఇటుక వేసిన దళిత కార్యకర్త అనుభవపూర్వక విశ్వాసం

చూస్తారు? ఎక్కడ కూర్చోమంటారు? చాలా సందేహాలు ముసిరాయి. అప్పటివరకు పెద్దలతో కలిసి కూర్చోడమనేది లేదు. వారు కుర్చీలలో, మేము నేలమీద. ఇదే ఆనవాయితీ. అయితే నేను బలదేవ్‌బాబు ఇంటికి వెళ్లగానే ఆయనే లేచి వచ్చి పలకరించారు. తాను కూర్చునే చోటుకు నన్ను తీసుకొని వెళ్లి ఒక కుర్చీలో కూర్చోబెట్టారు. పిల్లలందరినీ పిలిచి, నేను వాళ్లకంటే పెద్దవాడిని కాబట్టి, వారికి అన్నలాంటివాడినని చెపుతూ నా పాదాలకు నమస్కరింపజేశారు. నాకు చాయ్ తెప్పించి ఇచ్చారు. తరువాత ఆ కప్పును ఎక్కడ కడగాలా అని ఆలోచిస్తూ చాయ్ తాగాను. కానీ నేను తాగడం పూర్తి చేశాక ఖాళీ కప్పును ఆయనే చేతిలోకి తీసుకున్నారు. మేమిద్దరమూ పరమానంద భరితులమైన క్షణాలవి. అంతకుముందెన్నడూ నాకు అలాంటి అనుభవం లేదు. మా గ్రామంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని ఆ క్షణాన నేను గ్రహించాను. ఇప్పుడు మా గ్రామంలో అన్నిరకాల కార్యక్రమాలలో అందరూ కలసిమెలిసి పాల్గొంటారు. కలిసి భోజనం చేస్తారు. అంతరాలను చూసేవారు ఎవరైనా ఉంటే, గ్రామమంతా వారిని అసహ్యించుకొంటున్నది.

యావత్తు సమాజాన్ని మార్చివేసే శక్తి కలిగిన నిర్ణయాన్ని సాధుసంతులు తీసుకున్నారని గ్రహించాను. మా పరిసర గ్రామాల్లో సోషలిస్టులు చాలా ఎక్కువ. కాని, శుభకార్యాలన్నీ బ్రాహ్మణుల ద్వారానే జరిగేవి. నాద్వారా శిలాన్యాసం జరిపించాలని సాధుసంతులు నిర్ణయించి, జరిపించారని తెలిసినప్పుడు వారి ముఖాలు వెలవెలబోయాయి. ఇప్పుడు కులతత్వం తగ్గి, అన్ని స్థాయిల వారిలోనూ హిందుత్వ భావన ప్రస్ఫుటమవుతున్నది.

**మీ అనుభవాల మేరకు - మీరు శిలాన్యాసం చేయడానికి ముందు మన సమాజ మానసిక స్థితి ఎలా ఉండేదంటారు?**

మా పట్ల వివక్ష ఉండేది. పెద్ద కులాలవారితో కలసిమెలసి ఉండేందుకు, కలిసి భోంచేయడానికి అనుమతి ఉండేది కాదు. బడిలో నాకెదురైన అనుభవం చెప్తాను. పిల్లలను తప్పక చదివించాలనే ధ్యాస తల్లిదండ్రులకు ఉండేదికాదు. పిల్లలని బడిలో చేర్పడానికి ఉపాధ్యాయుడు చాలా శ్రమపడవలసి వచ్చేది. సమీప గ్రామాలకు వెళ్లి తల్లిదండ్రులకు నచ్చచెప్పి చేర్చుకొనేవాడు. అలా ఉపాధ్యాయునితో



వెళ్లిన మేము ఒక రాత్రి ఆ గ్రామంలోనే ఉండి పోవలసి వచ్చింది. ఆ ఇంటి యజమాని చిన్న గొంతుతో మా ఉపాధ్యాయుడిని అడిగాడు, 'వీరందరూ ఏయే కులాలవాళ్లు?' అని. నా సంగతి తెలిసినప్పుడు, ఆయన ముఖం వివర్ణమైంది. దగ్గరలో ఉన్న దళితుల బస్తీకి పంపించి, అక్కడి నుండి ఒక కంచం తెప్పించాడు. నేను గుమ్మం దగ్గర క్రింద కూర్చొని తినవలసి వచ్చింది. మా ఉపాధ్యాయుడూ, మిగిలిన విద్యార్థులూ లోపల భోంచేశారు. అయితే అలాంటివి నేను చూడడం, వినడం అదే ఆఖరు.

**మీ కుటుంబ నేపథ్యం, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్‌తో మీ తొలి పరిచయం వివరిస్తారా?**

నేను పుట్టింది భాగల్పూరు జిల్లాలో. ఈ మధ్య ఆ జిల్లాను పునర్వ్యవస్థీకరించగా, మా గ్రామం సుపాల్ జిల్లాలోకి వచ్చింది. మా గ్రామం 'బిహారు దుఃఖదాయిని' కోసీ నదికి దగ్గరగా ఉంది. తరచు వరదలు. చదువుకొనే ఏర్పాట్లేవీ లేవు. మా చిన్నప్పుడే మా నాన్న 8వ తరగతి ఉత్తీర్ణుడైన ఒక ఉపాధ్యాయుని తీసికొచ్చి బడి మొదలుపెట్టించాడు. పాఠశాల చదువు పూర్తయిన తర్వాత నేను దగ్గరలో ఉన్న పెద్ద గ్రామంలో బంధువుల ఇంట్లో ఉండి చదువు కొనసాగించాను. కొన్నాళ్ల తర్వాత ఒక ఉపాధ్యాయుడు నలుగురైదుగురు విద్యార్థులకు తన ఇంటిలోనే వసతి కల్పించగా, నేనూ అక్కడే చేరాను.

ఆయన విశాల హృదయుడు. అక్కడ నాకు ఏ విధమైన సమస్యలూ ఎదురుకాలేదు. ఆ తర్వాత కొన్నాళ్లకు హృదయ్ నారాయణ్ యాదవ్ అనే ఉపాధ్యాయుడు మా పాఠశాలలో పని చేయడానికి వచ్చాడు. ఆయన కాంగ్రెసుపార్టీ కార్యకలాపాలలోను, ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలలోనూ చురుకుగా పాల్గొంటూ ఉండేవాడు. ఆయనతోపాటు మేము నలుగురైదు గురం శాఖలో పాల్గొనేవాళ్లం. ఆయన ద్వారానే సంఘం మాకు పరిచయమైంది. నేను మెట్రిక్యులేషన్ పాసయినప్పుడు చదువు ఆపకుండా, కొనసాగించాలని చెపుతూ, ఒక ఉత్తరమిచ్చి మధుబనిలోని ఓ పెద్దాయన దగ్గరకు పంపించాడు. ఆయన నన్ను కాలేజీలో చేర్పించటమే కాక, హాస్టల్‌లోనూ చేర్పించారు. హృదయ నారాయణ బాబు తరచుగా హాస్టల్‌కి వచ్చి కలుస్తుండేవారు. ఒక క్రమపద్ధతిలో సమావేశాలు జరుగుతుండేవి. ఆ రోజుల్లో ఎమర్జన్సీకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కూడా నేను పాల్గొన్నాను.

ఎమర్జన్సీ తొలగించిన తర్వాత సంఘశిక్షా వర్గలో శిక్షణ పొంది తాలూకా ప్రచారక్‌గా, జిల్లా ప్రచారక్‌గా పనిచేశాను. 1980లో నన్ను విశ్వ హిందూ పరిషత్‌లో పనిచేయమన్నారు. వివిధ స్థాయిల్లో పనిచేస్తూ ప్రదేశ్ సంఘటన మంత్రి వరకు వచ్చాను.

శిలాన్యాసం తర్వాత రాజకీయ క్షేత్రంలో పనిచేయమన్నారు. 12-13 సంవత్సరాలు రాజకీయ క్షేత్రంలో ఉన్నాను. ఆ సమయంలో కూడా రామజన్మభూమి విముక్తి ఉద్యమంలోనూ ఉన్నాను. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూపరిషత్‌లలోనూ చురుకుగా ఉన్నాను. విశ్వహిందూ పరిషత్ కేంద్ర నాయకత్వంతో సన్నిహితంగా ఉన్నాను. వారిచ్చిన ప్రేరణ, ప్రోత్సాహాలతోనే ఇతర రంగాలలోనూ చురుకుగా పనిచేయగలిగినాను.



నిధి సమర్పణ ఉద్యమం నడిపించినప్పుడు నేను కూడా బిహారులోని కొన్ని గ్రామాలకు వెళ్లాను. కటిక పేదరికంలో నివసిస్తున్నవారి గూడేలకూ వెళ్లాం. మందిర నిధి గురించి వస్తున్నామని తెలిసిన ప్రజలు వీథులలో కళ్లాపి చల్లి, తోరణాలు కట్టి మమ్మల్ని ఆహ్వానించారు. వారందరూ ఆనందపరవశులయ్యారు. ఒక స్త్రీ రూ.100 రూపాయలు సమర్పించింది. ఆమె భర్త రూ.1000 సమర్పించాడు. అది కూడా ఎవరి దగ్గరో అప్పుగా తెచ్చి ఇచ్చాడు. మొత్తం 1100 రూపాయలు స్వీకరించాలని పట్టుబట్టాడు. శబరిమాతను పోలినవారు ఇప్పటికీ చాలామంది ఉన్నారని నాకు అర్థమైంది.

**రామజన్మభూమి ఉద్యమం రాజకీయమైనదనే విమర్శ ఉంది. దీనిలో సామాజిక పరివర్తనతో ముడిపడిన అంశాలేమైనా కనిపించాయా?**

వాస్తవమేమిటంటే, శ్రీరామునిపట్ల, ఆయన భక్తులపట్ల వ్యతిరేక భావాలున్నవారే మమ్ములను వ్యతిరేకిస్తున్నారు. శ్రీరాముడు చారిత్రక పురుషుడు, ఈ భూమిపై నడిచినవాడు అనే వాస్తవాన్ని కూడా అంగీకరించడానికి వారు ఇష్టపడరు. రాముడు, రామాయణం అంతా కట్టుకథేనని వాదిస్తారు. కాబట్టి రాముని పేర జరుగుతున్న ఉద్యమం కారణంగా సమాజంలో గొప్ప పరివర్తన వస్తున్నదనే వాస్తవాన్ని ఎలా అంగీకరించగలరు? అయితే వస్తున్న మార్పు వారికి తెలియకుండా లేదు. ఉత్తరప్రదేశ్‌లో, బిహార్‌లో కులతత్వం బాగా తగ్గిపోయింది. కులవిద్వేషాలపై ఆధారపడిన రాజకీయాలు వెనుకబడ్డాయి. కులాల మధ్య హత్యలూ, కొట్లాటలూ తగ్గుముఖం పట్టాయి. నగరాలలోను, గ్రామాలలోనూ షెడ్యుల్డు కులాలవారు, వెనుకబడినవర్గాల వారు, అగ్రవర్ణాలవారూ శ్రీరాముని పేర జరుగుతున్న ఉద్యమంలో భాగస్వాములవుతున్నారు. కులం కేంద్రబిందువుగా నడిపించజూసే తమ రాజకీయాలు సాగకపోవటంతో వారు కోపోద్రిక్తులవుతున్నారు. బిహారులోనైతే వారు మూడవ స్థానానికో, నాల్గవ స్థానానికో పరిమితమవుతున్నారు. రామచంద్ర ప్రభువు ఉద్యమం జనులలో జాతీయభావనను జాగరితం చేస్తున్నది. దేశభక్తి, హిందుత్వ భావనలు వెల్లివిరుస్తున్నవి.

**మీరు రాజకీయకోణం నుండి వివరిస్తున్నారు. సమాజంలో ఉన్న స్థితి ఏమిటో మీ అనుభవం ద్వారా చెప్పండి!**

రాజకీయాలకు అతీతమైన పరివర్తన గురించే నేను చెపుతున్నాను. అయోధ్యలో మూలవిరాట్ మూర్తిని రూపొందించడానికి నేపాల్ నుండి ఒక నల్లరాయిని తీసుకొనివచ్చాం. ఈ కార్యక్రమంలో నేనూ ఉన్నాను. దాని గురించి బ్యానర్లు, పోస్టర్లు, మైక్‌లో ప్రకటనలూ ఏమీ లేవు. అయినా జనక్‌పూర్ నుండి అయోధ్య వరకు దారిపొడవునా, అన్ని వయసులవారు, స్త్రీలు, పురుషులు గంటల తరబడి వేచి ఉండి ఆ పవిత్ర శిలను దర్శించారు. శ్రీరాముని పట్ల భక్తి కులం, ప్రాంతం, భాషా విభేదాలకతీతంగా ప్రజలను సమైక్యపరుస్తున్నది. ఆ దారిలో బిహారులో ఉన్న మొదటి గ్రామం కమ్యునిస్టుల ప్రభావంలో ఉన్నదిగాను, బడుగు వర్గాలు ఎక్కువ ఉన్నదిగాను ప్రసిద్ధి చెందింది. ఆ గ్రామాన్ని చూసి ఆశ్చర్య పోయాం. వీథులన్నీ పరిశుభ్రం చేసి, కళ్లాపి చల్లారు. తోరణాలు, పూలదండలూ కట్టి ఉన్నాయి. ఆ దృశ్యాన్ని చూసిన పత్రికా ప్రతినిధులకు కూడా ఆనందబాష్పాలు వచ్చాయి. విగ్రహ రూపం దాల్చబోయే ఒక నల్లరాయిని చూడడానికే ప్రజలలో ఇంత బలీయమైన శ్రద్ధ, ఆకాంక్ష ఉన్నదంటే, అది ప్రజలను ఏకం చేస్తున్నదంటే, శ్రీరామకార్యం ప్రజలను ఎంతగా ఉద్విగ్నులను చేస్తున్నదో ఊహించుకోవలసిందే. ఇందులో రాజకీయ మేమున్నది?

**అసమానతలను, భేదభావాలనూ రామజన్మ భూమి ఉద్యమం తగ్గిస్తున్నదని మీరంటున్నారు. ఇది కేవలం పైకి ప్రదర్శించడానికే ఉద్దేశించినదని, మౌలికంగా మార్పేమీ లేదని కొందరంటున్నారు.**

కులాలను ఆధారం చేసుకొని ప్రజలను విడగొట్టాలనే తమ కుట్రలు, కుతంత్రాలు విఫల మవుతున్నందుకు గుండెల్లో రాయి పడినవారే ఇటువంటి సందేహాలను లేవదీస్తారు. జనకపూర్ నుండి అయోధ్య వరకు సాగిన యాత్రలో పాల్గొనిన బ్రాహ్మణుల సంఖ్య చాలా స్వల్పం. బడుగువర్గాల వారు, వెనుకబడిన వర్గాలవారు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. శ్రీరామచంద్రుడు తన జీవితకాలంలో సమాజంలోని వివిధ స్థాయిలవారిని దగ్గరికి తీసుకున్నాడు. ఉద్యమం కారణంగా ఇప్పుడు కూడా అదే జరుగుతున్నది. అందరూ ఒకచోటకు వస్తున్నారు. భజనలు చేస్తున్నారు. ప్రసాదం స్వీకరిస్తున్నారు. భుజం భుజం కలిపి పనిచేస్తున్నారు. శబరి వంటి వృద్ధ స్త్రీ సహాయంతో, వానరుల సహాయంతో ఆ కాలంలోని అతిపెద్ద టెర్రరిస్టు అయిన రావణాసురుని చెరనుండి సీతాదేవిని విడిపించాడు రాముడు. ఇప్పుడు కూడా అదేవిధంగా అణగారిన వర్గాలకు చెందిన ప్రజలు శ్రీరాముని వారసత్వాన్ని గుర్తుచేసుకొంటూ రామరాజ్యాన్ని మరల ప్రతిష్ఠించుకోగలమన్న విశ్వాసాన్ని పెంచుకొంటున్నారు.

**శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టులో ట్రస్టీగా మీ అనుభవాలు చెప్పండి. ఈ వాతావరణాన్ని ఇకముందు కూడా నిలుపుకోగలమనుకొంటున్నారా?**

మందిర నిర్మాణంలో ఉన్నవారు ఎక్కువగా వెనుకబడిన వర్గాలవారే. అంతా రాముని పట్ల ఎంతో భక్తి ఉన్నవారు. తమ హృదయాలలో నిరంతరం ధ్యానిస్తున్నవారు రాముని ఆదర్శాలనూ పాటించాలనుకొంటారు.

నిధి సమర్పణ ఉద్యమం నడిపించినప్పుడు నేను కూడా బిహారులోని కొన్ని గ్రామాలకు వెళ్లాను. కటిక పేదరికంలో నివసిస్తున్నవారి గూడేలకూ వెళ్లాం. మందిర నిధి గురించి వస్తున్నామని తెలిసిన ప్రజలు వీథులలో కళ్లాపి చల్లి,తోరణాలు కట్టి మమ్మల్ని ఆహ్వానించారు. వారందరూ ఆనందపరవశులయ్యారు. ఒక స్త్రీ రూ. 100రూపాయలు సమర్పించింది. ఆమె భర్త రూ. 1000 సమర్పించాడు. అది కూడా ఎవరి దగ్గరో అప్పుగా తెచ్చిచ్చాడు. మొత్తం1100 రూ.లు స్వీకరించాలని పట్టుబట్టాడు. శబరిమాతను పోలినవారు ఇప్పటికీ చాలామంది ఉన్నారని నాకు అర్థమైంది. శ్రీరామచంద్ర ప్రభువు పేరున జరుగుతున్న ఈ ఉద్యమంతో సమాజ జీవితంలో అద్భుత మైన పరివర్తన వస్తుంది. సందేహమే లేదు.

– 'ఎస్.సి., ఎస్.టి. హక్కుల సంక్షేమ వేదిక' నుండి



# చమురు రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్'

అండమాన్స్‌లో

**ప్రపంచ రాజకీయ పరిణామాలు శరవేగంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా జనవరిలో జర్మనీకి చెందిన 'బిల్ట్' దినపత్రిక తాను సేకరించిన దేశ రక్షణరంగ రహస్య పత్రాల ఆధారంగా, వచ్చే ఏడాది మూడో ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని ఒక కథనాన్ని ప్రచురించింది. అదే నిజమైతే ప్రపంచం మరో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనక తప్పదు. ముఖ్యంగా చమురు– సహజవాయు పరంగా ప్రపంచం అతలాకుతలమయ్యే ప్రమాదం పొంచిఉంది. ఇదే నిజమైతే ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారైన భారత్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. రష్యా– ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఏర్పడిన ఇంధన సంక్షోభంలో యూరప్ దేశాలు ఎంతగా విలవిలలాడు తున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. ఈ యుద్ధం నేపథ్యంలో మనదేశం ఆత్మవిశ్వాసంతో మెలిగి ఆంక్షలను ఖాతరు చేయకపోయినా అమెరికా నేతృత్వంలోని దేశాలు మనల్ని ఏమీ చేయలేక పోయాయి. ఫలితంగా చమురు సంక్షోభం బారిన పడకుండా బయటపడ్డాం. కానీ ఒకవేళ మూడో ప్రపంచ యుద్ధం వస్తే పరిణామాలు దారుణంగా ఉంటాయి. అప్పుడు ఇంధనపరంగా అన్ని దేశాల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించలేం. ఒకరకంగా ప్రపంచమే స్తంభించిపోవచ్చు.**

మనదేశం విషయానికి వస్తే గత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా మన మొత్తం అవసరాల్లో కేవలం 17.9 శాతం చమురు ఉత్పత్తి జరిగింది. అంటే ఇది కేవలం 1/5శాతం అవసరాలను తీర్చగలదు. 80శాతం పైగా ఇంకా విదేశీ చమురు పైనే ఆధారపడుతున్నాం. ఈ పరిస్థితి భయపెడుతున్న తరుణంలో చమురు– సహజ వాయుపరంగా 'ఆత్మనిర్భర్ భారత్' దిశలో పరిణామాలు సంభవిస్తుండటం ఒక గొప్ప సానుకూల పరిణామం. అదీ కాకుండా రాబోయే దశాబ్దకాలంలో దేశంలో పెట్రో కెమికల్స్ డిమాండ్ ఏటా 8% చొప్పున పెరుగుతుందని అంచనా. ఈ నేపథ్యంలో ఇటీవల దేశంలో చమురు రంగంలో స్వయంసమృద్ధి సాధనగా రెండు కీలక ముందడుగులు పడటం విశేషం. వీటిల్లో ఒకటి కాకినాడ బేసిన్ వద్ద చోటుచేసుకోగా మరోటి అండమాన్ నికోబార్ దీవుల్లో చమురు ఉత్పత్తికి మార్గం సుగమం కావడం. ఈ రెండూ పూర్తిస్థాయికి చేరుకుంటే, దేశం మరో 70 ఏళ్ల వరకు మరే ఇతర దేశంపై చమురుకోసం ఆధారపడాల్సిన అవసరం ఉండదు!



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

**కాకినాడలో కీలక మైలురాయి**

ఇంధన ఉత్పత్తి రంగంలో ఒక కీలక మైలురాయిని దాటామంటూ ఈ ఏడాది జనవరి 7న ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ ఆఫ్ ఇండియా (ఓఎన్‌జీసీ) చేసిన ప్రకటన 'ఆత్మనిర్భర్ భారత్'పై అవగాహన ఉన్న వారిలో ఎంతో ఆసక్తిని, సంతోషాన్ని కలుగజేస్తుందనడంలో ఎంతమాత్రం సందేహంలేదు. ఈ ఘనత సాధించడానికి ఆంధ్రప్రదేశ్ వేదిక కావడం తెలుగువారికి ఎంతో ఆనందం కలిగించే అంశం. కృష్ణా–గోదావరి బేసిన్ (కేజీ బేసిన్)లో ఆంధ్రప్రదేశ్ తీరానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న "కేజీ–డిడబ్ల్యుఎన్–98/2" బ్లాక్‌కు చెందిన 'ఎం' చమురు క్షేత్రంనుంచి చమురు ఉత్పత్తి ప్రారంభించామన్నది ఆ ప్రకటన సారాంశం. "కేజీ–డిడబ్ల్యు ఎన్–98/2" బ్లాక్‌కు మరో ప్రత్యేకత కూడా ఉంది. దేశంలో ఓఎన్‌జీసీ డీప్‌వాటర్ డ్రిల్లింగ్ చేస్తున్న మొట్టమొదటి క్షేత్రం ఇది. ఇక్కడ ఓఎన్‌జీసీ డీప్‌వాటర్ నుంచి ఉత్పత్తి చేసిన క్రూడాయిల్‌ను స్వర్ణసింధు పేరుగల కంటైనర్‌లో సంస్థ రిఫైనరీకి

తరలించారు. ఈ కంటైనర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ మార్చి 2న బిహార్‌లోని బిగుసరాయ్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈవిధంగా కేజీ బేసిన్‌లో ఒక చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. కేంద్ర ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తున్న 'ఆత్మనిర్భర్ భారత్' సాధనలో ఇదొక కీలక ముందడుగుగా చెప్పకతప్పదు. ఈ బ్లాక్‌కు చెందిన రెండో దశ ప్రాజెక్టు దాదాపు పూర్తయ్యే దశలో ఉంది. ఇది ఈ ఏడాది మధ్యనాటికి ఉత్పత్తి ప్రారంభించే అవకాశాలున్నాయి. మొదట్లో దీన్ని కైరాన్ ఎనర్జీ సంస్థ తీసుకున్నప్పటికీ తర్వాత దీన్ని పూర్తిగా ఓఎన్‌జీసీ సొంతం చేసుకుంది. ఈ క్షేత్రం నుంచి ఉత్పత్తి ప్రారంభం కావడంతో, ఓఎన్‌జీసీ చమురు- సహజవాయు ఉత్పత్తి సామర్థ్యం ఏకంగా 11%- 15% పెరిగింది. ఈ బ్లాక్ నుంచి గరిష్ఠ స్థాయిలో చమురు ఉత్పత్తి జరిగినప్పుడు ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న మొత్తం చమురుకు అదనంగా మరో 7% చమురును ఈ క్షేత్రం అందించగలగుతుంది. సాంకేతికంగా ఇది అత్యంత సంక్లిష్టమైన ప్రాజెక్టుగా కేజీ-డిడబ్ల్యుఎన్ -98/2 క్షేత్రాన్ని పేర్కొంటున్న ఓఎన్‌జీసీ దీన్ని రూ.41వేల కోట్ల వ్యయంతో నిర్మించింది. ఈ క్షేత్రం గరిష్ఠ ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకున్నప్పుడు రోజుకు 10 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లు లేదా రోజుకు 45వేల బ్యారళ్ల చమురు ఉత్పత్తి అవుతుంది. ఓఎన్‌జీసీ ఈ బేసిన్‌లో చమురు ఉత్పత్తిని ఈ ఏడాది జనవరిలో ప్రారంభించింది. ఈ క్షేత్రం నుంచి ప్రస్తుతం రోజుకు 12 వేల నుంచి 12500 బ్యారళ్ల వరకు చమురు ఉత్పత్తి అవుతోంది. నిజానికి 50 వేల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కృష్ణా-గోదావరి బేసిన్ దేశంలోనే అతిపెద్దది మాత్రమే కాదు ఇక్కడ దేశంలో అత్యధిక శాతం గ్యాస్ లభిస్తుందని అంచనా. ఓఎన్‌జీసీ, రిలయన్స్ సంస్థలు ఇక్కడ చమురు తవ్వకాలు జరుపుతున్నాయి. మొదట్లో 'కేజీ-డిడబ్ల్యుఎన్-98/2' నుంచి ఉత్పత్తి అయ్యే చమురు చాలా మడ్డిగా ఉండటం వల్ల సమస్యలు ఎదురయ్యాయి. దీంతో దేశీయంగా అభివృద్ధి చేసిన 'పైప్ టు పైప్' సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఓఎన్‌జీసీ ఈ సమస్యను అధిగమించింది. కాగా ఈ విజయంతో డీప్‌వాటర్ చమురు అన్వేషణలో భారత్ కీలక అడుగు వేసినట్లయింది. ఓఎన్‌జీసీ ప్రస్తుతం దేశీయంగా చేస్తున్న చమురు ఉత్పత్తి వల్ల ఏటా దాదాపు రూ.11వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం పొదుపు అవుతుందని అంచనా. అంతేకాదు కాకినాడ వద్ద ఉత్పత్తి అయ్యే ఆయిల్ దేశ అవసరాల్లో 15శాతం వరకు తీర్చగలుగుతుందని కూడా చెబుతున్నారు.

**స్వర్ణసింధు**

స్వర్ణసింధు క్రూడాయిల్ కంటైనర్ (భారత్‌లో ఇది మొట్టమొదటిది)ను ఒక ఆయిల్ ట్యాంకర్‌గా వాడతారు. ఇందులో కాకినాడ బేసిన్‌లో ఉత్పత్తి అయిన క్రూడాయిల్‌ను నింపి, ఓఎన్‌జీసీకి చెందిన ఒక రిఫైనరీకి పంపారు. డీప్‌వాటర్ డ్రిల్లింగ్ ద్వారా దేశీయంగా తొలిసారి ఉత్పత్తిచేసిన ముడిచమురును రిఫైనరీకి తీసుకెళ్లిన మొదటి కంటైనర్‌గా స్వర్ణసింధు చరిత్ర సృష్టించింది. ఇదిలావుండగా స్టోరేజ్ ఆఫ్‌లోడింగ్ ఫెసిలిటీస్ కాకినాడ వద్ద మాత్రమే ఉండటం విశేషం. ఇవి ఆసియాలో మరెక్కడా ఎక్కడా లేవు.

**ఆర్మడా స్టెర్లింగ్-5**

షాపూర్‌జీ పల్లోన్‌జీ ఎనర్జీ (ఎస్‌పీ ఎనర్జీ)సంస్థకు చెందిన 'అర్మడా స్టెర్లింగ్-5' అనే పేరుగల ఫ్లోటింగ్ ప్రొడక్షన్ స్టోరేజ్ అండ్ ఆఫ్‌లోడింగ్ (ఎఫ్‌పీఎస్‌ఓ) వెజల్, భారత ప్రభుత్వ సంస్థ ఒ.ఎన్.జి.సి.కోసం పనిచేస్తున్నది. ఈ ఎఫ్‌పీఎస్‌ఓలో, ఎస్.పి. ఎనర్జీకి




(70%), మలేసియాకు చెందిన బుమి అర్మడా (30%)కు వాటాలున్నాయి. అంటే ఇది ఈ రెండు సంస్థల జాయింట్ వెంచర్. ఇది షాపూర్‌జీ పల్లోన్‌జీకి చెందిన నాలుగో ఫ్లోటింగ్ నౌక కాగా భారతీయ జలాల్లో పనిచేసే మూడోది. తుపానులను కూడా తట్టుకొనే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పల్లోన్‌జీ సంస్థ ఈ ఎఫ్‌పీఎస్‌ఓను రూపొందించింది. ఇది భారత ఉపఖండంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ ఇన్‌స్టాలేషన్ కావడం విశేషం. డ్రిల్లింగ్ చేసిన చమురును ఎఫ్‌పీఎస్‌ఓలో నిల్వచేస్తారు. ఈ నిల్వ ఒకదశకు వచ్చిన తర్వాత నౌకలోకి చమురును బదిలీచేసి రిఫైనింగ్‌కు తరలిస్తారు. ఈ ఎఫ్‌పీఎస్‌ఓ మొట్ట మొదటిసారి చమురును ఈ ఏడాది జనవరి 7న వెలికితీసింది. ఇది రోజుకు 50వేల బ్యారళ్ల చమురు ప్రాసెసింగ్ చేయగలదు. అదేవిధంగా 3 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజ వాయువును ప్రాసెస్ చేయగలదు. దీని నిల్వ సామర్థ్యం 7లక్షల బ్యారళ్లు.

**అండమాన్‌లో అపరిమిత చమురు నిల్వలు**

అండమాన్ దీవుల్లో 70 ఏళ్లకు సరిపడ ముడి చమురు మనం వెలికి తీయబోతున్నామన్న వార్తలు జనవరిలో వచ్చాయి. ఇక్కడ మొత్తం 610 మిలియన్ టన్నుల హైడ్రోకార్బన్ నిల్వలున్నట్టు తేలింది. 120 బిలియన్ బ్యారల్స్ ఆయిల్ లభిస్తుందని అంచనా. దేశీయంగా మనకు రోజువారీ అవసరాలు 4.5 మిలియన్ బ్యారళ్లు. ఇంత పెద్దమొత్తంలో ఈ ప్రాంతంలో హైడ్రోకార్బన్ల లభ్యత ఉన్నప్పటికీ, చమురు అన్వేషణ వేగం పుంజుకోకపోవడానికి దీన్ని డిఫెన్స్ అవసరాలకోసం ఉపయోగించడంవల్ల ప్రవేశాలు నిషేధించిన జోన్‌గా పరిగణించడం, పర్యావరణం, ఈ ప్రాంతంలో నివసించే అరుదైన జాతి ప్రజలు ఇతరత్రా అంశాలు కూడా కారణం కావచ్చు.

ఈ నేపథ్యంలో 2022 డిసెంబర్‌లో కేంద్ర కేబినెట్ సమావేశమై అండమాన్ వద్ద క్రూడాయిల్ ఉత్పత్తి ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నది. ఈ ప్రాంతంలోని భూములు డిఫెన్స్, అంతరిక్ష పరిశోధనా సంస్థకు చెందినవి కావడంతో ప్రభుత్వం వాటి నుంచి వేగంగా అనుమతులు పొందింది. ఆ విధంగా ఈ ప్రాంతంలో చమురు అన్వేషణకు అడ్డంకులను అధిగమించింది. అండమాన్ దీవుల్లో

వచ్చే మే నెలలో డ్రిల్లింగ్ ప్రారంభించి, ఈ ఏడాది చివరినాటికి క్రూడాయిల్ ఉత్పత్తి చేస్తామని ఒ.ఎన్.జి.సి, ఆయిల్ ఇండియా సంస్థలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం నేషనల్ ఐలాండ్ ఎక్స్‌ప్లోరేషన్ ప్రాజెక్టు ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా, ఓఎన్‌జీసీ నేతృత్వంలో ఈ ప్రాంతంలో చమురు డ్రిల్లింగ్‌కోసం పెట్టుబడులు పెడుతోంది. ఈ ప్రణాళిక ప్రకారం ముందుగా మూడు బావుల్లో డ్రిల్లింగ్ చేపట్టనున్నారు. ఒక్కొక్క బావికి రూ.350–400 కోట్లు ఖర్చవుతుంది. ఈ ప్రాంతంలోని 610 మిలియన్ టన్నుల చమురు–సహజవాయువును వెలికితీయ గలిగితే మరో 70 ఏళ్ల వరకు దేశీయ చమురు అవసరాలకోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఆ విధంగా చూస్తే భారత్‌కు ఇదొక వరంలాంటిది.




**భౌగోళిక చరిత్ర**

నిజానికి అండమాన్ దీవుల్లో చమురు నిల్వల విషయం ఇప్పటిది కాదు. దీనికి దశాబ్దాల చరిత్ర ఉంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని బంగాళాఖాతం, మధ్యప్రాచ్య దేశాలో చమురు నిల్వలు ఉన్న ప్రాంతాల్లోని భౌగోళిక స్థితిని పోలిఉండటం విశేషం. సౌదీ అరేబియాలో ‘క్రస్టల్ ప్లేట్’, ఇరాన్‌కు చెందిన ‘క్రస్టర్ ప్లేట్’ దిగువకు జారి 1200 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉండే మాగ్మాలోకి ప్రవేశిస్తోంది. ఈ సమయంలో జరిగే రసాయన చర్యల కారణంగా హైడ్రోకార్బన్లు ఆవిర్భవిస్తున్నాయనేది భౌగోళిక శాస్త్రవేత్తలు తేల్చిన అంశం. సరిగ్గా ఇదేమాదిరి పరిస్థితి అండమాన్ దీవులకు చెందిన బంగాళాఖాతంలో కూడా నెలకొన్నదని వారు చెబుతున్న మాట. ఈ ప్రాంతంలో ఇండో–ఆస్ట్రేలియన్ ప్లేట్, యురేసియన్ క్రస్టల్ ప్లేట్ దిగువకు చొచ్చుకు పోతుండటం వల్ల ముడిచమురు, హైడ్రోకార్బన్‌లు ఆవిర్భవిస్తున్నాయనేది శాస్త్రవేత్తల అంచనా. అండమాన్ నికోబార్ బేసిన్ విస్తీర్ణం మొత్తం 225,918 చదరపు కిలోమీటర్లు కాగా ఇందులో 18,074 చదరపు కిలోమీటర్లు లోతు తక్కువ ప్రాంతం (shallow water) కాగా 207,844 చదరపు కిలోమీటర్లు డీప్‌వాటర్ ప్రాంతం. అండమాన్ బేసిన్‌లో మొత్తం 72 ఎంఎంటీఓఈ (మెట్రిక్ మిలియన్ టన్స్ ఆఫ్ ఆయిల్ ఈక్వలెంట్) హైడ్రోకార్బన్ల లభ్యత ఉండగా 2 ఎంఎటీఓఈ హైడ్రో కార్బన్లను ఇప్పటికి కనుగొన్నారు. దీన్ని ప్రస్తుతం సబ్–కమర్షియల్ (సబ్–కమర్షియల్ ప్రాంతంలో నిర్ణీత సమయంలో ఉత్పత్తి ప్రారంభించ వచ్చు. సాధారణంగా ఈ సమయం 5ఏళ్ల కాలం వరకు ఉంటుంది) ప్రాంతంగా పరిగణిస్తున్నారు. మిగిలిన 70 ఎంఎంటీఓఈ హైడ్రోకార్బన్లపై అన్వేషణ కొనసాగాల్సివుంది.

**సర్వే అంచనాల్లో తేడా**


అండమాన్ నికోబార్ ద్వీపాల వద్ద దాదాపు 180 మిలియన్ టన్నుల చమురు, 610 మిలియన్ టన్నుల చమురుకు సమానమైన సహజవాయు (oil equivalent gas) నిల్వలున్నట్టు 2003లోనే డైరెక్టరేట్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ అంచనా వేసింది. తర్వాతి అధ్యయనాలు ఇక్కడి నిల్వలు120 బిలియన్ బ్యారల్స్‌గా అంచనా వేశాయి. అయితే ఈ ప్రాంతంలో లభించే చమురు– సహజ వాయువు విషయంలో వివిధ సర్వేల అంచనాలు ఒకేమాదిరిగా లేకపోవడం గమనార్హం. బహుశా వారు చేపట్టిన సర్వే విధానాలను బట్టి ఫలితాలు వచ్చి ఉండవచ్చు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఓఎన్‌జీసీకి మూడు బ్లాకులు, ఆయిల్ ఇండియాకు ఒక బ్లాక్ ఉన్నాయి. ఈ ప్రాంతంలోని సహజ వనరులపై భారతీయ కంపెనీలు మాత్రమే కాదు, విదేశీ కంపెనీలు కూడా దృష్టిపెట్టాయి. 2020లో యూకేకు చెందిన ప్రీమియర్ గ్యాస్ కంపెనీ అండమాన్ ప్రాంతంలో చమురు వెలికితీతకు ప్రణాళికలు రచిస్తోందన్న వార్తలు వచ్చాయి. అండమాన్–2, దక్షిణ అండమాన్ ప్రాంతంలో 6 ట్రిలియన్ ఘనపుటడుగుల గ్యాస్, 200 మిలియన్ బ్యారళ్ల చమురు ఉన్నట్లు ఈ సంస్థ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో 22,500 కిలోమీటర్ల తీరంలో 2డి–సిస్మిక్ డేటాను సేకరించింది. నేషనల్ ఎక్స్‌ప్లోరేషన్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఈ పరిశోధన అనంతరం కేంద్రం ఈ ప్రాంతంలో చమురు అన్వేషణకు అవసరమైన నిధులు ఓఎన్‌జీసీకి కేటాయించడం మొదలుపెట్టింది. కేంద్రం విదేశీ కంపెనీలకు కూడా ఈ ప్రాంతంలో అన్వేషణకు ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ కంపెనీలైన ఓఎన్‌జీసీ ఆయిల్ ఇండియా కంపెనీలు తమకు కేటాయించిన బ్లాక్‌ల్లో చమురు అన్వేషణ జరిపి డ్రిల్లింగ్‌కు సిద్ధమవుతున్నాయి. ఓఎన్‌జీసీ తనకు కేటాయించిన బ్లాకుల్లో రెండింటిలో సర్వే పూర్తిచేసి, మూడు బావుల్లో తవ్వకాలు చేపట్టాలని భావిస్తోంది. దీనిపై ఈ ఏడాది మే నెలాఖరులోగా ఒక నిర్ణయానికి వచ్చే అవకాశముంది. ఇక అయిల్ ఇండియా కంపెనీ చమురు తవ్వకాలకు మూడు ప్రదేశాలను గుర్తించినప్పటికీ బిడ్డింగ్‌పై ఒక నిర్ణయానికి రానట్టు తెలుస్తోంది. ఎక్సాన్‌మొబిల్, చెవ్రాన్, టోటల్ ఇంజినీర్స్ వంటి విదేశీ సంస్థలకు కూడా ఈ ప్రాంతంలో చమురు అన్వేషణపై ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి.

**పొంచి ఉన్న ప్రపంచయుద్ధ ప్రమాదం**

రష్యాతో సాయుధ సంఘర్షణకు జర్మనీ సిద్ధమవుతోందంటూ ‘బిల్ట్’ దిన పత్రిక ఇటీవల ఒక కథనాన్ని ప్రచురించింది. జర్మనీ రక్షణ శాఖ నుంచి తనకు ఈ కీలక పత్రాలు లభించినట్టుకూడా పేర్కొంది. దీని ప్రకారం 2025 నాటికి నాటో దేశాలపై దాడులకు దిగడం ద్వారా ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని రష్యా విస్తరించే అవకాశం ఉంది. యూరప్ దేశాలు కూడా రష్యా దాడి నుంచి తమను తాము రక్షించుకునే యత్నాల్లో పడ్డాయని కూడా ఈ నివేదిక పేర్కొంది. ‘అలయెన్స్ డిఫెన్స్–2024” ఏర్పాటవుతుందని, ముందుగా కొద్ది వేల సంఖ్యలో జర్మనీ సైన్యాలను యుద్ధరంగానికి పంపిన తర్వాత నుంచి అసలు యుద్ధం మొదలవుతుందని పేర్కొంది. నాటో దేశాలు రష్యా దాడులను ఏ విధంగా ఎదుర్కొంటాయనేది కూడా ఇందులో వివరంగా ఉన్నాయని ఆ కథనం పేర్కొంది. బహుశా ఇది మూడో ప్రపంచ యుద్ధానికి నాంది కావచ్చని కూడా హెచ్చరించింది. అయితే రష్యా అధికార్లు దీన్ని తప్పుడు వార్తగా కొట్టిపారేసినప్పటికీ, ప్రపంచ రాజకీయ పరిణామాలు కూటములు ఏర్పడే దిశగా కొనసాగుతున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే ఇంధన పెను సంక్షోభం ఏర్పడక తప్పదు. అన్ని దేశాలు బాధితులుగానే మిగిలిపోతాయి. మన దేశానికీ మినహాయింపు లేదు. ఇప్పటికే రష్యా, చైనా, ఇరాన్ వంటి దేశాలు కూటమిదిశగా వెళుతుంటే, అమెరికా, యూరప్ దేశాలు మరో కూటమిగా క్రమంగా ఏర్పడుతున్నాయి. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఎప్పుడు ఏ విపరిణామానికి దారితీస్తాయో చెప్పడం కష్టం. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా దాదాపు గెలిచింది. ఇప్పుడు ఆ దేశం నాటో దేశాల కట్టడికి యత్నించే అవకాశాలే ఎక్కువ. ఇది ప్రపంచ యుద్ధానికి దారితీయక తప్పదు. కాలగతిని నిలువరించడం సాధ్యం కాదు! ★

# వందేమాత

బెంగాల్ విభజన వ్యతిరేక జ్వాలల నుంచి జనించినదే వందేమాతరం ఉద్యమం. అప్పుడే మొదటిసారి స్వదేశీ భావన వెల్లువెత్తింది. భారతీయులందరినీ తొలిసారి జాతీయ స్పృహతో అడుగులో అడుగు వేసి నడిపించిన నినాదం అది. వందేమాతరం ఉద్యమం, స్వదేశీ గురించి వివరించడానికి, ప్రజలను చైతన్యవంతం చేయడానికి లాల్ బాల్ పాల్ త్రయంలోని బిపిన్‌చంద్ర పాల్ దక్షిణాదికి వచ్చారు. విజయనగరం, విశాఖ, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, మచిలీపట్నాలలో ప్రసంగాలు ఇచ్చి, ఆపై మద్రాస్ వెళ్లారు. అదొక జాతీయవాద ప్రభంజనం. తెలుగునాట ముట్నూరి కృష్ణారావు పాల్ సభలను నడిపించారు. మద్రాస్‌లో సుబ్రహ్మణ్య భారతి అండగా ఉన్నారు. పాల్ ఉపన్యాసాలు రాజమండ్రిలో గాడిచర్ల హరిసర్వోత్తమరావును అందించాయి. మద్రాస్‌లో మరొక మహనీయుడిని కూడా స్వాతంత్ర్యోద్యమానికి అందించాయి. ఆయనే నీలకంఠ భద్రాచారి. వీరంతా పత్రికా రచయితలు కావడం విశేషం.



నీలకంఠ భద్రాచారి

**'ఆఖరికి ఒక్క మనిషి అయినా అన్నం లేకుండా పస్తు ఉండవలసి వచ్చిన రోజున ఈ ప్రపంచాన్ని దగ్ధం చేసేద్దాం!'**

తమిళ మహాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు సుబ్రహ్మణ్య భారతి కవితలలో ఇదొకటి. నాలుగు రోజుల నుంచి భోజనం లేదు అంటూ ఒక వ్యక్తి తన ఎదురుగా నిలబడి చెప్పినప్పుడు ఆ మహాకవి నోటి నుంచి ఈ పంక్తులు వెలువడినాయి. ఆ క్షుధార్తుడు ఎవరో కాదు, భారతి అనుచరుడే. పేరు నీలకంఠ భద్రాచారి. తరువాత భారతి భద్రాచారికి సుష్టుగా భోజనం పెట్టాడు. నీలకంఠ విప్లవమార్గంలో స్వాతంత్ర్యం కోసం పాటుపడిన మహనీయుడు. భారతి శిష్యుడు. తరువాత ఆధ్యాత్మిక మార్గం పట్టారు.

బెంగాల్ విభజన తరువాత బిపిన్‌పాల్ దేశమంతా తిరిగి ఉపన్యాసాలు ఇచ్చారు. అప్పుడే సుబ్రహ్మణ్య భారతి, ఇంకొందరితో కలసి నీలకంఠ బిపిన్‌పాల్‌కు స్వాగతం పలికారు. పాల్ ఉపన్యాస వేదిక మెరీనా బీచ్. అది ట్రిప్లికేన్‌కు కూతవేటు దూరమే. పాల్ మహావక్త. బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమంలో భాగంగా, వందేమాతరం నినాదంతో ఆయన మద్రాస్ నగరంలో ఉపన్యాసాలు ఇవ్వడానికి వచ్చారు. ఆయన వక్తృత్వంలో అదంతా ప్రతిబింబించింది, ప్రతిధ్వనించింది.

నీలకంఠ జీవితంలో అనేక దశలు ఉన్నాయి. ఆయన చింతనలో అనేక అరలు ఉన్నాయి. ఇరవయ్యో పడిలోకి రాగానే, అంటే 1911లో కమ్యూనిస్టు మ్యానిఫెస్టోను తమిళ భాషలోకి అనువదించారు. 1911 అంటే రష్యా జార్ రాజ్యంలో విప్లవం తేవాలని ఆ దేశ ప్రజలు అప్పటికి అనుకోలేదు. అయితే నీలకంఠ కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసిన దాఖలాలు లేవు. తీవ్ర జాతీయవాదాన్ని నమ్ముతూ స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించారు.

డిసెంబర్ 4,1889న నీలకంఠ మైలాదుతురై జిల్లా ఇరుక్కూరులో పుట్టారు. తండ్రి శివరామకృష్ణ గణపతిగళ్ సామవేద పండితుడు. ఎనిమిది మంది సంతానం ఉన్న ఆ కుటుంబంలో నీలకంఠ పెద్దవారు. కుటుంబం పేదరికంలో ఉండేది. అయినా ఆయన వైదిక ధర్మాచారం ప్రకారం జీవించారు. ధర్మానికి కట్టుబడి, సత్యాన్ని మాత్రమే మాట్లాడేవారు. ఇరుక్కూరులో ఆయన పొందిన అనుభవాలు జీవితాంతం ఆయనకు ఉపయోగపడినాయి. రోజురోజుకీ పెరిగిపోతున్న కష్టాల నుంచి తప్పించుకోవడానికి ఆ ఊరు వదిలి మాయావరం తరలిపోవాలని అనుకుంది ఆ కుటుంబం. ఆ క్రమంలో అక్కడ ఉన్న కొద్దిపాటి ఆస్తిని అమ్ముకున్నారు. మాయావరంలో శివరామకృష్ణ గణపతిగళ్‌కు వేద పాఠశాలలో ఉద్యోగం దొరికింది. ఇంతలో అవసరాల కోసం కొడుకును కొంత డబ్బు సమకూర్చమని తండ్రి అడిగారు. అప్పటికే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటున్న నీలకంఠ స్వరాజ్య భారతి పేరిట జరుగుతున్న ఉద్యమం కోసం కొంత ధనం సేకరించారు. తండ్రి సర్దుబాటు చేయమన్నందుకు తిరిగి ఇంటికి వెళ్లలేదు.

నీలకంఠ సిర్కాలిలోని శుభనాయకర్ హిందూ ప్రాథమికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివారు. ఆపై స్థోమత లేక చదువుకు స్వస్తి చెప్పి ట్రిప్లికేన్ అర్బన్ కో ఆపరేటివ్ సొసైటీలో (మద్రాస్) చిన్న గుమాస్తాగా చేరారు. ఇది జరిగిన కొద్దికాలానికే లాల్ బాల్ పాల్ త్రయంలోని బిపిన్‌చంద్ర పాల్ ఉపన్యాసాలు ఇవ్వడానికి మద్రాస్ వచ్చారు. బెంగాల్ విభజన తరువాత బిపిన్‌పాల్ దేశమంతా తిరిగి ఉపన్యాసాలు ఇచ్చారు. అప్పుడే సుబ్రహ్మణ్య భారతి, ఇంకొందరితో కలసి నీలకంఠ బిపిన్‌పాల్‌కు స్వాగతం పలికారు. పాల్ ఉపన్యాస వేదిక మెరీనా బీచ్. అది ట్రిప్లికేన్‌కు కూతవేటు దూరమే. పాల్ మహావక్త. బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమంలో భాగంగా, వందేమాతరం నినాదంతో ఆయన మద్రాస్ నగరంలో ఉపన్యాసాలు ఇవ్వడానికి వచ్చారు. ఆయన వక్తృత్వంలో అదంతా ప్రతిబింబించింది, ప్రతిధ్వనించింది. అప్పటికే అంతో ఇంతో స్వాతంత్ర్యోద్యమంతో బంధం ఉన్న నీలకంఠ రక్తం ఉప్పొంగి పోయింది. గుండె నిండా స్వరాజ్య జ్వాల ఎగసింది. వెంటనే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశారు. మహాకవి భారతి నడుపుతున్న వార్తాపత్రిక 'ఇండియా'లో చేరారు.

అప్పటికే 'ఇండియా' పత్రిక మీద బ్రిటిష్ అధికారుల కన్ను ఉండేది. నీలకంఠ చేరిన కొన్ని

# రం ఉద్యమ స్ఫూర్తితో..

రోజులకే రాజద్రోహాన్ని ప్రేరేపించే రాతలు రాస్తున్నారన్న ఆరోపణతో పత్రికను మూయించారు. సుబ్రహ్మణ్య భారతిని కూడా అరెస్టు చేయవచ్చునన్న వదంతులు వచ్చాయి. దీనితో సమీపంలోనే ఫ్రెంచ్ ఏలుబడిలోని పుదుచ్చేరికి వెళ్లిపోవలసిందని భారతి శ్రేయోభిలాషులు కోరారు. మిగిలిన భారతదేశానికి చెందిన విప్లవకారులంతా అరెస్టులను తప్పించుకోవ డానికి పుదుచ్చేరి చేరుకునేవారు. భారతి, ఆయన వెంట నీలకంఠ కూడా వెళ్లారు. గురుశిష్యులిద్దరూ పత్రికలనే ఆశ్రయించారు. నీలకంఠ 'సూర్యోదయం' అనే పత్రికలో సంపాదకునిగా చేరారు. ఆ బాధ్యతలతో పాటు స్వరాజ్య భావనను వ్యాపింప చేయడానికి ఆయన ప్రచారక్‌గా కూడా పనిచేశారు. నీలకంఠ సూటిగా మాట్లాడేవారు. ఆయన మాట అర్జుని బాణంలా గురి తప్పకుండా తగులుతుందని అనుకునేవారు. ఈ లక్షణాలే ఆయన వెనుక పెద్ద అనుచరగణాన్ని ఏర్పరిచింది. వారంతా భారతమాత సేవలో ఉండేవారు. టెంకాసీ, ట్యుటికోరన్ వంటి చోట్ల ఆ రోజులలో ఆ క్రమంలో ఏర్పడినదే భారతమాత సంఘం. వీరవాంచీనాథన్, కృష్ణాపురం శంకరకృష్ణన్, మదతుక్కడై చిదంబరం పిళ్లయ్, ఒట్టాపిడారం మదసామి పిళ్లయ్ వంటి స్వాతంత్ర్య సమరయోధులంతా భారతమాత సంఘం నుంచి వచ్చినవారే. నీలకంఠకు అనేక పేర్లు ఉండేవి. భరద్వాజన్, గోవిందనాయర్ దుబే, గోవింద్ నారాయణ్, స్వామి బ్రహ్మచారి, నీలకంఠ దత్త ఇవన్నీ ఆయన పేర్లే. మద్రాస్ నగరంలోని మైలాపూర్ నుంచి ఆనాడు వెలువడిన 'వేదాంత కేసరి' పత్రికకు లె ఫ్రేల్ అనే ఫ్రెంచ్ పేరుతో రచనలు చేశారాయన.

తన ఉద్యమ లక్ష్యం మీద, దానికి ఉన్న తాత్వికత మీద కూడా నీలకంఠకు అచంచలమైన విశ్వాసం ఉండేది. ఇది దీనికి ఒక చక్కని ఉదాహరణ: కడలూరులో చక్రవర్తి అయ్యంగార్ అనే పెద్ద న్యాయవాది ఉండేవారు. సాయుధ పంథా అవసరం మీద ఆ న్యాయవాదితో నీలకంఠ ఒక సందర్భంలో వాదించవలసి వచ్చింది. వాదోపవాదాలు బాగా వేడెక్కాయి. భారతమాత మీద బ్రిటిష్ జాతి సాగిస్తున్న అణచివేతను నిలదీసే రోజు దగ్గరలోనే ఉంది అంటూ ఒళ్లు తెలియని ఆవేశంతో అరిచారు. ఆ రోజు వచ్చినప్పుడు బ్రిటిష్ జాతికి రక్తంతోనే సమాధానం చెబుదామని కూడా అన్నారాయన. భారతమాత ఆశీస్సులతో ఒక దశాబ్దాంలోనే ఇది జరుగుతుందని ఎదురుగా ఉన్న బల్లను గుద్ది చెప్పారాయన.

స్వదేశీ ఉద్యమంలో కీలకంగా ఉన్న ఓవీ చిదంబరం పిళ్లయ్, సుబ్రహ్మణ్య శివం అనే వారిని మార్చి 12,1908న తిరునల్వేలి కలెక్టర్ వించ్ అరెస్టు చేశాడు. ఆ ఇద్దరిని పాళయంకొట్టాయి జైలుకు పంపించారు. ఇది స్వాతంత్ర్య సమరయోధులను బాగా బాధించింది. ఆ అరెస్టులకు ప్రతీకారంగా వించ్‌ను హత్య చేయాలని నీలకంఠ నాయకత్వంలో భారతమాత సంఘం నిర్ణయించింది. అయితే అప్పుడే వించ్ బదలీ అయి, అతడి స్థానంలో రాబర్ట్ ఏషే



బిపిన్‌చంద్ర పాల్



సుబ్రహ్మణ్య భారతి

వచ్చాడు. అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్టు వించ్‌ను మించిన కఠినాత్ముడు ఏషే. నీలకంఠ ప్రోద్బలంతో వాంచినాథన్ ఏషేను మనియాంచి రైల్వే స్టేషన్ దగ్గర కాల్చి చంపాడు. తరువాత వాంచినాథన్ దొరక్కుండా ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఈ కేసులో కీలకమని భావిస్తున్న నీలకంఠ కోసం అన్వేషణ మొదలయింది. కలకత్తాలోని ఒక హోటల్‌లో దాగి ఉన్న నీలకంఠను పోలీసులు అరెస్టు చేసి విచారణ కోసం మద్రాసుకు తీసుకువచ్చారు. సెక్షన్ 121ఏ కింది కేసు నమోదయింది. అంటే బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూల్చడానికి యత్నించాడన్న ఆరోపణ. 280 మంది సాక్షులను ప్రవేశపెడితే 200 మంది బ్రిటిష్‌కు అనుకూలంగా సాక్ష్యం చెప్పారు. నీలకంఠకు ఏడేళ్లు కఠిన కాగాగార శిక్ష విధించి బళ్లారి జైలుకు పంపించారు. అయితే ఆ జైలు నుంచి తప్పించుకుని బయటకు వచ్చినప్పటికి ధర్మవరం రైల్వే స్టేషన్‌లోనే ఆయన దొరికిపోయారు. శిక్షను ఏడున్నరేళ్లకు పెంచారు. ఏడేళ్లలో సంవత్సరానికి ఒకటి వంతున ఏడు జైళ్లకు తిప్పారు. అవి– బళ్లారి, మద్రాస్, పాళయంకొట్టయ్, కన్నూర్, కోయంబత్తూరు, రాజమహేంద్రపురం, విశాఖపట్నం. ఆఖరికి ఆగస్ట్ 1919లో విడుదల చేశారు.

మద్రాస్ చేరుకున్న నీలకంఠ స్వదేశీ ఉద్యమ కార్యకలాపాలు తిరిగి ప్రారంభించారు. కానీ ఆయన జీవితంలో చీకటిరోజులు ప్రవేశించాయి. కొన్ని సందర్భాలలో నాలుగు రోజులకు కూడా తిండి ఉండేది కాదు. ఆకలికి తట్టుకోలేక చీకటి పడిన తరువాత భిక్షాటన చేశారాయన. చివరికి తన గురువు భారతి వద్దకు చేరుకుని పరిస్థితిని వివరించారు. నాలుగు అణాలు ఇవ్వవలసిందని, అన్నం తిని నాలుగు రోజులయిందని కోరారు. భారతి చలించి పోయారు. తరువాత భారతి కన్నుమూసినప్పుడు నీలకంఠ పాడె మోశారు.

అనంతర కాలాలలో నీలకంఠ ఇహలోకం మీద నమ్మకం కోల్పోయారు. ఒక పరిత్యాగి వలె దేశమంతా తిరిగారు. తరువాత శ్రీసద్గురు ఓంకార్‌గా మారారు. బెంగళూరు నందికొండల దగ్గర ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నారు. ప్రముఖులే కాకుండా సాధారణ ప్రజలు కూడా ఆ ఆశ్రమానికి విశేషంగా వచ్చేవారు. శివరాత్రికి, దుర్గాష్టమికి అక్కడ ప్రత్యేక యాగం చేసేవారు. ఆ సందర్భంగా వచ్చే బూడిద ప్రసాదం కోసం జనం వెల్లువెత్తేవారు. తన రచనా శక్తిని కూడా ఆయన ఆధ్యాత్మికతకు ధారాదత్తం చేశారు. ఆయన రాసిన వ్యాసాలను 1954లో 'ఆర్గనైజర్' పత్రిక ధారావాహికంగా వెలువరించింది. భారతమాతను సేవించుకుంటూ, సనాతన ధర్మ ప్రచారానికి జీవితాన్ని అంకితం చేసిన సద్గురు ఓంకార్ మార్చి 4, 1978న భగవదైక్యం చెందారు.

– జాగృతి డెస్క్

# సావర్కర్ చలనచిత్రం సిద్ధం

స్వాతంత్య్ర వీర్ సావర్కర్. ఈ పేరు వింటే చాలు కొందరు జాతీయ భావ ప్రవంతిలో తడిసి ముద్దవుతారు. ఇంకొక రకం ఉన్నారు. వీళ్లు ఎప్పటికీ ఆయన మీద కువిమర్శలు చేయాలనే చూస్తారు. ఆయన జీవించి ఉండగా కాంగ్రెస్, మరణించిన తరువాత ఇప్పటి వరకు కమ్యూనిస్టులు ఆయన త్యాగాన్ని కించపరుస్తూనే ఉన్నారు. అయినా సావర్కర్ ఈ దేశంలో ఒక ఆరని దేశభక్తి దీప్తి. సావర్కర్ జీవితం ఆధారంగా, వారి చరిత్ర స్ఫూర్తిగా నిర్మించిన చిత్రం 'స్వాతంత్య్ర వీర్ సావర్కర్'. ఇది త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఈ సినిమా విడుదల కావడానికి ముందే నీచమైన, నిర్హేతుకమైన విమర్శలు కురిపించడం మొదలుపెట్టారు. ఇంతకాలం వామపక్ష కిరాయి చరిత్రకారులు ఆ పని చేశారు. విజయవంతం కాలేదు. ఇప్పుడు సావర్కర్ సమకాలీన యోధుల వారసుల చేత విమర్శలు చేయిస్తున్నారు. ఈ చిత్రానికి సుభాశ్‌చంద్ర బోస్ పాత్రను దూరంగా ఉంచాలని ఆయన మనుమడు దర్శకులను కోరాడు. అతడి పేరు చంద్రకుమార్



బోస్.'మీరు సావర్కర్ పేరిట చిత్ర నిర్మాణానికి పూనుకున్నందుకు అభినందనలు. ఆయన వాస్తవ వ్యక్తిత్వాన్ని తెరకెక్కించడం చాలా ముఖ్యం. సావర్కర్ పేరుతో నేతాజీ పేరును కలపడంలో కొంచెం సంయమనం పాటించవలసింది. నేతాజీ సెక్యులర్ నాయకుడు, దేశభక్తులకే దేశభక్తుడు' అని ఎక్స్‌లో పోస్టు చేసి కొత్త వివాదానికి చంద్రకుమార్ బోస్ తెర లేపాడు.

ఇటీవలనే స్వాతంత్య్ర వీర్ సావర్కర్ సినిమా అధికారిక ట్రయిలర్ విడుదల అయింది. రణదీప్ హుడా దర్శకత్వంతో పాటు, సావర్కర్ పాత్రను కూడా పోషించారు. చరిత్ర సేకరణ, చిత్రానువాదంలో కూడా రణదీప్ సేవలు అందించారు. అంకితా లోఖండే, ఉత్కర్ష నైథాని కూడా ఇందులో సహకరించారు ఆనంద్ పండిట్ నిర్మించారు. ఇందులో మహాత్మా గాంధీ, సావర్కర్‌లు కలుసుకున్న దృశ్యం ఉంది. ఔను, ఆ ఇద్దరు లండన్ హౌస్‌లో కలుసుకున్న మాట నిజం. ఇంకా బాలగంగాధర తిలక్, మదన్‌లాల్ థింగ్రా, భగత్‌సింగ్, నేతాజీ బోస్ పాత్రలు కూడా ఇందులో ఉన్నాయి.

నేతాజీ, సావర్కర్ సమకాలికులు. చంద్రకుమార్ బోస్ వెనుక ఎవరు ఉన్నారో, ఎవరు అలాంటి మాటలు అనిపించారో తెలుసుకోవడం కష్టంకాదు. బోస్ స్థాపించిన ఫార్వార్డ్ బ్లాక్‌ను తరువాత కొందరు వామపక్షాల సరసన చేర్చి నిజానికి బోస్‌ను అవమానించారు. వామపక్షాలు బోస్‌ను దారుణమైన భాషలో దూషించాయి. కాంగ్రెస్, కమ్యూనిస్టులు సావర్కర్‌ను ఏ విధంగా అవమానించారో, ఏ విధంగా చరిత్ర పుటల నుంచి తప్పించారో అదే గతిని బోస్‌కూ పట్టించారు. ఈ విషయం చంద్రకుమార్ వంటి వారు తెలుసుకోవడం అవసరం. ★

# మోదీ జపం



ఎంత ఆగ్రహావేశాలతో చూశారా? ఇది సాక్షాత్తు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మహిళలకి ఇచ్చిన పిలుపు. ఫిబ్రవరి 9వ తేదీన ఢిల్లీలో జరిగిన మహిళా సమ్మాన్ కార్యక్రమంలో చెప్పిన మాట ఇది. మొగుళ్లకి తిండి పెట్టకండి అన్నమాటతో కేజ్రీవాల్

# ఆ నినాదాలు ఇచ్చిన

ఈ మాట అన్నది శ్రీరామ్‌సేన నాయకుడు ముతాలిక్ లేదా మరొక హిందుత్వవాదో కాదు. కర్ణాటక మంత్రిగారే. సాక్షాత్తు కర్ణాటక శాసనసభలో పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసినా, అదేం పెద్ద విషయం కాదన్నట్టే ఉంది అధికార కాంగ్రెస్ పార్టీ. ఢిల్లీ అధిష్ఠానానికి చీమ కుట్టినట్టయినా లేదు. కానీ ఇలాంటి నీచపు పోకడలను ఖండించడానికి కాంగ్రెస్‌లో ఇంకా కొందరు మిగిలి ఉన్నారు. శాసనసభలో పాక్ అనుకూల నినాదాలు ఇచ్చిన వాళ్లని కాల్చి పడేయాలని అన్నారు రాష్ట్ర మంత్రి కేఎన్ రాజన్న. అంతేకాదు, రాష్ట్రంలో పరిస్థితులు చక్కబడాలంటే ఉత్తర ప్రదేశ్ మోడల్ ఆవశ్యకమని కూడా తేల్చారాయన. అప్పుడు కదా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి చక్కబడుతుంది అని కూడా అన్నారు. సహకార శాఖను నిర్వహిస్తున్న రాజన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు అత్యంత సన్నిహితుడు. కొద్దిరోజులు క్రితం విధాన సౌధలో వినిపించిన పాక్ అనుకూల నినాదాల మాటేమిటని ఫిబ్రవరి 9న ఆయనని విలేకరులు అడిగారు. దానికే ఆయన అంత ఘాటుగా

# నవమికి తొలిసారి



అయోధ్యలో బాలక్‌రామ్ ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. మరో రెండు మూడు నెలలో లోక్‌సభ ఎన్నికలు జరగబోతున్నాయి. దీనికి తోడు సందేశ్‌ఖాలీ భూతం వెంటాడుతోంది. పశ్చిమ బెంగాల్‌లో హిందువులే లక్ష్యం అన్న వాస్తవం బయటపడిపోయింది. ఇన్ని కారణాలతో కాబోలు మొత్తానికి పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం తొలిసారి శ్రీరామనవమిని

# చేస్తే కూడు పెట్టొద్దు!

తన లోక్‌సభ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ఆరంభించారన్నమాట. 'చాలామంది మగాళ్లు అదే పనిగా మోదీ పేరు జపిస్తున్నారు. వాళ్లతో చెప్పండి! ఆ పేరు ఎత్తితే రాత్రికి మీకు తిండి పెట్టం అని చెప్పండి!' అని పిలుపునిచ్చారు కేజ్రీవాల్.

ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన కింద లబ్ధి పొందుతున్న మహిళలతో ముఖ్యమంత్రి ముఖాముఖీ కార్యక్రమంలో ఇదంతా జరిగింది. ఈ పథకం కింద ప్రతి మహిళకు వేయి రూపాయలు వంతున ఇస్తారు. వేయి రూపాయలతో మహిళలోకానికి ఆర్థిక స్వావలంబన తథ్యమని తాను అనుకుంటున్నారట. మా వెనుక సోదరుడు కేజ్రీవాల్ ఉన్నాడని బీజేపీ వాళ్లకి చెప్పమని కూడా అన్నారాయన. ★

# వాళ్లని కాల్చి పారేయాలి



స్పందించారు. ఇలాంటి సంఘటనలతో కాంగ్రెస్ పరువు పోవడానికి అంగీకరించలేం కదా అన్నారాయన. సయద్ నజీర్ అనే కాంగ్రెస్ నాయకుడు రాజ్యసభకు ఎన్నికైతే సభలో పాక్‌కి జైకొట్టారు ఆయన అనుచరులు. ఇంతకీ సయద్ నజీర్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు సన్నిహితుడని వార్తలు వచ్చాయి. అలాంటి వాళ్లని (పాక్ అనుకూల నినాదాలు చేసిన వాళ్లని) కాల్చి పారేస్తే తప్పేమీ కాదు అని కూడా రాజన్న నిశ్చితాభిప్రాయం. ఉత్తరప్రదేశ్‌లో చూడండి! దారుణ నేరాలకు పాల్పడిన వాళ్ల ఇళ్లని చట్టబద్ధంగా అనుమతి లేకున్నా కూల్చి పారేస్తున్నారు. కూల్చేస్తే కూల్చారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలు ఆగాయి కదాఅన్నారు రాజన్న. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో కర్ణాటకలో పార్టీ 20 సీట్లు గెలుస్తుందని ఇటీవల ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చెబితే, రాజన్న తాజాగా అదేం లేదు, 16 సీట్లు రావొచ్చునని తేల్చారు. ఈయనని పార్టీలో ఉంచుతారా? ★

# సెలవు ఇచ్చిన మమత

(ఏప్రిల్ 17) సెలవు దినంగా ప్రకటించింది. తొమ్మిదో తేదీన ఈ ప్రకటన వెలువడింది. ఇలాంటి నేతల మాటలను భారతీయులు ఇంకా నమ్మవలసి ఉందా? అక్కడ హిందూ పండగలకి సంబంధించి గత అనుభవాలు ఎలా ఉన్నాయి? బెంగాలీలు దుర్గాపూజ, కాళీపూజ, సరస్వతిపూజ ఘనం చేసుకుంటారు. అయితే రామనవమి యాత్రల మీద గడచిన కొద్దికాలంలో దాడులు జరుగుతున్నాయి. మమతా బెనర్జీ హిందువులను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నదని, వారి సంస్కృతి మీద ద్వేషంతో ఉన్నదని తీవ్ర విమర్శలు వచ్చాయి. మమతా బెనర్జీ తన మీద ఉన్న హిందూ వ్యతిరేక ముద్రను తుడిచేసుకోవాలని ప్రయత్నించారు గాని ఇప్పటికే చాలా ఆలస్యమైందని బీజేపీ వ్యాఖ్యానించింది. ★



# ఇది మసీదా?

మరొక వివాదాస్పద స్థలంలో సర్వే చేయడానికి భారత పురావస్తు శాఖకు మధ్యప్రదేశ్ హైకోర్టు అనుమతించింది. జస్టిస్ ఎస్ఏ ధర్మాధికారి,జస్టిస్ దేవ్‌నారాయణ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్రంలోని ధార్‌లో ఉన్న భోజశాల ఆలయం/కమాల్ మౌలా మసీదుకు సంబంధించి మార్చి 11న కోర్టు నుంచి ఈ ఆదేశాలు వెలువడినాయి. ఈ కట్టడాన్ని వాగ్దేవి ఆలయం లేదా సరస్వతి ఆలయం అని హిందువులు చెబుతారు. ఇది 11వ శతాబ్దానికి చెందినది. అయితే ఇది మసీదు అని ముస్లిం వర్గాలు వాదిస్తున్నాయి. ఐదుగురు పురావస్తు నిపుణులతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి, దాని చేత సర్వే చేయించి ఆరువారాల లోగా నివేదికను కోర్టుకు సమర్పించాలని ఆదేశాలు వచ్చాయి. ఈ కట్టడానికి ప్రార్థనా స్థలాల చట్టం 1991 వర్తించదని, ఇది భారత పురావస్తు శాఖ రక్షణలో ఉన్నదని హిందువుల తరపు న్యాయవాది విష్ణుశంకర్ జైన్ తెలియచేశారు. కాశీలోని జ్ఞానవాపి వ్యాజ్యాన్ని కూడా జైన్ వాదిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కట్టడం వద్ద పలుసార్లు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గడచిన సంవత్సరం ఇందులో సరస్వతి అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించడానికి కొందరు ప్రయత్నించినప్పుడు పెద్ద ఎత్తున వివాదం చెలరేగింది. 1997లో ఈ కట్టడంలోకి హిందువుల ప్రవేశాన్ని జిల్లా యంత్రాంగం నిషేధించింది. 2002లో వసంత పంచమికి తమను లోపలికి అనుమతించాలని ఆందోళనకు దిగిన హిందువుల మీద జిల్లా కలెక్టర్ లాఠీచార్జికి ఆదేశించారు. అప్పుడే భోజశాల విముక్తి ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. అయితే ఏప్రిల్ 7, 2003 సంవత్సరంలో భారత పురావస్తు శాఖ ప్రతి గురువారం ఇక్కడ పూజచేసుకోవానికి హిందువులకు అనుమతి ఇచ్చింది. అలాగే శుక్రవారం నమాజ్‌కు ముస్లింలను అనుమతించింది. 2006లో వసంత పంచమి శుక్రవారం వచ్చింది. దీనితో రెండు వర్గాలు అక్కడికి పెద్ద సంఖ్యలో చేరడంతో ఘర్షణ జరిగింది. అల్లర్లు జరిగాయి. 200 మంది మీద కేసులు పెట్టారు. ★



**డీఎంకే, ఆ పార్టీ నేతలు సనాతన ధర్మం మీద నీచమైన దాడులకు దిగడం కొత్తకాదు. కేంద్ర మాజీ మంత్రి ఎ. రాజా సనాతన ధర్మంపైన, కొత్తగా రాముడిపైన దాడి ప్రారంభించడమే విశేషం. తమిళనాడు మంత్రి, ముఖ్యమంత్రి తనయుడు ఉదయనిధిపై విచారణలో మత విద్వేషచర్యకు తగిన శిక్ష పడక తప్పదని సుప్రీంకోర్టు ఇటీవల తేల్చి చెప్పింది. అయినా, అదే పార్టీకి చెందిన రాజా దూకుడు ఆపడం లేదంటే, దాని వెనక ఏదో బలమైన కారణం ఉన్నందువల్లే రెచ్చిపోతున్నాడన్న అభిప్రాయం ఉంది. తన అజ్ఞానాన్ని ఆయనేమి దాచుకోవడం లేదు. రాముడి గురించి, రామాయణం గురించి తెలియదంటూనే, వాటిని అంగీకరించను అంటూ ఢంకా బజాయించాడు.ఒక విషయం గురించి కనీసం తెలియకుండా ఇలాంటి ప్రమాదకర వ్యాఖ్యలు చేస్తారా? పైగా ఎంపీగా ఉన్న వ్యక్తికి ఇదేం తెగులు? రాముడినీ, భారతమాతనీ కూడా తమిళనాడు అంగీకరించదట. ఆ మాట చెప్పడానికి రాజా ఎవరు? తమిళులందరికీ ఇతడే ఏకైక ప్రతినిధా?**

రాజకీయ నాయకులు. ఒకే కుటుంబంలోని సభ్యులు ఎవరి పని వారు చేసుకుంటూ సుఖంగా, స్వేచ్ఛగా, ఉండగలుగుతున్నారు. అలాగే వసుధైవ కుటుంబం కావాలని, ప్రజలంతా ఆనందంగా జీవించాలని ఆర్షధర్మం ఆశిస్తున్నది. సనాతన ధర్మానికి ఈ రెండు సూత్రాలు నేత్రాలు.

ప్రస్తుతం స్వతంత్ర భారత్ ఈ సూత్రాన్ని అవలంబిస్తున్నది. భారత రాజ్యాంగం వ్యక్తి స్వాతంత్ర్యానికి మత స్వేచ్ఛకు తగినంత అవకాశం కల్పించింది. సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా రాజ్యాంగంలో పలు సంస్కరణలు జరిగాయి. రాజ్యాంగ అధికరణ 370లో చేసిన మార్పువల్ల ముస్లిం స్త్రీ సమాజానికి హార్దిక, ఆర్థిక, లాభాలు చేకూరాయి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం, దేశరక్షణ, సజావుగా సాగుతున్నాయి. మోదీ నాయకత్వం విశ్వానికే శిరోధార్యం అయింది. భారత్‌కు విశ్వగురుపీఠం దక్కింది. ఇవన్నీ సహించ లేని విపక్షాలు, ముఖ్యంగా డీఎంకే నాయకులు, విషం కక్కుతున్నారు. దేశాన్ని ఏకతాటిమీద నడిపించి పూర్వ వైభవాన్ని తేవాలని ప్రయత్నిస్తున్న ప్రధానిని గద్దెదింపడమే ప్రతిపక్షాల ఏకైక లక్ష్యం అయింది. "మేము సామాజిక న్యాయవాదులం" అంటూ బోరవిరుచుకుంటున్న రాజా లాంటి ప్రజానాయకు లకు భారతీయ సంస్కృతి, హిందూ నాగరికత గురించి ఏమాత్రం సదవగాహనలేదు. వారి సంకుచిత అభిప్రాయాలకు అంతేలేదు.



# ముదిరిపోతున్న

ఎంత అవినీతికైనా పాల్పడవచ్చు. దాని మీద జైలుకు వెళ్లి బెయిల్ మీద బయటకు వచ్చి ఉండవచ్చు. అయినా పులు కడిగిన ముత్యాల మాదిరిగా బీజేపీని విమర్శించడానికీ, దేశానికి నీతులు చెప్పడానికి దేశంలో చాలామంది రాజకీయ నాయకులు నిస్సిగ్గుగా ఎగబడుతున్నారు. ఎ.రాజా వైఖరి ఇందుకు సంబంధించినదే. హద్దు మీరి రాముడి మీద, రామభక్తుల మీద విరుచుకుపడడానికి, 'రాముడిని మేము ఒప్పుకోము, భారత్ ఒక దేశం కాదు; ఉత్తరాది హిందీ వర్గం అధికారం సహించం:' అంటూ శివాలెత్తడానికి అసలైన కారణం బీజేపీ ప్రభంజనం. అధికారం చేజారిపోతుందన్న భయం ఈ మేకపోతు గాంభీర్యానికి, అవాకులు చవాకులు వాగడానికి సిసలైన కారణం. అవినీతిలో కొత్త ఎత్తులు చూసినవాడు ఎ. రాజా. డీఎంకేలో భారీ, జాతీయ స్థాయి అవినీతి వ్యవహారాలకు రాజా ఆదిపురుషుడు. అతను కటకటాల వెనక్కి వెళ్లిన విషయం తమిళనాడు ప్రజలకు తెలియనిది కాదు. అతడి ఆవేశానికి ద్వేషం, నిరాశ, నిస్పృహ పునాదిరాళ్లు.

రాజా ఊకదంపుడు ఉపన్యాసంలోని అంశాలను పరిశీలిస్తే ఆంతర్యం బట్టబయలవుతుంది. ఇండియా రాష్ట్రంకాదు; ఉపఖండం అంటాడు. ఒకే రాష్ట్రం ఒకేదేశం, అన్న నినాదానికి, ఉపఖండానికి నడుమ గిరి గీయడం అతగాడి అవగాహనా లోపానికి నిదర్శనం. అనేక జాతులు, మతాలు, సంస్కృతులు, భాషలు, అనాదిగా మన భారతదేశంలో కొలువున్నాయని పూర్వ, పశ్చిమ, చారిత్రక మేధావి వర్గం ఇది వరకే చెప్పింది. "ఇండియా ఒక విచిత్ర చిత్ర ప్రదర్శనశాల" అని ప్రముఖ చారిత్రక శాస్త్రవేత్త, విన్సెంట్ స్మిత్ విస్పష్టంగా చెప్పాడు. రకరకాల వస్తువులు ఒకే చోట కలిసికట్టుగా ఉన్నట్టుగానే, జాతులు, మతాలు వగైరాలు భారతీయ మంటపాన కలిసిమెలసి ఉండేవని ఆయన అభిప్రాయం. భిన్నత్వంలో ఏకత్వం అన్న వాక్యార్థం తెలియక పోవడం వల్ల ఇలాంటి అనర్థాలు తెరపైకి తెస్తున్నారు

భారతీయులందరూ హిందువులే; హిందుత్వం జీవిత విధానానికి నిర్వచనం. హైందవ నాగరికత, సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం అని మేధావులు పదే పదే గుర్తు చేసినా రాజాలాంటి ఖల్‌నాయకులకు చెవికెక్కదు. ప్రస్తుతం వారు పదవులు చేపట్టడానికి, పెత్తనాలు చెలాయించడానికి, నోరు పారేసుకోడానికి, రాజ్యాంగమే కారణం అన్న విషయం తలకెక్కదు. ద్రవిడ నాయకులు చెబుతున్న సామాజిక న్యాయం (సోషల్ జస్టిస్) తమిళనాడులో కాగడా వేసి వెతికినా కనిపించడం లేదు. జనాభాలో 80% హిందువులే. వారి దేవాలయాలు శిథిలాలుగానే ఉండిపోవాలి. వారి దేవుళ్లను అవమానించినా, తిట్టిపోసినా, నోరు మెదపకూడదు. గతంలో అలాగే జరిగింది. కాంగ్రెసు ప్రభుత్వం కంటే ముందు రాముడిని ద్రవిడ పైత్యంతో చాలామంది ఘోరంగా అవమానించారు. చెప్పుల దండ మెడలో వేస్తుండగా, చూస్తూ నోరైనా మెదపలేదు ఆనాటి కాంగ్రెసు ప్రభుత్వం. మేము గాంధేయులం అంటూ గుండెలు బాదుకోవడం తప్ప

ఆయన చెప్పిన మాట ఒక్కటైనా పాటించలేక పోయారు. రాముడు అంటే బాపూకు ప్రాణం. ఆయన రామరాజ్యం కోసం తపించాడు.

ఈనాడు రాముడిపై రాజాదులు దాడులు చేస్తుంటే చూచి చూడనట్టు ఎందుకు ప్రవర్తిస్తున్నారో ప్రజలకు తెలుసు. కుటుంబ పాలన పునరుద్ధ రించడమే ధ్యేయం. లక్షకు పైచిలుకు హిందూ దేవాలయాలను, దయనీయమైన స్థితిలో ఉంచడం ఏ సామాజిక న్యాయమో స్టాలిన్ ప్రభుత్వం చెప్పాలి. హిందూ దేవాలయాలే ఎందుకు పన్ను చెల్లించు కోవాలో సిద్ధరాముడు వివరణ ఇవ్వాలి. ఎంతటి ప్రజాస్వామ్యం అయినా, వాక్ స్వాతంత్య్రం చాటున వ్యక్తిగతమైన దూషణ, మత విద్వేషం, క్షంతవ్యం కాదు. ఎంతటి గొప్పవాడైనా నేరానికి తగిన శిక్ష అనుభవించక తప్పదు.

అదే విధంగా, దూషణ భూషణ తిరస్కారాలు దైవ ప్రసాదాలుగా భావించి హిందూ సమాజం నోరుమూసుకుని ఉంటే అది చేతకానితనం అవుతుంది. చులకన చేస్తే ఉరుకోవడం ఆత్మగౌర వానికి, నిర్భరతకు అవమానకరం. రాముడు మర్యాదా పురుషోత్తముడు. ధర్మ ప్రభువు. రాజును అనుకుంటున్నంత రాజును క్షమించే విశాల హృదయం ఆయనది. అలాంటి “ధర్మ” రాజుకు కోపం వస్తే ఆగదు. దాని “పవరు” సముద్రుడికి బాగా తెలుసు. ఆనాడు తురుష్కులు, ఆ తరవాత మ్లేచ్ఛులు ఈ దేశాన్ని పరిపాలించారు. సనాతన ధర్మాన్ని కూలదోయడానికి రాక్షస చర్యలకు పాలుపడ్డారు. బాబరు, అక్బరు, భయాన, నయాన, దేశాన్ని ఏలగలిగారు. అయినా, హిందూధర్మాన్ని రూపు మార్చలేక పోయారు. అల్లావుద్దీన్, ఎంత హింసించినా హిందువులు సహించారు. సహనానికి ఒకహద్దు ఉంటుంది. అది కాస్తా చెరిగిపోతే ప్రళయమే.

“ఇండి” మార్కు విపక్షాలు, ఈ సత్యం ఎంత శీఘ్రంగా

# ద్రవిడ పైత్యం

గ్రహిస్తే, అంతమేలు జరుగుతుంది. స్వార్థం, సంకుచితత్వం, మితిమీరితే మరో చీకటి యుగం దేశాన్ని కబళిస్తుంది. చరిత్ర పునరావృత్తం కాకుండా చూడవలసిన బాధ్యత తమదీ అని రాజాదులు ఎంత త్వరగా తెలుసుకుంటే ఆరోగ్యానికి అంత మంచిది.

సాక్షాత్తు రాహుల్ గాంధీ, స్టాలిన్ కూడబలుక్కున్నట్టే ఇటీవల ఒక ప్రకటన వెలువడింది. అవును మాది కుటుంబ పాలనే అంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఒప్పేసుకున్నారు. అయితే ఇతర కుటుంబాలకు చేయూతనిచ్చే కుటుంబమని ముక్తాయించా రాయన. సనాతన ధర్మం మీద, పురాతన భారతీయత మీద విరుచుపడే డీఎంకే వంటి పార్టీలు, వాటి నాయకులు కుటుంబ పాలనను ఎలా సమర్థిస్తారు? ఈ ధోరణిని ఇండీ కూటమి సభ్యులు ఎలా సహిస్తారు? సనాతన ధర్మం మీద, రాముడి మీద ఇన్ని కారుకూతలు కూసినా ఇండీ భాగస్వాములు ఎందుకు నోరు విప్పరు? ఏమైనా హిందూ వ్యతిరేక పక్షాలకు, నాయకులకు గట్టి సమాధానం చెప్పవలసిన రోజు దగ్గరపడింది.

**– నిరామయ**

# డీఎంకే రాజకీయ సినిమాలో కొత్త పాత్ర ‘మత్తు’

ద్రవిడ పార్టీల కనుసన్నలలో నడిచే తమిళ సినీ, రాజకీయ రంగానికి ఇప్పుడు కొత్త కళ వచ్చింది. అంతర్జాతీయ మత్తుమందుల అక్రమ రవాణాదారు ఒకడు తోడయ్యాడు. అతడే జాఫర్ సిద్దికి. కొద్దిరోజుల క్రితమే ఇతడిని అరెస్టు చేశారు. అధికార డీఎంకేతోను, డీఎంకే పెద్ద కుటుంబంతోను సిద్దికి సంబంధాలు చాలా గట్టివే. నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అరెస్టు చేసిన సిద్దికి నిన్న మొన్నటిదాకా డీఎంకే సభ్యుడే. ఇతడు సినిమాలు కూడా నిర్మిస్తూ ద్రవిడ సిద్ధాంత శైలిలో కళాసేవ కూడా చేశాడు. ఇతడి చిత్రానికి దర్శకురాలు సాక్షాత్తు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కోడలే. ఆమె పేరు కిరుతిగ ఉదయనిధి. అధికార ద్రవిడ పార్టీ పెద్ద కుటుంబంతో సిద్దికికీ, సీనియర్ స్టాలిన్, జూనియర్ స్టాలిన్‌లకు ఉన్న బంధం ఎంత గట్టిదో కిరుతిగ సామాజిక మాధ్యమాలలో పెట్టిన అనేక పోస్టులు 70 ఎంఎంలో చూపిస్తాయని తమిళనాడు బీజేపీ మహిళా మోర్చా ఆరోపిస్తున్నది. సిద్దికి నిర్మాతగా స్టాలిన్ కోడలు కిరుతిగ దర్శకురాలిగా నిర్మించిన ఆ సినిమా పేరు మంగై. పైగా సినిమాలో మరెవరికీ వాటా లేకుండా ప్రతి పైసా సిద్దికియే పెట్టాడని బీజేపీ జాతీయ మహిళా మోర్చా



ఢిల్లీలో ఆరోపించింది.

మత్తుమందుల వ్యాపారంలో సిద్దికి వాటా తక్కువేమీ కాదు. ఇతడి లావాదేవీల విలువ రూ. 2000 కోట్లు. తమిళ చిత్రాలే కాకుండా, కొన్ని బాలీవుడ్ చిత్రాలు కూడా సిద్దికి నిర్మించాడని బయటపడింది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు బీజేపీ ప్రముఖుడు టామ్ వడక్కన్ డీఎంకే అంటే కొత్త నిర్వచనం ఇచ్చారు. డీ అంటే డ్రగ్స్, ఎం అంటే మార్కెటింగ్, కె అంటే యథాప్రకారం కళగం. అంటే సమూహం. స్టాలిన్, ఆయన ముఠా కలసి తమిళనాడు ప్రభుత్వాన్ని మత్తుమందుల విపణిగా మార్చేశాయని ఆయన అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో డీఎంకే కలసి పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీని కూడా వడక్కన్ నిలదీశారు. ఇలాంటి మత్తు మందుల వ్యాపారులతో సంబంధాలు ఉన్న పార్టీతో పొత్తు పెట్టుకోవడం మీకు సమ్మతమేనా అని ప్రశ్నించారు. సిద్దికి కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించాలని బీజేపీ కోరింది.

అంతర్జాతీయ మత్తుమందుల వ్యాపారి సిద్దికికీ, ప్రస్తుతం రాష్ట్రాన్ని ఏలుతున్న డీఎంకే పార్టీకి ఉన్న బంధం గురించి లోతైన దర్యాప్తు జరిపించాలని అన్నా డీఎంకే ప్రతినిధి బృందం గవర్నర్ ఆర్ఎన్ రవిని కలసి విజ్ఞప్తి చేసింది. డీఎంకే పెద్ద నాయకులకీ, ఆ పార్టీ నడుపుతున్న ఒక స్వచ్ఛంద సంస్థకీ కూడా సిద్దికి నిధులు ఇచ్చాడని అన్నా డీఎంకే నేత పళనిస్వామి ఆరోపించారు. ★

కథ

# జీవ గడి

స.రామనరసింహం

"అరవయ్యేళ్లకు పైగా తిరిగి అలసిపోయి ఆగిపోయింది మా గోడ గడియారం! సమయాన్ని నిక్కచ్చిగా చూపించే దాని ముళ్లయితే ఎన్ని మైళ్లు తిరిగాయో లెక్కే లేదు. దిగువ ఆ ఊగే ఇత్తడి బిళ్ల మా మనసుల్ని ఏళ్ల తరబడి అలా ఊపుతూనే ఉండేది." అన్నాడు రమణ.

" వారానికోసారి 'కీ' ఇవ్వాలి దానికి. కుర్చీ వేసుకుని పైకెక్కి ఏడుసార్లో, ఎనిమిదిసార్లో లెక్కపెట్టి ఇచ్చేవారు నాన్నగారు 'ఇంకా ఎక్కువసార్లు తిప్పితే ఏమవుతుంది?' అని చిన్నపుడు నేనొకసారి అడిగితే 'తాగుతోంది కదా అని చెల్లికి ఎక్కువ పాలు పడతామా? కక్కు కోదూ? అలాగే ఇదీనూ' అన్నారాయన. ఇంట్లో పాపాయిలా అంత ప్రేమగా చూసుకునేవాళ్లం ఆ గడియారాన్ని. ఎన్నడూ దానికి అనారోగ్యమూ చెయ్యలేదు, ఆగిపోనూ లేదు.

ఆర్నెల్లకో, ఏడాదికో కిందకి దింపి శుభ్రంగా తుడిచి, లోపల నూనెతో 'చక్ర' స్నానం చేయించేవాడు అన్నయ్య. లోపల చెయ్యి పెట్టి ఏదో తీగని కదిపితే ఎన్ని కావాలంటే అన్ని గంటలు కొట్టేది విసుగు లేకుండా. మేము చప్పట్లు కొడుతూ ఆనందపడి పోయేవాళ్లం .

నాన్నగారు కొన్న ఆ గడియారం ఆయన పోయిన పదోనాడు ఆగిపోయింది!

దాన్ని నడిపించడానికి అన్నయ్య విఫలయత్నం చేసాడు. టౌనుకు తీసుకెళ్ళి రిపేర్ చేయించాలి. నమ్మకంగా చేసే వాళ్లు దొరకాలిగా.

హైదరాబాదు నుంచి నేను వెళ్లినపుడు ఇంట్లోకి అడుగు పెడుతూనే చూసాను నడవలేని స్థితిలో, పలకలేని పరిస్థితిలో వృద్ధాశ్రమానికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న పండు ముసలి లాగా కనిపించిందది. బాధేసింది. నాతో బాటు తీసుకొచ్చా. అదే ఇది. రిపేరు చేసేవాళ్లెవరన్నా నీకు తెలిస్తే చెప్పు. ఎంత ఖర్చయినా ఫరవాలేదు" అన్నాడు రమణ గూట్లో నిలబెట్టిన గడియారాన్ని తన స్నేహితుడికి చూపిస్తూ.

"పాత గడియారాలు బాగు చేసే మనిషి దగ్గరలోనే ఒకతనున్నాడు. నేనా మధ్య చేయించాను." అంటూ ఆ వివరాలు చెప్పేడు స్నేహితుడు.

కొత్త గడియారాలు అమ్మే షాపది. అందులో ఒక పక్కగా ఒక వృద్ధుడు కంటికి చిన్న ఉగ్గు గిన్నెలాంటి భూతద్దం పెట్టుకుని వాచీ రిపేర్ చేస్తున్నాడు. "తీసుకురండి చూద్దాం" అన్నాడు. అతని పేరు ఖాసిం.

మర్నాడు గడియారంతో వచ్చిన రమణని కూర్చోమన్నాడు. అతడి వైపు నిర్లక్ష్యంగా చూస్తూ పక్కనే ఓ యువకుడు కొత్త గడియారాలని గుడ్డతో తుడుస్తున్నాడు. అతడు ఖాసిం కొడుకు. పేరు సలీం.

"ఇది నాకెంతో ప్రీతిపాత్రమైనది, విలువైనదీ భాయ్. కొద్ది శ్రద్ధగా చేసిపెట్టాలి" అన్నాడు రమణ గడియారం విప్పుతున్న ఖాసింతో. బాగా దుమ్ము పట్టింది సాబ్. సాఫ్ చేసి ఆయిలింగ్ చేసి చూస్తా. రెండు రోజులు పోయేక రండి." అన్నాడు. "అలాగే కానీ, ఇన్నిసార్లు చెబుతున్నానని ఏమనుకోవద్దు, దీన్లో పార్టులు, మిషనూ జాగ్రత్త. అంటే వేరే వాటితో కలవకుండా .. కాస్త నమ్మకంగా చేస్తావనీ..." అంటూ రమణేదో చెప్పబోతోంటే "ఏం ఫికర్ చెయ్యకండి సాబ్. దీని విలువ నాకు తెలుసు." అన్నాడు ఖాసిం. తండ్రినో తల్లినో ఆపరేషన్ థియేటర్లోకి పంపి వస్తున్నట్టు దాని వైపే చూస్తూ బయటకొచ్చాడు రమణ.

మూడు రోజుల తర్వాత ఓ సాయంత్రం వెళితే ఖాసిం లేడు దుకాణంలో, సలీం ఉన్నాడు. "మా నాయన రిపేర్ చెయ్యలేదు సార్, అట్లనే అంటాడు. రేపొచ్చి తీసుకుపోండి." అన్నాడు మొహం చిరాగ్గా పెట్టి. రమణ గుండెల్లో రాయి పడింది. దొరక్క దొరక్క బాగుచేసేవాడు దొరికేడనుకుంటే ఇదేవిటి?

మర్నాడు వెళితే "రెండు స్ప్రింగులు పోయాయి సాబ్. బాగా పాత మోడల్ కదా. ఇక్కడ దొరకవు. ఏదైనా పురానా గడియారం లోంచి తీసి వెయ్యాలి. ఎక్కడో అక్కడ సంపాదించి వేస్తాలెండి " అన్నాడు ఖాసిం. ఆశ చిగురించి ఆనందపడిపోయాడు రమణ.

"ఏమనుకోకు ఖాసిం భాయ్. నిన్న నీ కొడుకు తీసుకుపొమ్మన్నాడు" చెవిలో చిన్నగా అన్నాడు రమణ కాస్త దూరంగా కస్టమర్ తో మాట్లాడుతున్న సలీంకి వినబడకుండా.

"షాపంతా డొక్కు గడియారాలతోనూ, తుప్పు పట్టిన పార్టులతోను నింపేస్తున్నానని మావాడి కంప్లెంటు సాబ్. నిజానికి పాత గడియారాలని డబ్బుల కోసం కాదు నేను బాగుచేసేది. అదొక తృప్తి. ఆనందం. ఎందుకో చెప్పమంటారా? ఇప్పుడొచ్చే కొత్త గడియారాలు బ్యాటరీతో నడుస్తాయి. వాటిల్లో జీవం ఎక్కడుంది? ఈ పాత గడియారాల్లో అయితే ముచ్చటగా చక్రాలు, స్ప్రింగులు, తీగెలు అల్లినట్టు ఉంటాయి. దీన్ని చూడండి. లోపల ఎన్ని చక్రాలున్నాయో! ఈ పెద్ద చక్రం తిరిగితే దీని పక్కనున్న ఈ చిన్న చక్రం దీన్ని ఒరుసుకుంటూ తిరుగుతుంది. ఇది తిరిగితే దీని లోపల మరో చక్రం తిరుగుతుంది. ఇలా ఒకటి తిరిగితే మరొకటి, మరొకటి.. అలా మొత్తం గడియారం తిరుగుతుంది. ప్రతి చక్రం ప్రాణమున్న ఓ మనిషిలా అనిపిస్తుంది సాబ్ నాకు! ప్రతి మనిషి పక్కవాడికి సాయపడితే, ఆయన ఇంకొకడికి సాయపడతాడు. ఆయన మరొకడికి! అలా ఒకరినొకరు ఆదుకుంటేనే కదా ఈ సమాజం అనే గడియారం మంచిగా నడిచేది. నడవ గలిగినవాడు నడవలేని వాడిని నడిపించాలి. ప్రతి మనిషి ఇది ఇది తెలుసుకోవాలి సాబ్. 'పక్కవాడితో నాకు పనేంటి' అని అందరూ అనుకుంటే లోకం నడుస్తుందా చెప్పండి. ఏ గడియారాన్ని చూసినా నాకు ఇదే ఆలోచన.. మీరు నవ్వుతారేమో కానీ పాడైపోయిన గడియారాన్ని బాగు చేస్తున్నపుడల్లా నేనేదో సమాజాన్ని బాగు చేస్తున్నానన్న గొప్ప భావం ఏదో కలుగుతుంది సాబ్. అదో ఆనందం. అది నా కొడుక్కి అర్థం కాదు. అందుకే



వాడు చిరాకు పడుతున్నా నేను ఈ పాత గడియారాల్ని వదలడం లేదు. వాడి మాటలు మీరు కూడా పట్టించుకోకండి. పిల్లోడు". అన్నాడు ఖాసిం. కొడుకు విన్నాడో లేదో తెలియదు కానీ అతడు కూడా వినాలనే ఖాసిం గట్టిగా చెప్పాడని రమణ గ్రహించాడు.

గొప్ప జీవిత సత్యాన్ని ఎంత బాగా చెప్పావు ఖాసిం. సమాజం ఒక గడియారం. అందులో ఒకరికొకరు సహకరించుకునే చక్రాలం మనం. ఆహా.. గొప్ప ఊహ!" అంటూ రెండు చేతులూ జోడించాడు రమణ. ఓ ఐదు వందల నోటు పర్స్ లోంచి తీసి ఖాసిం చేతిలో పెట్టాడు బజానా అన్నట్టు.

'పాతబస్తీలో మా దోస్త్ ఒకాయన ప్రతి బేస్తవారం ఇక్కడికొస్తాడు. ఆయనకు గడియారాల దుకాణం ఉంది. స్ప్రింగులు ఆయన దగ్గర దొరుకుతాయి సాబ్. తీసి పెడతాను. సోమవారం రండి" అన్నాడు.

తరవాతి సోమవారం కూడా పని కాలేదు. దోస్తు వచ్చేడట కానీ స్ప్రింగులు తేలేదట. 'ఇదిగో తెస్తాడు అదిగో తెస్తాడు' అంటూ వాయిదాల మీద వాయిదాలు వేస్తూ నాలుగు వారాలు గడిపేడు ఖాసిం.

సార్. మీ గడియారం చాలా పాతది. దానికి సరిపడే స్ప్రింగులు దొరికేదాకా గేరంటీ లేదు. ఎందుకీ పాతది? మంచిగా కొత్తది ఇస్తా తీసుకోండి. ఐదారు వందల్లో క్లాసు గడియారాలున్నాయి మా షాపులో." అన్నాడు సలీం ఒకరోజు.

"కొత్తది కొనుక్కోలేక కాదు సలీం. ఇది మా నాయన గారు నేను పుట్టని క్రితం కొన్నది. ఆయన జ్ఞాపకార్థం దాచుకుంటున్నా. దీని గంటలు వింటూ ఉంటే నాబాల్యం, మావూరు, ఆ రోజులూ గుర్తుకొస్తాయి. ఈ పెండ్యులం ఊగుతూ ఉంటే మా ఇంటి వెనక చింత చెట్టుకి కట్టిన ఊయలలో ఊగుతున్నట్టుంటుంది. వేరే ఎవరికీ ఇవి చెప్పినా అర్థం కావు." అన్నాడు రమణ.

పోనీ ఒక పని చేద్దాం సార్. పాత మిషను తీసేసి ఈ డయల్ వెనక బాటరీ మిషన్ బిగించి ఇస్తా. చక్కగా మీకు మీ గడియారం తిరుగుతున్నట్టే ఉంటుంది. తేడా తెలియదు!" అన్నాడు సలీం.

ఇది వరకు కొట్టే గంటలు కొడుతుందా? కింద ఇత్తడి బిళ్ల ఊగుతుందా?"

సలీం నుంచి జవాబు లేదు. ఆ రెండూ సాధ్యం కావు మరి.

వారం గడిచేక ఓ రోజు ఆఫీస్ నుంచి వస్తూ షాపుకి వెళ్లాడు రమణ. ఖాసిం లేడు. ఆ తరువాత రెండు మూడు రోజులు దూరం నించే చూశాడు ఖాసిం కనబడతాడేమోనని. ఏదైనా ఊరెళ్లాడా?

చివరికి ఓ రోజు ధైర్యం చేసి అడిగితే "జొరమొచ్చింది. తగ్గేదాకా రాడు షాపుకి " అన్నాడు సలీం నిర్లక్ష్యంగా.

ఇంటి కొచ్చి సోఫాలో కూలబడ్డాడు రమణ. "ఎందుకంత హైరానా పడతారు? అతని వల్ల కాదు. ఒకవేళ రిపేర్ చేసినా వెయ్యో రెండు వేలో అడుగుతాడు. పాత గడియారానికి అంత పెట్టడం అవసరమా? తెచ్చి ఎక్కడ పెడతారు? హాల్లో ఉన్న గడియారం చాలదా మనకి?" అంది ఇల్లాలు మంచి నీళ్లిస్తూ .. అతడి మనసు చివుక్కుమంది .

పది రోజులైనా ఖాసిం షాపుకి రాలేదు. రమణకేదో కీడు తోచింది. డెబ్బై ఏళ్ల మనిషి.




వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతికి ఎంపికైన రచన

అతడికేమైనా అయితే ఇక తన గడియారం బాగు చేసేదెవరూ? ఒకవేళ అదే జరిగితే ? ఆగిపోయిన దాన్నే గోడకి తగిలించుకోవాలి. చలనం లేని ఆ మూగ గడియారం తననింకా ఏడిపించదూ! ఆ రాత్రి నిద్ర పట్టలేదతనికి.

సలీంకి తెలియకుండా అతని పక్క షాపతన్ని కలిసి ఖాసిం ఇంటి అడ్రసు సంపాదించి, ఓ సాయంత్రం వాళ్ల ఇంటికెళ్లాడు రమణ.

మంచం మీదున్నాడతడు. పలకరించి ధైర్యం చెప్పాలనుకున్నాడు కాని ఖాసిమే రమణకి ధైర్యం చెప్పాడు. "వర్రీ కావొద్దు సాబ్. ఇదిగో ఇంటికే తెచ్చిపెట్టుకున్నాను చూడండి." అంటూ తన పక్క గూట్లో గడియారాన్ని చూపించాడు. " మా దోస్తు రేపు ఇంటికొస్తాడు. స్ప్రింగులు వచ్చాయంటే రిపేర్ అయిపోయినట్టే. రెండు రోజుల్లో నా బీమారీ కూడా నయమైపోతుంది."

రమణ బయటకు వస్తూ ఉంటే డాక్టర్ ఎదురయ్యాడు. తెలిసిన డాక్టరే. అతను వెనక్కి వచ్చేదాకా బయట నిలబడి, రాగానే ఖాసిం పరిస్థితి గురించి అడిగాడు.

"కొన్ని టెస్టులు చేయించుకోవాలి. ఆ రిపోర్టులని బట్టి గాని చెప్పలేం. డబ్బు లేకో ఏమో టెస్టులు చేయించుకోవడం లేదు వీళ్లు" అన్నాడు డాక్టర్.

"కొడుకున్నాడుగా? అంత ఖర్చు పెట్టలేని స్థితిలో ఉన్నాడా తండ్రికి?" అనుకున్నాడు రమణ.

ఎప్పటికి ఖాసిం బాగుపడేనూ, ఎప్పటికి తన గడియారం తయారయ్యేను? ఎంతసేపూ ఇదే ఆలోచన.

ఒకసారి కూరగాయల మార్కెట్లో సలీం ఎదురుపడ్డాడు. "ఆగండి. మా నాయన్ని బతకనివ్వరా మీరు? మీ వల్లే ఆయన చచ్చిపోయేట్టున్నాడు

మతి చెడి ఇంటివైపు అడుగులు వేస్తున్న అతడికి ఒక్కసారిగా జ్ఞానోదయం అయింది! 'సలీం అన్నదాంట్లో తప్పేం వుంది? 'తనేమో తన గడియారం బాగుపడాలని కోరుకుంటున్నాడు. అలాగే సలీం కూడా తన తండ్రి బాగుపడాలని కోరుకుంటున్నాడు. జీవం లేని మర గడియారం కోసం తను! విలువైన తండ్రి ప్రాణం కోసం అతడు!!



మనశ్శాంతి లేకుండా! ఎందుకొచ్చారు మా ఇంటికి? వొద్దంటున్నా వినకుండా మీ గడియారమే ముందేసుకుని కూర్చుంటున్నాడాయన." అంటూ గట్టిగా అరిచేడు. చుట్టూ అందరూ వాళ్ల వైపే చూస్తున్నారు.

రమణ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. తనేం తప్పు చేశాడు? తన వల్ల ఖాసిం చచ్చిపోతాడా? ఎంత మాటన్నాడు! మనశ్శాంతి లేనిది తనకా? అతడికా? ఎందుకొచ్చిన తాపత్రయం ఇది? గడియారమూ వద్దు. ఖాసిమూ వద్దు. మనసు రాయి చేసుకోడానికి విశ్వప్రయత్నం చేశాడు రమణ.

మతి చెడి ఇంటివైపు అడుగులు వేస్తున్న అతడికి ఒక్కసారిగా జ్ఞానోదయం అయింది! 'సలీం అన్నదాంట్లో తప్పేం ఉంది? 'తనేమో తన గడియారం బాగుపడాలని కోరుకుంటున్నాడు. అలాగే సలీం కూడా తన తండ్రి బాగుపడాలని కోరుకుంటున్నాడు. జీవం లేని మర గడియారం కోసం తను! విలువైన తండ్రి ప్రాణం కోసం అతడు!!




ఏదో స్థిరమైన అభిప్రాయానికి మార్గం కనిపించి ఆనందం కలిగింది అతడికి. 'తన మర గడియారాన్ని బాగు చెయ్యగలిగిన స్థితిలో అతడు లేకపోవచ్చు కానీ అంతకంటే ఎంతో విలువైన ఆ 'జీవ గడియారా'న్ని బాగు చేసి, ఆగిపోకుండా చెయ్యగల స్తోమతు తనకుందిగా!' అనుకున్నాడు. ఖాసిం చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. తిరిగే చక్రం తిరగలేనిదాన్ని తిప్పాలి. మనిషికి మనిషి సాయపడాలి. అప్పుడే కదా సమాజం సక్రమంగా నడిచేది. ఎంతబాగా చెప్పాడు!!

ఆ సాయంత్రం రమణ ఖాసిం ఇంటికెళ్ళాడు. అతడి వెన్ను తట్టి ధైర్యం చెప్పాడు.

ఇంట్లోంచి బయటకు వస్తూ నాలుగు అడుగులు వెయ్యగానే ఎదురుగా వస్తూ కనిపించాడు సలీం. చూస్తూనే విరుచుకుపడ్డాడు. "ఎందుకొచ్చావ్ మా ఇంటికి? రావొద్దని చెబితే కాదా?" ఆవేశంగా అరుస్తూ చెయ్యి పైకెత్తి కొట్టబోయి, తమాయించుకుని ఒక్క తోపు తోసాడు విసురుగా వెనక్కి పడిపోయాడు రమణ. చేతిలోంచి సంచీ, దాని లోంచి గడియారమూ నేల మీద పడి దాని అద్దం ముక్కలై చెల్లాచెదురుగా నేల మీద పడ్డాయి! రమణ ఏమీ మాట్లాడలేదు. గాజు పెంకుల్ని మెల్లగా ఎత్తి సంచిలో వేసుకుంటున్నాడు.

గడియారాన్ని తీసుకుపోతున్నాడని అర్థమైంది సలీంకి. తను తొందర పడ్డాడా? ఒక్క క్షణం ఆగి, ఇంటి వైపు అడుగులేశాడు.

కొడుకును చూస్తూనే "రా బేటా రా" అంది ఖాసిం పక్కనే మంచం మీద కూర్చున్న అతడి తల్లి. "అయ్యో, ఇప్పుడే ఆ సాబ్ వచ్చి వెళ్లాడు. నువ్వు కూడా ఉండుంటే ఎంత సంతోషించేవాడివో. ఇదిగో వైద్య పరీక్షలు చేయించుకోమని చెప్పి, ఐదు వేలు మీ నాయన చేతిలో పెట్టేడాయన. రిపేర్ కాలేదని చెబుతున్నా 'వద్దం'టూ గడియారం తీసుకెళ్లిపోయాడు" అంది వంద నోట్ల కట్ట కొడుక్కి చూపిస్తూ.

వచ్చేవారం కథ..
**బిడ్డతల్లి - జిల్లేళ్ల బాలాజీ**




భారత్‌లో సంప్రదాయ టెస్టు క్రికెటర్ల రొట్టెవిరిగి నేతిలో పడింది. కనీవినీ ఎరుగని రీతిలో మ్యాచ్‌కు రూ. 60 లక్షల మ్యాచ్ ఫీజు ప్రోత్సాహకంగాను అందుకోబోతున్నారు. 'పెద్దమనుషుల క్రీడ కూటికా గుడ్డకా' అని అమ్మానాన్నలు ఈసడించుకొనే రోజులు పోయాయి. క్రికెట్ అంటే లక్షలు, కోట్లు సంపాదించుకొనే రాజమార్గం అనుకొనే రోజులు వచ్చాయి.

# భారత టెస్టు క్రికెటర్లకు కాసుల పంట!

కొండంత ప్రతిభకు గోరంత అదృష్టం జతకలిస్తే చాలు. ముంబై ఫుట్‌పాత్‌లపై పడుకొని, కడుపునింపుకోడానికి నానాపాట్లు పడి, రూ.ఐదు కోట్ల ఖరీదైన విలాసవంతమైన భవనంలో నివాసం ఉంటున్న యశస్వి జైశ్వాల్ లాంటి ఎందరో నేటితరం క్రికెటర్లు మనకు కనిపిస్తారు. క్రికెట్‌నే నమ్ముకొంటే, ఊపిరిగా చేసుకొంటే... అహరహం శ్రమిస్తే పల్లెటూరు కుర్రోళ్లు కాస్త పట్నం బుల్లోళ్లుగా మారిపోవచ్చనడానికి కుల్దీప్ యాదవ్, ధృవ్ జురెల్, నటరాజన్ లాంటి ఆటగాళ్లే తార్కాణం. ఏటా రెండు మాసాల పాటు సాగే ఐపీఎల్ ద్వారా కోట్ల రూపాయలు సంపాదిస్తున్న క్రికెటర్లకు సంప్రదాయ టెస్టుమ్యాచ్‌ల్లో పాల్గొనడం ద్వారా కోట్ల రూపాయలు సంపాదించే అవకాశాన్ని బీసీసీఐ కల్పించింది.

**టెస్టు క్రికెటర్లకు మంచిరోజులు....**

క్రికెట్లో మూడు విభాగాలు (టెస్టు, వన్డే, టీ-20) ఉన్నా... సంప్రదాయక టెస్టు క్రికెట్‌ను మాత్రమే అసలుసిసలు క్రికెట్‌గా పరిగణిస్తారు. రోజుకు 90 ఓవర్ల చొప్పున ఐదు రోజుల పాటు సాగే టెస్టుమ్యాచ్‌ల్లో రాణించాలంటే నేర్పు, ఓర్పుతో పాటు అంకితభావం, అంతులేని శారీరక శ్రమను ఓర్చుకొనే సత్తా ఉండి తీరాలి. అయితే..ఐపీఎల్ పుణ్యమా అంటూ అధికభాగం క్రికెటర్లు నాలుగు ఓవర్ల బౌలింగ్, 20 ఓవర్ల మ్యాచ్‌ల్లో పాల్గొనటానికే ప్రాధాన్యమిస్తున్నారు. టెస్టు క్రికెట్లో పాల్గొనటానికి ఏమాత్రం ఆసక్తి ప్రదర్శించడంలేదు.

కేవలం 8 వారాల క్రికెట్లోనే రూ.కోట్లు సంపాదించే ఉపాయంగా టీ-20 లీగ్‌లను నేటితరం క్రికెటర్లు పరిగణించే స్థితి దాపురించింది. ఈ పరిస్థితిని చక్కదిద్దటానికి ప్రపంచంలోనే భాగ్యవంతమైన భారత క్రికెట్ బోర్డు నడుం బిగించింది. టెస్టు క్రికెట్ ఆడే క్రికెటర్లకు భారీగా ప్రోత్సాహం అందించడానికి.. 2022-23 సీజన్ నుంచి' టెస్టు క్రికెట్ ప్రోత్సాహక పథకాన్ని' ప్రవేశ పెట్టింది.

**టెస్టుమ్యాచ్ ఆడితే 60 లక్షలు...**

ధూమ్ ధామ్ టీ-20 తుపానులో సంప్రదాయ టెస్టు క్రికెట్ కొట్టుకుపోకుండా బీసీసీఐ పటిష్టమైన చర్యలు చేపట్టింది. టెస్టుమ్యాచ్‌లు ఆడే ఆటగాళ్ల కోసం 'టెస్టు క్రికెట్ ప్రోత్సాహక పథకాన్ని' ప్రవేశపెట్టినట్లు బీసీసీఐ కార్యదర్శి జే షా ప్రకటించారు. టెస్టుమ్యాచ్‌లు ఆడటానికి ఆసక్తి చూపడంతో పాటు ప్రాధాన్యమిచ్చే ఆటగాళ్లకు 2022-23 సీజన్ నుంచి ఆడిన ఒక్కో టెస్టుకు రూ. 45 లక్షల వంతున అదనంగా చెల్లించనున్నట్లు బోర్డు ప్రకటించింది. ఇప్పటివరకూ ఆడిన ఒక్కో టెస్టుమ్యాచ్‌కు 15 లక్షల రూపాయలు మాత్రమే మ్యాచ్ ఫీజుగా బీసీసీఐ అందచేస్తూ వచ్చింది.

**ఏడాదికి రూ.4.5 కోట్లు ...**

భారతజట్టు ఓ సీజన్లో ఆడే మొత్తం 10 టెస్టుమ్యాచ్‌ల్లో 75 శాతం మ్యాచ్ లు ఆడే వారికి ఏడాదికి రూ. 4.5 కోట్లు చొప్పున చెల్లిస్తారు. మ్యాచ్‌కు 15 లక్షల మ్యాచ్ ఫీజుతో పాటు ప్రోత్సాహకంగా రూ. 45 లక్షలు అదనంగా అందచేయనున్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జడేజా, బుమ్రా, అశ్విన్, పూజారా, ఉమేశ్ యాదవ్ లాంటి ఆటగాళ్లు 2022-23 సీజన్ నుంచి రూ. 4.5 కోట్లు వంతున అందుకోనున్నారు. భారత్ ఆడే మొత్తం టెస్టుమ్యాచ్‌ల్లో పాల్గొనే ప్లేయర్లకు మ్యాచ్ ఫీజు రూ. 1.5 కోట్లతో పాటు రూ. 4.5 కోట్లు ప్రోత్సాహకంగా అందచేస్తారు.

**సీజన్ కు 45 కోట్ల బడ్జెట్....**

టెస్టు క్రికెటర్ల ప్రోత్సాహక పథకం కోసం బీసీసీఐ సీజన్‌కు రూ. 45 కోట్లు అదనంగా కేటాయించింది. 2023-24 సీజన్ కు సైతం ఈ పథకాన్ని వర్తింప చేస్తారు. భారత అగ్రశ్రేణి క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జడేజా, బుమ్రా వార్షిక కాంట్రాక్టు కింద ప్రస్తుతం ఏడాదికి రూ. 7 కోట్లు చొప్పున గ్యారెంటీ మనీగా అందచేస్తూ వస్తోంది. దీనికి అదనంగా టెస్టు క్రికెటర్ల ప్రోత్సాహక పథకం కింద మ్యాచ్ ఫీజుతో కలుపుకొని మరో రూ. 6 కోట్లు చొప్పున చెల్లిస్తారు. అంటే..ఐపీఎల్ కాంట్రాక్టుల ప్రమేయం లేకుండా సీజన్‌కు రూ. 13 కోట్లు అగ్రశ్రేణి ఆటగాళ్లకు దక్కనున్నాయి.

2023-24 సీజన్లో భారత్ ఆడిన మొత్తం 10 టెస్టుల్లో పాల్గొన్న రోహిత్ శర్మ రూ. 13 కోట్లు అందుకోనున్నాడు. కేవలం టెస్టు క్రికెట్ ఆడటం ద్వారానే రూ. 6 కోట్లు అందుకొనేలా బీసీసీఐ చర్యలు చేపట్టింది. సీజన్ కు 5 నుంచి 6 టెస్టు మ్యాచ్‌లు ఆడే ఆటగాళ్లకు రూ. 1.8 కోట్ల చొప్పున చెల్లిస్తారు. ఈ పథకం కేవలం భారత పురుషుల టెస్టు జట్టుకు మాత్రమే వర్తిస్తుందని బీసీసీఐ స్పష్టం చేసింది. ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే ఈ తరహా పథకాన్ని అమలు చేస్తున్న ఏకైక క్రికెట్ బోర్డు బీసీసీఐ మాత్రమే. మొత్తంమీద టెస్టు క్రికెటర్ల రొట్టె విరిగి నేతిలో పడిందనే చెప్పాలి.

**దేశవాళీ క్రికెట్లో రోజుకు 50 వేలు.....**

దేశవాళీ (రంజీ ట్రోఫీ, దులీప్ ట్రోఫీ, ఇరానీ ట్రోఫీతో సహా) క్రికెట్ మ్యాచ్‌ల్లో పాల్గొనే క్రికెటర్ల మ్యాచ్ ఫీజులను సైతం బీసీసీఐ భారీగా పెంచింది. క్రికెట్ నే వృత్తిగా చేసుకొని జీవించే ఆటగాళ్ల గౌరవంగా బతకటానికి ఏడాదికి రూ. 25 లక్షలు మ్యాచ్ ఫీజుగా సంపాదించుకొనే అవకాశం కల్పించింది.

దేశవాళీ క్రికెట్ మ్యాచ్ ఏదైనా ఆడిన ఆటగాడికి రోజుకు రూ. 50 వేల చొప్పున చెల్లించనున్నారు. మహిళా క్రికెటర్లకు సైతం పురుషులతో సమానంగా బీసీసీఐ మ్యాచ్ ఫీజులు చెల్లించడం విశేషం. ఏదిఏమైనా రోజుకు 3 రూపాయలు బేటాగా రంజీ క్రికెటర్లు తీసుకొనే రోజులు పోయి..రోజుకు 50వేల రూపాయలు చొప్పున అందుకొనే స్థాయికి భారత క్రికెట్ ఎదగడం వెనుక ఆటగాళ్లతో పాటు బీసీసీఐ కృషి, ప్రపంచీకరణ పాత్ర అంతాఇంతాకాదు. ప్రతిభ ఉంటే చాలు... క్రికెట్ ద్వారా కోటీశ్వరులు కావడం ఏమాత్రం కష్టంకాదు. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# అతిపెద్ద సేవా సంస్థ ఆర్‌ఎస్‌ఎస్

**విశాఖపట్నం:** హిందూ అనే పదం భారతీయుల జీవన విధానాన్ని చెప్పేదేనని, కొన్ని కారణాల వలన ఆ జీవన విధానంలోని ఔదార్యాన్ని పోగొట్టు కున్నామని వైజాగ్ కన్వెన్షన్ చైర్మన్ పి.వి.నరసింహా రావు అన్నారు. విశాఖ మహానగర్ ఆర్.ఎస్.ఎస్ శాఖ ఏర్పాటు చేసిన మహాసాంఘిక్ మార్చి 10వ తేదీన విశాఖ పోర్టు స్టేడియంలో జరిగింది. కార్య క్రమానికి నరసింహారావు ముఖ్యఅతిథిగా విచ్చేసారు.



ఆసీనులైన పురప్రముఖులు




ప్రసంగిస్తున్న భరత్‌కుమార్

ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో 1,60,000 స్థలాలలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని, సంఘం ప్రపంచంలోనే అతి పెద్ద సేవా సంస్థ అని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యవక్త ఆర్.ఎస్.ఎస్ దక్షిణ మధ్య సహ క్షేత్రప్రచారక్ భరత్‌కుమార్ ప్రసంగిస్తూ సమాజంలో పరివర్తన తీసుకునిరావడానికి ఆర్‌ఎస్‌ఎస్ ఆరంభమైందని అన్నారు. అయోధ్యలో బాలరాముని మందిర నిర్మాణం జరిగింది, శ్రీరాముని పూజించడ మంటే ఆయన జీవితకాలంలో ఆయన ఆచరించిన జీవన విలువలను హిందువులమైన మనమందరం మన జీవితకాలంలో ఆచరించాలి, అప్పుడే హిందువులకు మోక్షం కలుగుతుందని చెప్పారు.

'మనకు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరా లయింది. అయినా పాశ్చాత్య బానిస చిహ్నాలు మిగిలి ఉన్నాయి. వాటిని తొలగించుకుంటేనే మనం పూర్తిగా స్వతంత్రులమయినట్లు భావించాలి. ఉదాహరణకు ఢిల్లీలో ఇండియా గేట్ వద్ద జార్జ్ చక్రవర్తి విగ్రహం ఉండేది. దాని స్థానంలో స్వాతంత్ర్య సమరవీరుడు నేతాజీ విగ్రహం 2022 సంవత్సరంలో ప్రతిష్టిం చారు. అలాగే బ్రిటిష్‌వారి పేర్లతో పిలువబడుతున్న అండమాన్ దీవుల పేర్లను భారత స్వాతంత్ర్య వీరుల పేర్లతో పిలుచుకుంటున్నాం అని భరత్ గుర్తు చేశారు. 'జనవరి 29, 1947న సైన్యంలో బీటింగ్ ట్రీట్ జరిగింది. అది ఇంగ్లండ్ రాణి వివాహ సమయంలో పాడిన క్రైస్తవ ప్రార్థన. దానినే మన సైన్యంలో ఇప్పటివరకు పాడుకున్నాం. ప్రస్తుతం ఆ పాట స్థానంలో భారతీయ ప్రముఖ గాయని లతా మంగేష్కర్ పాడిన "యే మేరే వతన్ కే లోగో" పాటను పాడుతున్నారు అని చెప్పారు. పాశ్చాత్యీకరణ నుంచి బయటపడి భారతీయ సంస్కృతిని, ధర్మాన్ని రక్షించుకుంటూ విశ్వగురువుగా మనదేశాన్ని నిలబెట్టాలని ఆయన కోరారు.

5 విషయాలను ఆచరించినట్లయితే సమాజంలో పరివర్తన జరుగుతుందని వారన్నారు.

**1.సామాజిక సమరసత–** సమాజంలోని వారందరూ భరతమాత బిడ్డలే. కుల,వర్గ,మత ప్రాదిపదికన విడిపోకుండా అందరం కలసి ఒకరినొకరిని గౌర వించుకుంటూ జీవించాలి. సమాజంలోని అందరూ సమానమే అనే భావనతో జీవించాలి. శ్రీరాముడు వనవాస సమయంలో గుహునితో, శబరితో వ్యవహరించిన తీరు ఎప్పటికీ మరువరానిది. ఆచరణ యోగ్యమైనది. శ్రీరామునిలా సమాజంలోని అందరూ సమానమే అనే భావనతో జీవించాలి.

**2.కుటుంబ ప్రబోధన్:** మన పిల్లలకు విలువైన వస్తువులను ఇస్తున్నాం కాని విలువైన జీవన విలువలను ఇవ్వడంలేదు. జీవన విలువలను పాఠశాల, కుటుంబాలద్వారా మన పిల్లలకు అందించడంవలన భావి తరాలకు అందుతాయి.


**3.పర్యావరణ పరిరక్షణ:** హిందువులు ప్రకృతి ఆధారంగా జీవిస్తున్నారు. మొక్కలు నాటడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలి. వృక్షాలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి. ప్లాస్టిక్ వాడకం ఆపేయాలి. దాని ద్వారా ప్రకృతిని రక్షించుకోగలం.

**4. మన భాషను–వేషధారణను**, మనదైన సంస్కృతిని కాపాడుకోవాలి. మాతృభాషను, మాతృదేశాన్ని గౌరవించాలి.

**5. పౌరనియమాలు :** ఒక పౌరుడిగా మన బాధ్యతను మనం నిర్వర్తించాలి. ఒకరు చూస్తు న్నారనో లేదా చూడడం లేదనో మనం ప్రవర్తించ కూడదు. శ్రీరాముడు 14 సంవత్సరాల వనవాస కాలంలో తాను నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని ఎవరు చూసినా, చూడకపోయినా నిర్వర్తించారు. (ఉదా: వనవాస కాలంలో నగరాలకు,గ్రామాలకు శ్రీరాముడు వెళ్ల కూడదు. అలా కిష్కింధకు వెళ్లి నప్పుడుగాని, లంకకు వెళ్లినప్పుడు గాని ఎవ్వరి ఇళ్లకు వెళ్లలేదు. చివరికి ఆ నగరంలో కూడా ప్రవేశించ లేదు) మనం ప్రభుత్వ నియమనిబంధనలను, విధానాలను గౌరవించాలి.

ఆర్‌ఎస్‌ఎస్ సమాజాన్ని సంఘటిత పరచి, సమాజంలో చైతన్యాన్ని తీసుకువచ్చి ప్రతి వ్యక్తిలో దేశభక్తి భావనను నింపి తద్వారా ఈ దేశాన్ని 'విశ్వ గురువు'గా నిలబెట్టడానికి మనమందరం తనవంతు కృషిని సల్పుతూ కలసి పనిచేద్దాం అని భరత్ పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో సుమారు 5000 మంది పాల్గొన్నారు. ★



స్వయంసేవకుల శారీరికప్రదర్శనలు

# మాతృభూమికై శివార్చన







**ఆర్**.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అఖిల భారతీయ ఘోష్ కేంద్ర దివస్‌లో భాగంగా మార్చి 8, శివరాత్రి రోజున ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖ మహానగరాలతోపాటు 19 జిల్లాలలోని 51 స్థలాలలో 124 దేవాలయాల కేంద్రంగా 694 మంది ఘోష్‌వాదకులతో శివార్చన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఘోష్ వాదకులైన స్వయంసేవకులు భారతీయ సంగీతంతో కూడిన వివిధ రచనలతో చేసిన వాదన భక్తులకు భక్తి పారవశ్యాన్ని కలిగించింది.

# మదనపల్లెలో బాలమేళా








**మదనపల్లె:** సేవాభారతి మాధవసేవాసమితి ఆధ్వర్యంలో మదనపల్లెలో, బిసెంట్ దివ్యజ్ఞాన కళాశాలలో మార్చి 10న బాలమేళా జరిగింది.

ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా శ్రీ సాయిచైతన్య జూనియర్ కళాశాల చైర్మన్ నిర్మల్‌కుమార్ రెడ్డి, విశ్రాంత వైమానిక దళ అధికారి డాక్టర్ పరంధాం గౌడ్, ఆర్ఎస్ఎస్ విభాగ్ సహకార్యవాహ బురుసు రాజేంద్రప్రసాద్, విభాగ్ సేవాప్రముఖ్ ముట్ర కొండారెడ్డి ప్రసంగించారు.

ఈ కార్యక్రమానికి విశ్రాంత రైల్వే అధికారి బాబు విద్యాసాగర్, ప్రముఖ న్యాయవాది బాలజ్యోతి మాధవ సేవాసమితి సభ్యులు, నగర స్వయం సేవకులు, అభ్యాసిక ఉపాధ్యాయినులు, 200కు పైగా బాలబాలికలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రార్థనా శ్లోకాలు మొదలుకొని, వ్యాయమ్‌యోగ్, సూర్యనమస్కారాలు, నృత్య ప్రదర్శనలు, చెక్క భజనలు, కోలాటం, నాటికలతో బాలబాలికలు చేసిన ప్రదర్శనలు సభికులను ఆనందింపచేశాయి. ★

# బాల జాగృతి


## జగన్నాథస్వామి ఆలయం



### తెలుసుకుందాం

ఒడిశాలోని గుణుపూర్ పట్టణానికి తూర్పున ఈ ఆలయం కొలువుదీరింది. జగన్నాథస్వామి , బలభద్రుడు, సుభద్రలు ఈ ఆలయంలోని ముఖ్య ప్రధాన దేవతలు. జైపూర్ మహారాజు విక్రమదేవ్ సుమారు వందేళ్ల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు చుట్టు పక్కల ప్రాంతాల వారితో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా వస్తుంటారు. ఈ ఆలయంలో ఏటా రథోత్సం వైభవంగా నిర్వహిస్తారు.

## కథ | పావురం - కాకి



ఒక గ్రామంలో చెట్టు మీద ఒక పావురం గూడు కట్టుకుని నివసించేది. ఆ చెట్టు పక్కనే ఒక ఇల్లు ఉండేది.

ఆ ఇంటి గృహిణి రోజూ ఆ చెట్టు ముందు గింజలు వేసేది. పావురం చెట్టు దిగి, ఆ గింజలు తిని వెళ్లేది. ఇలా కొంతకాలం గడిచింది.

ఒకరోజు ఒక కాకి వేరే ఊరి నుండి ఆ గ్రామానికి వచ్చి, పావురం ఉండే చెట్టుపై వాలింది.

ఆ గృహిణి గింజలు చల్లడం, పావురం తినడం చూసింది.

"ఆహా! ఈ పావురం ఎంత హాయిగా జీవిస్తోంది. ఆహారం కోసం వెతికే అవసరమే లేదు దానికి. నేను కూడా ఇక్కడే ఉండి ఈ ఇంట్లోని ఆహారం తినవచ్చు. కష్టపడి ఆహారం వెతికే అవసరం ఉండదు... అని మనసులో అనుకుంది.

వెంటనే ఆ కాకి... పావురానికి కల్లబొల్లి కబుర్లు చెప్పి దానితో స్నేహం చేసింది.

"కాకి మిత్రమా! నువ్వు ఇక్కడే ఉండవచ్చు. కానీ నీ ఆహారం నువ్వే సంపాదించుకో. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఇంట్లో ఆహారం దొంగిలించవద్దు" అని షరతు పెట్టింది పావురం.

తను అక్కడ ఉండాలనుకునేదే ఆ ఇంట్లో ఆహారం కోసం. అయినా ఆ సమయానికి 'సరే'

## పద్యము

తనయుడు చెడుగై యుండిన
జనకుని తప్పన్నమాట సత్యమెఱుగుఁ నా
వున నీ జననీ జనకుల
కు నపఖ్యాతి యగురీతి గొనకు కుమారా!

**భావం :** ఓ కుమారా! కుమారుడు దుర్మార్గుడైన తండ్రిదే తప్పు అని యందురు. కాబట్టి నీ తల్లిదండ్రులకు అపకీర్తి వచ్చునట్టి మార్గమును పూనవలదు.

## శ్లోకము

న అన్నోదక సమం దానం..

'న అన్నోదక సమం దానం
న తిథిర్ద్వాదశీ సమా
న గాయత్ర్యాః పరో మంత్రో
న మాతుః పరదైవతమ్'

**భావం :** అన్నపానీయాల దానంతో సమమైనది లేదు. ద్వాదశి కన్నా విశిష్ట తిథిలేదు. గాయత్రీ మంత్రం కంటే ఉన్నతమైనది, అవనిలో అమ్మకు మించిన దైవం లేదు.

## జత పరచండి


ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| రహస్యం | గరిష్ఠం |
| స్వాధీనం | బహిరంగం |
| కనిష్ఠం | పరాధీనం |
| వక్త | దుర్జనుడు |
| ప్రాచీనం | శ్రోత |
| సజ్జనుడు | నవీనం |

సమాధానాలు : రహస్యం-బహిరంగం; స్వాధీనం-పరాధీనం; కనిష్ఠం-గరిష్ఠం; వక్త-శ్రోత; ప్రాచీనం-నవీనం; సజ్జనుడు-దుర్జనుడు.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### యదునాథ్ దత్తాత్రేయ్ థత్తే



మహారాష్ట్రకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల్లో యదునాథ్ కూడా ఒకరు. పాత్రికేయుడు, రచయిత, సామాజిక కార్యకర్త కూడా. ఈయన అక్టోబరు 5, 1922న నాసిక్ జిల్లాలో యెయోలాలో జన్మించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ఆరు నెలల జైలు శిక్ష అనుభవించారు. హోమీ జహంగీర్ భాభా, నీల్స్ బోర్, సీవీ రామన్, ఎర్నెస్ట్ ఆర్. ఫోర్డ్, సతీష్ చంద్ర దాస్‌గుప్తా, జగదీష్ చంద్రబోస్ మొదలైన ముఖ్య వ్యక్తుల జీవిత చరిత్రలతోపాటు, పలు పుస్తకాలు రాశారు. మే 10, 1998న తుదిశ్వాస విడిచారు.



అంది కాకి,

కొన్నిరోజుల పాటు ఆ కాకి అక్కడే ఉంటూ, బయట ఆహారం సంపాదించుకునేది.

ఒకరోజు ఆ ఇంట్లో నుండి చేపల వాసన వచ్చింది కాకికి. ఆ సమయంలో పావురం బయటకు వెళ్లింది. అదును కోసం ఎదురు చూస్తున్న కాకి వెంటనే ఆ ఇంట్లోకి దూరి చేపల కోసం వెతక సాగింది. తొందరలో కాకి ఒక పళ్లాన్ని పడేసింది. ఆ చప్పుడు విని గృహిణి అక్కడికి వచ్చింది. కర్రతో ఆ కాకిని తరిమేసింది.

'బతుకుజీవుడా!' అనుకుంటూ కాకి ఆ గ్రామాన్నే వదిలి వెళ్లిపోయింది.

విషయం తెలుసుకున్న పావురం చాలా బాధపడింది. ఎవర్నీ అంత సులభంగా నమ్మవద్దని గ్రహించింది. ★

## జనరల్ నాలెడ్జ్

1. మానవ శరీరంలో అత్యంత బలమైన ఎముక ఏది?
2. ఏ దేశంలో భారతీయులు ఎక్కువగా నివసిస్తున్నారు?
3. భారతదేశంలో పంటలకు అత్యంత ముఖ్యమైన నీటిపారుదల వ్యవస్థ ఏది?

సమాధానాలు : 1. దవడ ఎముక; 2. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా; 3. కాలువలు

## మెదడుకు మేత

కిటకిట బండి కిటారు బండి.
ఎందరు కూర్చున్నా విరగని బండి.

జవాబు : రైలు

## మంచిమాట

ఆలోచనలు ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలి. ఎందుకంటే మన ఆలోచనలే మన మాటల్లో ప్రతిబింబిస్తాయి.




# వారఫలాలు

18-24 మార్చి 2024



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

రాబడి ఆశాజనకంగా ఉంటుంది. బంధువుల నుంచి కీలక సమాచారం అందుతుంది. సంఘంలో పలుకుబడి పెంచుకుంటారు. వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. చర్చలు ఫలిస్తాయి. ఆలయాలు సందర్శిస్తారు. కళాకారులకు ఊహించని అవకాశాలు. రచయితలు, క్రీడాకారులు లక్ష్యసాధనలో ముందుకు సాగుతారు. 23,24 తేదీల్లో అనుకోని ఖర్చులు. కుటుంబసమస్యలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆదాయం తగ్గి కొంత గందరగోళానికి గురవుతారు. ఆత్మీయుల నుంచి అందిన సమాచారం ఇబ్బంది కలిగిస్తుంది. కొన్ని కార్యక్రమాలు మధ్యలోనే విరమించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు కొద్దిపాటి లాభాలతో సరిపెట్టుకోవాలి. కళాకారులకు ఒత్తిడులు ఎదురవుతాయి. 22,23 తేదీల్లో శుభ వార్తలు. ఆకస్మిక ధనలబ్ధి. ఆహ్వానాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ముఖ్యమైన కార్యక్రమాలలో అవాంతరాలు తొలగుతాయి. అదనపు ఆదాయం సమకూరుతుంది.. గతంలో చేజారిన ౖ లభ్యమవుతాయి. ౦చనలు పాటిస్తారు. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాల పూర్తి చేస్తారు. రాజకీయవేత్తల ప్రయత్నాలు సఫలం. పరిశోధకులు, వైద్యుల ఆశయాలు నెరవేరతాయి. 18,19 తేదీలలో దూరప్రయాణాలు. శారీరక రుగ్మతలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

ఆత్మీయుల ఆదరణ, సహాయంతో ముందుకు సాగుతారు. అనుకున్న రాబడి సమకూరుతుంది. ౖవివాదాలు కొలిక్కి వస్తాయి. సమాజసేవలో పాలుపంచుకుంటారు. కార్యక్రమాలు కొంత కష్టమైనా సకాలంలో పూర్తి చేస్తారు. రాజకీయవేత్తలు సత్తా చాటుకుంటారు. కళాకారులు, పరిశోధకులకు మరింత సంతోషదాయకంగా ఉంటుంది. 23,24 తేదీల్లో బంధువులతో తగాదాలు. మానసిక అశాంతి. అనారోగ్యం. సూర్యస్తోత్రాలు పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

అప్రయత్న కార్యసిద్ధి. ఆశ్చర్యకరమైన రీతిలో రాబడి సమకూరుతుంది. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆస్తులు, వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు భాగస్వాములతో ఒప్పందాలు చేసుకుంటారు. క్రీడాకారులకు కొత్త అవకాశాలు దక్కుతాయి. 21,22 తేదీల్లో వ్యయప్రయాసలు. అనారోగ్యం. శ్రమాధిక్యం. రాఘవేంద్ర స్తోత్రాలు పఠించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

కొత్తకార్యక్రమాలు చేపడతారు. ఆస్తులు కొనుగోలు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. శ్రమ ఫలించి విద్యార్థులు ముందుకు సాగుతారు. వ్యాపారులు కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఉద్యోగస్తులకు సంతోషకరమైన విషయాలు తెలుస్తాయి. రచయితలు, క్రీడాకారుల ఆలోచనలు ఫలిస్తాయి. 18,19 తేదీలలో అనుకోని ప్రయాణాలు. వృథా ఖర్చులు. శివస్తోత్రాలు పఠించండి.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ముఖ్యమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. కీలక సమావేశాలకు హాజరవుతారు. రాజకీయవేత్తలకు సంతోషకరమైన సమాచారం అందుతుంది. కళాకారులు, రచయితల శ్రమ ఫలిస్తుంది. 19,20 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు, విష్ణుధ్యానం చేయండి.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆదాయం మెరుగ్గా ఉండి కొన్ని అప్పులు తీరతాయి. కార్యక్రమాలలో ఆవాంతరాలు అధిగమిస్తారు. భూములు, వాహనాలు కొనుగోలు యత్నాలు సానుకూలం. పరిస్థితులు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు కీలక సందేశం అందు తుంది. రచయితలు, క్రీడాకారులకు శుభవర్త మానాలు. 20,21 తేదీల్లో అనారోగ్యం. స్నేహితులతో విభేదాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఎంతటి వ్యక్తినైనా వాగ్ధాటితో ఆకట్టుకుంటారు. ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆలోచనలు తక్షణం అమలు చేస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. కొన్ని నిర్ణయాలు అందర్నీ మెప్పిస్తాయి. వ్యాపారులు ఒడుదొడుకులను అధిగిస్తారు. పరిశోధకులు, క్రీడాకారులకు నూతనోత్సాహం. 22,23 తేదీల్లో మానసిక అశాంతి. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొత్త వ్యూహాలతో ముందడుగు వేస్తారు. ఆరోగ్యం కొంత ఇబ్బంది కలిగించినా ఉపశమనం పొందుతారు. చిరకాల ప్రత్యర్థులు స్నేహితులుగా మారతారు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. వ్యాపారులకు మరింత లాభాలు అందుతాయి. రాజకీయవేత్తలు పదవీయత్నాలు ఫలిస్తాయి. 19,20 తేదీల్లో మానసిక అశాంతి. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

పరిస్థితులు క్రమేపీ చక్కబడతాయి. ఆలోచనలు అమలులో ఆటంకాలు తొలగుతాయి. ఆదాయం కొంత మెరుగుపడే సూచనలు. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. ఉద్యోగులకు విధుల్లో అనుకూలత. పారిశ్రామికవేత్తలు సంస్థల విస్తరణలో విజయం పొందుతారు. 18,19 తేదీల్లో వృథా ఖర్చులు. ఆరోగ్య సమస్యలు. హనుమాన్ చాలీసా పఠించండి.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

అనుకున్న కార్యక్రమాలు కొంత నిదానంగా కొనసాగిస్తారు. ఆత్మీయుల నుంచి కొన్ని సమస్యలు ఎదురుకావచ్చు, తరచూ ప్రయాణాలు సంభవం. ఆదాయ, వ్యయాలు సమానస్థాయిలో ఉంటాయి. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉపశమనం లభిస్తుంది. పారిశ్రామికవర్గాలకు కంపెనీల ఏర్పాటు విజయం. కళాకారులు, వైద్యులకు కొంత అనుకూల స్థితి. 22,23 తేదీల్లో కుటుంబంలో సమస్యలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

# పదరసం-456

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | | 3 | | 4 | | 5 |
| | | | 6 | | | | | | |
| 7 | | 8 | | | 9 | 10 | | | |
| | | | | 11 | | | | | |
| | 12 | | | | | | | 13 | |
| | | | | | | 14 | | | |
| 15 | | | 16 | | | | | | |
| | | 17 | | | | 18 | | | 19 |
| 20 | | | | | 21 | | | | |
| | | | | 22 | | | 23 | | |

## ఆధారాలు

**అడ్డం**

1) నిండు సభ (4)
3) కఠినం, తీవ్రం (3)
6) కూరగాయలతో చేసిన పప్పుపులుసు (3)
7) కోడళ్ళను పెట్టే సాధింపు (4)
9) వళ్ళు పొగరు లాంటిది (5)
12) వీణ వాయించే విద్వాంసుడు (4)
13) పశుపక్ష్యాదులను పట్టుకోవడానికి వేసే ఆహారం (2)
14) క్రీగంట, తలుపు కొంత మూయు (3)
15) పరాక్రమం (2)
16) అత్యాశతో అరాటపడు (4)
18) (ఎందుకూ) పనికిరాని (4)
20) శ్రీకృష్ణుని బాల్యస్నేహితుడు, నిరుపేద (4)
21) జంతువులను బంధించే పంజరం, న్యాయస్థానాలలో సాక్షులు నిలబడేచోటు(2)
22) చేయి (2)
23) ధ్వని (3)

**నిలువు**

1) ప్రతిదానికీ గొడవ పెట్టుకునేవాడు (4)
2) బాణాసంచా తయారీలో వాడే రసాయనంలో వత్తు లోపించింది (3)
3) మచ్చ (3)
4) తలక్రిందులైన సంసారం (3)
5) స్థిరంగా ఉండేచోటు (3)
8) టీక, సంగ్రహ వ్యాఖ్య (3)
10) ప్రాపు, తోడ్పాటు పైకొచ్చింది (2)
11) కలిసి అల్లరి చేసే పిల్లల్ని ఇలా అనడం రివాజు (5)
12) ఒక రత్నం (3)
13) తేరిపార (4)
14) సహించు (4)
15) సూతుడు ఈయనతోటి మునులకు ఎన్నో పురాణాలు బోధించాడు (4)
17) దమయంతిని పెళ్లాడినవాడు (3)
19) చనిపోయిన గొప్పవారికి అర్పించేది (3)
21) డొల్ల (2)

## పదరసం - 455 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| సం[1] | స్కా | రం[2] | | ఆ[3] | ద | రా[4] | బా | ద[5] | రా |
| ఘు | | క[6] | క్కు | ర్తి | | జీ | | మ్మి | |
| ర్ష[7] | ష్క | ని | | | మొ[8] | | | డి[9] | దా[10] |
| ణ | | క[11] | బం[12] | ధ | హ | స్తా | లు[13] | | ల్చి |
| | ఉ[14] | | జ | | మా | | ప[15] | స | న |
| పె[16] | లు | తు | రు | | టం[17] | రా | ఆ | | చె |
| | కు | | | లు[18] | | | ద[19] | ను[20] | క్కు |
| ఆ[21] | ప | ద్బాం | ధ | వు | డు | | | డి | |
| | లు | | | ర | | జా[22] | మ | కా | య |
| పా[23] | కు | డు | | క్రా[24] | శ | లం | | రం | |

సినిమా

అరుణ

సాధారణమైన కథను కొత్తగా చెప్పాలి. క్లిష్టమైన కథను సరళంగా చెప్పాలి అనేది సినిమాలకు సంబంధించిన ప్రాథమిక సూత్రం. చాలామంది దర్శకులు పాత కథలనే ఎంచుకుంటారు. అయితే కొత్తగా చెప్పడంతో అవి ప్రేక్షకాదరణ పొందుతాయి. మరికొందరు దర్శకులు సంక్లిష్టమైన కథను తీసుకుంటారు. కానీ ప్రేక్షకులకు అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్టుగా తెరపై చూపుతారు. దాంతో ఈ తరహా సినిమాలూ ప్రేక్షకాదరణ పొందుతాయి. కానీ ఓ కొత్త అంశాన్ని, సంక్లిష్టంగా చెప్పడానికి 'గామి' దర్శకుడు ప్రయత్నించడంతో ఇదో గమ్మత్తైన ప్రయోగాత్మక చిత్రంగా మిగిలిపోయింది. కొంతమంది ఈ ప్రయోగాన్ని, ప్రయత్నాన్ని అభినందిస్తుంటే మరికొందరు దర్శకుడు చెబుదామనుకున్న అంశం బుర్రలోకి చేరకపోవడంతో పెదవి విరుస్తున్నారు.



# గమ్మత్తైన ప్రయోగం 'గామి'

శంకర్ (విశ్వక్ సేన్)కు ఓ అరుదైన రోగం ఉంటుంది. తోటి మనిషి అతనిని తాకితే చావు అంచుల వరకూ వెళ్లిపోతాడు. చిత్రం ఏమంటే... అఘోరాల మధ్య ఉండే శంకర్‌కు తన గతం ఏమిటో కూడా తెలియదు. శంకర్‌కు ఉన్న ఈ జబ్బు ఓ శాపమని, అందువల్లే అతను ఉంటున్న ఆశ్రమంలో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని ఆశ్రమ నిర్వాహకుడు భావిస్తాడు. దాంతో; ఆశ్రమంలో వదిలి వెళ్లిపోయిన కేదార బాబాను కలుసుకుని, దీనికి ప్రాయశ్చిత్తం తెలుసుకోవాలంటూ అఘోర ఆశ్రమం నుండి అతనిని పంపేస్తారు. కాశీలోని కేదార బాబా ఆశ్రమాన్ని వెతుక్కుంటూ శంకర్ వెళతాడు. అయితే బాబా కన్నుమూశారని, కానీ శంకర్ సమస్యకు ఓ పరిష్కారం ఉందని బాబా శిష్యుడు చెబుతాడు. 36 సంవత్సరాలకు ఒకసారి హిమాలయాలలోని ద్రోణగిరిలో మాలిపత్రం వికసిస్తుందని, దానిని స్వీకరిస్తే శంకర్ వ్యాధి నయమౌతుందని చెబుతాడు. అదే పత్రం కోసం డాక్టర్ జాహ్నవి (చాందిని చౌదరి) కూడా ప్రయత్నిస్తూ ఉంటుంది. ఆమెకు కొంతవరకూ మార్గం తెలుసు కాబట్టి ఆమె సాయం తీసుకుని హిమాలయాలకు వెళ్లవలసిందిగా కేదారబాబా శిష్యుడు సలహా ఇస్తాడు. దాంతో వారిద్దరూ మాలిపత్రం కోసం బయలుదేరతారు.


ఇదిలా ఉంటే... శంకర్‌ను కొన్ని సంఘటనలు వెంటాడుతూ ఉంటాయి. ఓ తల్లి తన చిన్నారి కూతురు తల నిమిరినట్టు, వైద్య ప్రయోగశాలలో బందీగా ఉన్న ఓ యువకుడు అందులోంచి పారిపోవడానికి ప్రయత్నించి విఫలమైనట్టు కలగంటాడు. ఆ కలల ఆంతర్యం ఏమిటీ? శంకర్‌కు ఆ కలలో కనిపించే వ్యక్తులకు ఉన్న సంబంధం ఏమిటీ? డాక్టర్ జాహ్నవి సాయంతో శంకర్ హిమాలయాలకు చేరుకుని మాలిపత్రం పొందాడా? లేదా? అనేది మిగతా కథ.

కథగా చూసుకుంటే... రొటీన్ తెలుగు సినిమాకు ఇది పూర్తి భిన్నమైంది. కథాకాలాన్ని మనం ఊహించుకోవాలి కానీ ఎక్కడా దర్శకుడు ఇదమిత్థంగా ఈ సమయం నాటి కథ అని ప్రత్యక్షంగా చెప్పలేదు. బ్రిటీష్ వారు ఈ దేశాన్ని వదిలి వెళ్లిన తర్వాత, కమ్యూనిస్టు దేశాలు ప్రపంచంమీద ఆధిపత్యం కోసం రహస్యంగా మానవుల మీదనే దారుణ ప్రయోగాలు చేసే కాలం అనుకోవాలి. అలానే ఈ సంఘటనలు జరిగేది దేవదాసీ వ్యవస్థ ఉన్న కాలం కాబట్టి... ఇది నలభై యాభై సంవత్సరాల క్రితం నాటి కథ అనుకోవచ్చు. ఒకే వ్యక్తికి సంబంధించిన వివిధ దశలను ఏకకాలంగా చూపించడం వల్ల థియేటర్‌లోని ప్రేక్షకులు కొంత అయోమయానికి గురవుతారు. పైగా ఇది ఒక చోట జరిగే కథ కాదు. ఇటు ఆంధ్రప్రదేశ్‌లోని పల్లెటూరిలో, అటు వారణసిలో, మరో పక్క దేశ సరిహద్దులలోని హిమాలయ ప్రాంతంలోని వైద్య ప్రయోగశాలలో ఈ కథ సాగుతుంది. సినిమా ప్రారంభం ఆసక్తికరంగానే ఉన్నా, సి.ఎ.టి. క్యాంప్, దేవదాసి దుర్గకు సంబంధించిన సన్నివేశాలను ప్రధాన కథతో మిళితం చేస్తూ చూపేసరికి ప్రేక్షకులలో కన్‌ఫ్యూజన్ మొదలవుతుంది. శంకర్ నేపథ్యం ఇది కావచ్చు అని ప్రేక్షకులకు ఓ నిర్ణయానికి రాకుండా దర్శకుడు తెలివిగా కొన్ని ఊహాకందని మలుపులను సృష్టించాడు. అయితే అవి కన్విన్సింగ్‌గా లేకపోవడం, కథలోని మడతలను సులువుగా విప్పక పోవడం కారణంగా ఇదో విఫల ప్రయత్నంగా మారి పోయింది. క్లయిమాక్స్ సమయంలోనూ డాక్టర్ జాహ్నవి పాత్రను ప్రేక్షకుల ఊహకే వదిలేశాడు.

నటీనటుల విషయానికి వస్తే విశ్వక్ సేన్ తన కెరీర్ ప్రారంభంలో అంగీకరించిన సినిమా ఇది. షూటింగ్ పూర్తి అయినా... ఇది ప్రేక్షకుల ముందుకు రావడానికి దాదాపు ఐదేళ్ల సమయం పట్టింది. చాందిని చౌదరి, అభినయ, దయానంద్‌రెడ్డి, మహ్మద్ సమద్, శాంతిరావు, మయాంక్ ఫరఖ్, బేబీ హారిక తదితరులు చక్కటి నటన కనబరిచారు. సాంకేతిక నిపుణులు కూడా ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డారో తెర మీద తెలుస్తోంది. ముఖ్యంగా సినిమాటోగ్రఫీ, నేపథ్య సంగీతం అద్భుతమనే చెప్పాలి. హిమాలయాలలో చిత్రీకరించిన సన్నివేశాలు సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి. దర్శకుడు విద్యాధర్ కాగితకు కథ మీద ఉన్న పట్టు కారణంగా సినిమాను బాగా తీశాడు. అయితే కొన్ని సన్నివేశాలను, కీలక మలుపులను ప్రేక్షకులకు అర్థమయ్యేలా తీసి ఉంటే ఈ సినిమా మరింత ప్రజాదరణ పొంది ఉండేది. తెలుగులో ఈ తరహా సంక్లిష్టమైన కథాంశం కలిగిన సినిమాలు అరుదుగా వస్తుంటాయి. ఆ కోవకు చెందిన 'గామి' ఓ గమ్మత్తైన ప్రయోగాత్మక చిత్రంగా చెప్పుకోవచ్చు. యు.వి. క్రియేషన్స్ ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామి కావడంతో ఈ సినిమా విడుదల సులువైంది. లేకపోతే... ఇలాంటి సినిమాలు వెలుగు చూడటం కాస్తంత కష్టమే. ఏదేమైనా... దర్శక నిర్మాతల అభిరుచిని, ధ్యేయ నిష్ఠను అభినందించాల్సిందే!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.220/-





వెల : ₹.200/-





వెల : ₹.390/-





వెల : ₹.250/-





వెల : ₹.250/-





వెల : ₹.360/-





వెల : ₹.90/-





వెల : ₹.200/-





వెల : ₹.100/-





వెల : ₹.150/-





వెల : ₹.999/-





వెల : ₹.395/-




వెల :₹.495/-




వెల : ₹.799/-




వెల : ₹.599/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 19

# G. PULLA REDDY

## DEGREE & P.G. COLLEGE

(Affiliated to Osmania University)

**MEHDIPATNAM,** HYDERABAD - 28

**Ph : 23513154**

**English Medium** **Estd 1994** **Co-Education**

**(A College Striving for Excellence in Quality Education)**

## COURSES OFFERED

**B.Sc** (M.S.Cs) (M.P.Cs) (M.E.Cs)

**B.B.A**

**B.Com** (Computers Applications) (General)

**M.Sc** (Mathematics) (Physics)

**WE HAVE :** ✦ Well Equipped Labs & Library ✦ Qualified & Experienced Faculty ✦ Well Furnished Classrooms ✦ Campus Placements

**For Details contact office between *10.00 A.M. & 5.00 P.M***

**PRINCIPAL**